
ఆంధ్రమహిళ



NOVEMBER 1951 ANDHRA MAHILA ANNAS 8

ఆంధ్ర మహిళా ప్రెస్

ఆంధ్ర మహిళా సభ వారిచే స్వంతంగా స్థాపించబడినది

ఆంధ్ర మహిళా ప్రెస్

ఇక్కడ

గ్రంథములు, కరపత్రములు, రసీదులు, ఆహ్వాన పత్రికలు మొదలయినవన్నీ

తెలుగు, ఇంగ్లీషు భాషలలో ముద్రించబడును

విద్యార్థినులకు ప్రెస్ పనులు నేర్పటానికి క్లాసులుకూడ ఏర్పాటు చేయబడినవి

మీ అచ్చుపనులు ఆంధ్ర మహిళా ప్రెస్‌లో చేయించితే

సంస్థకు సహాకరించిన వారవుతారు.

ఇతర వివరములకు : ప్రెస్ మేనేజరు, **ఫోన్ నెం. 86322**

14 ద్వారక, మైలాపూరు, మద్రాసు 4.

ఆంధ్రమహిళాసభ

స్త్రీల విద్యా, విజ్ఞాన, సాంస్కృతిక, ఆర్థికోన్నతికై 16 సం॥ పైగా కృషి చేయుచున్న జాతీయ సంస్థ.

ఇందు

విద్యాశాఖ	—	ఆంధ్రమహిళ పత్రిక
పారిశ్రామిక శాఖ	—	నర్సింగ్ హోమ్
కళాశాఖ	—	ముద్రణశాఖ

సారస్వత, క్రీడా, గ్రంథాలయ, క్లబ్బు శాఖలు.

సభ్యురాండ్రుగా జేరి యీ సేవాసంస్థను పోషించండి.

—ఆంధ్ర మహిళా సభ

నేడు మీరు మెక్లీన్‌తో పళ్లు తోముకున్నారా?



"కొన్ని సంవత్సరాలుగా నేను మీ మెక్లీన్సు టూత్ పేస్టును వాడుతున్నాను. అప్పటినుండి నా దంత శోభను ఎల్లరు మిక్కిలి ప్రశంసిస్తున్నారు."

మీ ముఖమండలం ఆరోగ్యానంద పూరితమైన చిరునవ్వుతో వికసించ డానికై మెక్లీన్స్ పెరాక్సైడ్ టూత్ పేస్టును వాడండి. మెక్లీన్స్ మీ ఇగుళ్లను కాపాడి, శ్వాసను పరిమళ భరితమొనర్చి, పళ్లను ముత్యాలవలె మెరి సేటట్లుచేస్తుంది — ఇది వీటినన్నిటినీ ఏక కాలంలో సమకూర్చుతుంది.

మెక్లీన్స్ పెరాక్సైడ్ టూత్ పేస్టు ఒక ప్రత్యేకమైన సూత్రాన్ని అనుసరించి తయారు చేయబడినది. ఇది మిక్కిలి పరిశుభ్రమైనదని హామీ కలదు. అందుకే ప్రపంచమంతటా ప్రజలు రోజుకు రెండుసార్లు — నిత్యం మెక్లీన్సును ఉపయోగిస్తారు.

నేడే మెక్లీన్సును కొనండి!



MTY-4 TEL.

వ్యాపార విచారణకు వీరికి వ్రాయండి :— జె. యల్. మోరిసన్, సన్ అండ్ జోన్స్ (ఇండియా) లిమిటెడ్., మహాలక్ష్మి ఆలయమునకు ఎదురుగా, వార్డెన్ రోడ్, బొంబాయి 26.

ఆంధ్రమహిళ

సంపుటి 8 :: నవంబరు '51 :: సంచిక 7

ముఖచిత్రము : దీపావళి వెలుగులు

సంపాదకురాలు : శ్రీమతి దుర్గాబాయి, యం. యే., బి. యల్.

సహసంపాదకురాలు : శ్రీమతి చన్నఘంటమ్మ, యం. యే., యల్. టి.

ఆంధ్రమహిళా సభ, మైలాపూర్

సంవత్సర చందా ఆరు రూపాయలు

ఆంధ్రమహిళ

సంపుటి 8 | నవంబరు 1951 | సంచిక 7

ఎన్నికల మహాయజ్ఞం

అక్టోబరు ఆఖరు వారంలో హిమాచల ప్రదేశంలో ఆరంభమైన ఎన్నికలు సేతు పర్యంతం క్రమంగా వ్యాపించ బోతున్నవి. 17 కోట్లమంది ఓటర్లచే 3772 అభ్యర్థుల ఎన్నిక, ఏక కాలంలో జరుగ బోతూంది, ప్రజాస్వామ్య పథంలో సాగుతున్న మన భారత భువిలో. ఇందులో, 3283 గ్గురు రాష్ట్ర శాసన సభలకూ, 489 మంది ప్రజా ప్రతినిధుల సభకూ అభ్యర్థులు.

ఏ దేశంలోనూ, ఏ కాలంలోనూ ఇతఃపూర్వము కని విని ఎఱుగని, మహా ప్రళయముం బోలు మహా ప్రయోగమైన దీనిని మహా యజ్ఞమని నిర్వచించుటలో ఆక్షేపణ యుండబోదు. వివిధ పార్టీల నాయకులు, వారి అనుయాయులు, యీ యజ్ఞ వాటికలలో పౌరోహిత్యానికి సిద్ధమౌతున్నారు. "మీ ఓటును మా పౌరోహిత్యంతో యజ్ఞగుండంలో ధారపోయండి. ధర్మార్థ కామమోక్షములను సత్వరమే సిద్ధింపజేసెడి, ఇష్టదేవతా ప్రత్యక్షం చేయిస్తామ" నే పురోహితుల నినాదాలు, హెచ్చరింపులతో దేశం నలుమూలలా మారు మ్రోగి పోతూఉంది.

అసలు ఓటంటే ఏమిటో, ఓటుద్వారా తమకు గలిగిన హక్కేమిటో, ఓటును సద్వినియోగం చేయడంలో తమకుగల బాధ్యత ఎంతో, ఓటును దుర్వినియోగం చేయడంలో తాము చేచేతులా కొని తెచ్చుకునే తద్దినమేమిటో, అర్థము చేసికోగల వివేకము నిచ్చే విద్యగల ప్రజలు యీ 17 కోట్లలో అతిస్వల్ప సంఖ్యాకులనుటలో అతిశయోక్తిలేదు. అందువల్ల యీ పురోహితులు పూరించే శంఖారావాలలో ఏవి కల్లలో, ఏవి కావో అనే విచక్షణ ప్రజా సామాన్యంలో కలిగించే బాధ్యత, విద్యావంతులపైననూ, వివేకవంతులపైననూ ఎంతైనా కలదు.

ఏ పక్షపు అభ్యర్థులైనా చేసే నినాదం ఒకటే—"ప్రజాక్షేమమే మా పరమాశయము—ప్రజారక్షణయే మా లక్ష్యం" అని నాల్గేళ్లు పరిపాలించి ప్రజల అసమ్మతికి పాల్పడ్డ కాంగ్రెసు పక్ష అభ్యర్థులు, అధికార రాజకీయాలలో ఇంతవరకు ఇరుకుకొన లేకపోయిన సోషలిష్టు అభ్యర్థులు, కాంగ్రెసు పక్షీయులుగా ఉండి, ఇతఃపూర్వము తమ అధికార వ్యామోహము తీరే అవకాశమును బడయలేక, కొన్ని కారణాలచే పదవీ భ్రష్టులు కూడా అయి, ఇంకముందు

కాంగ్రెసులో వుండి నెగ్గలేకపోయే భయంచేత, కాంగ్రెసును తూర్పారపడ్తూ, అనేక పార్టీలు లేవనెత్తుతున్న వివిధ ప్రజా పార్టీలవారూ, అతివాదులూ, మితవాదులూ, దురాక్రమణ పరులైన కమ్యూనిష్టులూ—అందఱూ, తమ ప్రణాళికలలో తమ పార్టీ నెగ్గితే, ప్రజాభ్యుదయము సిసలంటూ అరచేతిలో స్వర్గాన్ని అగపరచాలని అతి శ్రమ పడుతున్నారు.

ఈ గందరగోళములో పార్టీ రాచకీయాలనుండి దూరంగా ఉండి, ఏ అభ్యర్థియైనా, విజ్ఞాని, వివేకవంతుఁడు, దీక్ష, దక్షతగలవాడు, దేశాభ్యుదయం స్వార్థంకన్న మిన్నయని విశ్వసించేవాడు అని విశ్వాసము తోస్తేనే ఓటు చేయుట ప్రజా శ్రేయస్సునకు కారణము కాగలదు—నినాదాల ఒత్తిడికిలోనై, పక్ష రాచకీయాల్లో ఇరుకుకొని, ఏ అప్రయోజకుడు, మోసగాఁడు, స్వార్థపరుడు అయిన వానికో ఓటు చేయుట తమ గొయ్యి తామే తవ్వుకొనునట్లుగును గాన, వివిధ ప్రదేశాలలోని వివేకవంతులు, విద్యావంతులు అయిన స్త్రీ పురుషులు, ఆ ఆ ప్రాంతాలలో అభ్యర్థులుగా నిలిచేవారిని గూర్చిన మంచిచెడ్డలను గ్రహించి, ప్రాంతీయ జన సామాన్యానికి తెలియజేసే బాధ్యత పూనుకోవాలి. ఈ నాడు ఓటునందుకొని అందనము నెక్కి, రేపటినుండి మననుండి వంగిసలాములు పెట్టించుకుంటూ, మన మీఁదే సవాలు చేస్తూ, మన శ్రేయస్సును అడుగుకునెట్టి, స్వార్థాన్ని పెంచుకోగల అభ్యర్థులని తోచిననాడు, ఏ పార్టీకి చెందినవాడైనా సరే ఓటుచేయక పోవటం మన ధర్మం. తమ భవిష్యత్తును నిర్మించుకోవలసిన పెద్ద బాధ్యత, యీ 17 కోట్ల ఓటర్లపైనా ఉన్నది. అప్రమత్తతో సంచరించనిచో, యింతమంది ఓటుచేసిన ప్రజాస్వామ్యం, గాడిద గంపెడుఊక తిన్నదన్న సామెతగా ఉంటుంది.

★

కృతజ్ఞత

శ్రీ పబ్బిచెట్టి రాఘవులు చెట్టి చారిటీస్ ధర్మకర్తృత్వ సంఘంవారు పారిశ్రామిక శాఖ బీద విద్యార్థినుల భోజన నిధికని రూ 50/— విరాళముగా యీ సంవత్సరము కూడ ఇచ్చిరి. మూడు సంవత్సరములనుండి యీ విరాళమును కృతజ్ఞతతో అందుకొనుచున్నాము.

శ్రీమతి వై. శేషగిరమ్మగారు, ఆంధ్ర మహిళా సభకు రూ. 100/- సభ్యత్వ రుసుము కట్టి, యావజ్జీవ సభ్యురాలైరి.

కరెస్పాండెంటు
పారిశ్రామిక విద్యాలయము.

హిందీ పరీక్షా ఫలితములు

ఆగష్టులో జరిగిన హిందీ పరీక్షలలో విజయము నొందిన ఆంధ్ర మహిళా సభ విద్యార్థినుల పేర్లు దిగువను ప్రకటించుచున్నాము.


ప్రాథమిక్

ప్రథమ శ్రేణి — టి. కె. కమల
ద్వితీయ శ్రేణి — కె. నళినీకుమారి
,, — కె. కమల

మధ్యమ

ద్వితీయ శ్రేణి — ఎస్. సరస్వతి
,, — ఎస్. జయలక్ష్మి

నూత్న వధూవరులు



చిరంజీవి సౌభాగ్యవతి లీల—చిరంజీవి మాధవరావుబాజీ

లీల శ్రీ బెన్నూరి నారాయణరావుగారి కుమార్తె; శ్రీమతి గుమ్మిడీదల దుర్గాబాయి, ఎమ్. పి. గారి మేనగోడలు.

ఆంధ్ర మహిళా సభకు అంకురమైన 'Little Ladies of Brindavan' లో ప్రథమ సభ్యురాలుగా, వ్యవస్థాపకత్వాన్ని సంపాదించుకుంది లీల. తనతోపాటు పెరుగుతూ వచ్చిన మహిళా సభ అభివృద్ధికై, ప్రతి రంగంలోనూ, ముఖ్యంగా మహిళాసభ ఖ్యాతి గడించిన నృత్య ప్రదర్శనాలలో, పాల్గొని, ఇతోధిక సేవ జేసింది. సభ విద్యాలయంలోనే మెట్రిక్యులేషన్, ఇంటర్ మీడియట్ పరీక్షలకు చదివి కృతార్థురాలైంది. త్వరలోనే పట్టభద్రురాలు కాబోతూంది.

విజయదశమి పర్వదినంనాడు లీలకు మాధవరావు బాజీతో వివాహమైంది. వీరి దాంపత్య లత, భగవంతుని అనుగ్రహముతో, సర్వాంగ సౌష్టవముగా, శోభాయమానంగా వర్థిల్లి ఆదర్శ ప్రాయమై వెలుగొందాలని, ఆంధ్ర మహిళాసభ ఆశీర్వాద పూర్వక అభినందనాలను అర్పిస్తూ ఉంది.

ప్రస్తుత పరిస్థితులు

❋ శ్రీమతి అచ్యుతుని గిరిజ ❋

ఎలక్షను—విద్యార్థుల ఆదర్శం :

మొన్న నీమధ్య పెన్సిలిన్ కనిపెట్టిన శాస్త్రవేత్త సర్ అలెగ్జాండరు ఫ్లెమింగ్, లండనులోవున్న భారతీయ విద్యార్థులతో ప్రసంగించాడు. ఆ సందర్భంలో కృతార్థులు కావటానికి ఒక చిన్న చిట్కా చెప్తానన్నాడుట. ఏమాత్రో ఇంజక్షనో చెప్తాడనుకుని విద్యార్థులు చిత్తం చిత్తమంటు మరింత దగ్గరగా చేరారుట. అప్పుడాయన చిరునవ్వుతో ఇదుగో అబ్బాయిలూ చూశారూ, జాగ్రత్తగా వినండి. మీరు కష్టపడి కృషి చేయాలి. ఆ పైన అదృష్టం కూడ కలిసి రావాలి. అంతే—అన్నాడుట.

ఆయన అదృష్టంకూడ కలిసిరావాలి అని అన్నాడు. కాని కృషిచేస్తే కలిసిరాదా అని అఖిలభారత విద్యార్థి సమితివారి వుద్దేశం. అక్టోబరులో మద్రాసులో అ. భా. వి. సమ్మేళనం జరిగింది. 11 రాష్ట్రాలనుంచి విద్యార్థి ప్రతినిధులు వచ్చారు, అయిదు రోజుల కార్యక్రమం. ఎన్నో చర్చోపచర్చలు జరిపి కొన్ని తీర్మానాలు పథకాలు తయారు చేశారు. బడి జీతాల తగ్గింపు, వుచితవిద్య, అందరిని పరీక్షలకు పంపించటం మొదలయిన కోరికలు వెలిబుచ్చారు. జరగబోయే ఎలక్షన్లు వారిచర్చలో ఒక ముఖ్యాంశం. “ప్రస్తుతం మనదేశం ఆర్థికంగా, సాంఘికంగా, వెనకబడి వున్నది. విద్యార్థుల పరిస్థితులు బాగా లేవు. ఈ పరిస్థితులను మార్చి దేశాభ్యుదయానికి తోడ్పడగల అభ్యర్థులను రేపటి ఎన్నికలలో ఎన్నుకోవలసి వున్నది. ఏ రాజకీయ పార్టీగాని వర్గంగాని వుత్తమమైన దనే వుద్దేశం లేదు. అభ్యర్థి ఏ పార్టీకి చెందినా మేలు అనే మాట ఒకటే. మాకు దేశానికి యీ యీ విషయాలు కావాలి. అవి నెరవేర్చగల సమర్థులకే మా సహకారం, వోటు లభించుతయ్. ప్రతి విద్యార్థి తన ప్రదేశపు పరిస్థితులకు విషయాలకు అనుగుణ్యంగా ఆలోచించి వోటు చేయాలి గాని ముఖ్య సూత్రమంటు వుండదు. వీటన్నింటికి అనుగుణ్యంగా ఎలక్షన్లు ప్రశాంతంగా, న్యాయంగా, నిష్పాక్షికంగా జరిపించాలి.” ఎలక్షన్లను గురించి అ. భా. వి. స. వారి అభిమతంయింది.

ఇదే అభిమతాన్ని భారత మహిళలు వరవడిగా పెట్టుకుని ఉపక్రమించితే చాలా లాభం వుంటుంది. ముందు తమకు ఏమి కావాలో చక్కగా ఆలోచించుకుని, అవన్నీ ఒక ప్రణాళికగా కూర్చాలి. నిర్మొగమాటంగా అభ్యర్థులతో మాకు యివి కావాలని తెలియ చెప్పాలి. ఆ విషయాలు అర్థం చేసుకోగల సామర్థ్యం గలవాళ్లని, అవసరం వచ్చినప్పుడు విషయాలను పైవాళ్లకు విప్పి చెప్పటానికి నోట్లో నాలిక వున్నవాళ్లను, అభ్యుదయ మార్గాలను ఆలోచించటానికి తగిన సరుకువున్న విద్యావంతులను, వ్యక్తిగతంగా చూసి, విమర్శించి వోటు యివ్వాలని ప్రయత్నిస్తేనే మనకు మోక్షం. కేవలం పార్టీ టిక్కెట్టుతో నిలబడిన అప్రయోజకులకో, స్వార్థపరులని తెలిసిన వారికో, రాజకీయ కారణాల వల్లగాని యితర వొత్తిడి వల్లగాని వోటు నివ్వరాదు. అప్పుడే వయోజన వోటింగు ప్రయోజనకారి అవుతుంది. అందుచేత మహిళలంతా మనదే ముందిలెమ్మని అనుకోక, తగిన జాగ్రత్త తీసుకుని వివేచనా శక్తిని వినియోగించి తీరాలని ఒక తీర్మానం ముందు చేసుకుంటే మంచిది. అప్పుడు ఫ్లెమింగ్ మహాశయుడు చెప్పినట్లు మన కృషికి అదృష్టం తోడై కృతకృత్యులం కాగలం.

గుజరాతు—మేఘనాధుడు


గాంధీ మహాత్ముడి జన్మవల్ల గుజరాతుకువచ్చిన గొప్పను సర్దారు పటేలు పదవికి వచ్చి స్థిరంచేశాడు. ప్రభుత్వంవారు గుజరాతుమీద మిడతనైనా వాలనీయరు. చివరకు అర్జునుడు ఒక్క బాణంవేసి తాతగారికి దాహం తెప్పించి యిచ్చినట్లుగా రాష్ట్ర ప్రభుత్వంవారు, విమానాల్లో వెళ్లి మేఘాలను వెంటాడి పట్టి వాన కురిపించి, అర్జునుడేకాక మేఘనాథుడు కూడ అవుతున్నారు. వీళ్లనుచూసి దేవేంద్రుడలుకతోడను వావిరిగా రాళ్లవాన పడిగురియింప వచ్చాడనుకోండి. వాళ్లకేం భయం. విమానాల్లో పయికివెళ్లి రబ్బరు గుడ్డతొన్లు విప్పి పట్టుకుంటారు. ఇంక జరిగే తంతు అంతా ఆఘ మేఘాలమీద అంతరిక్ష మార్గానే. ప్రస్తుతం మేఘాలమీద మందులు మాకులు చల్లి మేఘాలు కరిగి

ప్రస్తుత పరిస్థితులు

వాన కురిసేటట్లు చేస్తూన్నా రనుకోండి. ఇంక నాలుగు రోజులు పోతే యింకా వుపాయాలు సాధనాలు తప్పక హెచ్చుతయ్. అప్పుడు రాత్రింతల వాన కురిపిస్తారు. తెల్లవారి కాఫీలకు పాలవాళ్లు బయలుదేరే వేళకు వాన ఆపు చేస్తారు. ఇంకా నాలుగు రోజులు గడచిన వనుకోండి. అప్పుడు రేడియోతో వింటున్నట్లే ఒక్కొక్క రైతు ఒక వానయంత్రం పెట్టుకుంటాడు. తనకు ఎప్పుడు కావాలో అప్పుడు, ఎంత కావాలో అంత వాన తన పొలంమీద మాత్రం కురిపించు కుంటాడు. ఇవన్నీ వుత్తవూహాలని భ్రమ పడకండి. ప్రజాహితం కోసం సత్సంకల్పంతో ఆరంభించిన సత్కార్యం వృద్ధికి ఎందుకురాదు?

అయితే మనకు మాత్రం యీ అవకాశాలు వుండక పోతయ్యా అని ఆశపడతారేమో. అటువంటి వెర్రిమొర్రి ఆశలు మాత్రం పెట్టుకోకండి. ఆ మాటకొస్తే బొంబాయి రాష్ట్రంలో వచ్చిన యే సంస్కరణలు మనకు వచ్చినవి గనక? మద్రాసు ప్రాంతీయులు మేధా సంపన్నులని పేరు గడించారు. పనికి ఆలోచనకు పొత్తు కుదురదు. ఒకపని చేశామంటే ఆ ఆలోచన అంతటితో అయిపోతుంది. ఊరు కున్నా మనుకోండి. ఆలోచనలు శాఖోపశాఖలుగా వామ నావతారమల్లే వ్యాపించుతయ్. ఆ బిస కనిపెట్టే మనవాళ్లు రామపాద సాగరాలంటి వాట్ల నెన్నింటినో పదిలంగా బుర్రల్లోనే దాచారు. రాయల సీమలాంటి ప్రదేశాల్లో యే బుద్ధిన వుండో మన రాష్ట్ర ప్రభుత్వంవారు వాన కురిపించాలని అనుకోబోతున్నాం అని అంటా రనుకోండి. వెంటనే కొంతమంది నాయకులు—తెలుగు జిల్లాలమీద ఎగిరివచ్చిన మేఘాలను మాగడ్డమీద వాన కురిపించి వాళ్లదే పైచెయ్యి అని చూపించ వూనుకున్నారా—అని నిలవ తీస్తారు. ఇంక మద్రాసుమీద కురిసే మేఘాలు ఎవరివిగా వుండాలో ఎట్లా తేల్చటం? కృష్ణాపెన్నారు తీర్థాలలో, మద్రాసు వీధుల్లో వ్యాపించివున్న రాష్ట్రయుద్ధం మేఘాల దాకా నడుస్తుంది. ఇంకవచ్చే మేఘసందేశాలకు, మెయిలు రాయబారలకు అంతు వుండదు. ఏ గాలికి ఏ మేఘం యెటువచ్చి తగులు తుందో మన కొందుకొచ్చిన రభస అని ప్రభుత్వంవారు అసలే పూనుకోరు. అయినా మనకున్న రాజకీయ రద్దిలో యిటువంటి పనులకు తీరిక ఎక్కడ వుంటుంది.

★



రాజకీయాలు

* శ్రీ గోళ్లమూడి రామచంద్రరావు *

అక్టోబర్ నెలలో బ్రిటిష్ గొప్పదనానికి ఆఖరుదశ ప్రారంభమయినట్లు చెప్పవచ్చు. ఈ నెలలోనే పర్షియా నూనె గని ప్రాంతాలనుంచి బ్రిటిష్ సిబ్బందికి ఉద్వాసన జరగటం, తన ఒప్పందపు షరతులను మార్చాలని ఇరాక్ కోరటం, సూయజ్ ప్రాంతంలో ఉన్న బ్రిటిష్ సేనలను ఉపసంహరించుమని సుడాన్‌ని తనకు అప్పజెప్పి పొమ్మని ఈజిప్టు స్పష్టపరచటం, మొదలైన చిక్కులన్నీ బ్రిటన్‌కు సంక్రమించినవి. అయితే వీటన్నిటికన్నా పెద్దదెబ్బ, సాంఘిక వ్యవహారాల్లో బ్రిటన్ సాధించిన అభివృద్ధిని తుడిచిపెట్టే ప్రమాదం, ఈ నెల 25వ తేదీన జరిగిన ఎన్నికల్లో కన్సర్వేటివ్ పార్టీ గెలుపువల్ల ఏర్పడ్డది.

క్రిందటి నెలలో సూచించినట్లుగా ఎన్నికల్లో కన్సర్వేటివ్ పార్టీ గెలిచింది. కామన్స్ సభలోని 625 స్థానాల్లో ఫలితాలు 624 స్థానాలకు తెలిసినవి. కన్సర్వేటివులకు 321, లేబర్ పార్టీకి 294, లిబరల్ పార్టీకి 6, ఇతర పార్టీలకు 3 స్థానాలు వచ్చినవి. కన్సర్వేటివ్ నాయకుడు చర్చిల్ ప్రధాన మంత్రిగానూ, ఈడెన్ విదేశాంగ మంత్రిగానూ మంత్రివర్గం ఏర్పడ్డది.

కన్సర్వేటివ్‌లకు ఇప్పుడు ఉన్న మెజారిటీ అట్టే పెద్దది కాకపోయినప్పటికీ, లేబర్ ప్రభుత్వం రద్దుచేసిన విశ్వ విద్యాలయ నియోజక వర్గాలను మళ్లీ ఏర్పాటుచేసి, మొదటినుంచీ కన్సర్వేటివ్‌ల స్థావరాలుగా ఉన్న ఆ స్థానాలలో మెజారిటీని పెంచుకోవచ్చు. అంతేకాక లేబర్ ప్రభుత్వం కన్సర్వేటివులు ఎక్కువగా ఉన్న లార్డ్స్ సభ అధికారాలను కొన్నింటిని తగ్గించి వేసింది. కన్సర్వేటివులు ఇప్పుడు మళ్లీ ఆ అధికారాలను ఇచ్చి తమ స్థానాన్ని బలపరచుకొనటానికి కూడా ప్రయత్నించవచ్చు. లిబరల్ పార్టీ మంత్రివర్గంలో చేరటానికి నిరాకరించినా, కన్సర్వేటివ్‌లతో సహకరించటానికే సిద్ధంగా ఉన్నారు. ఈ అంశాలు అట్లావుండగా, ఆస్ట్రేలియా, న్యూజీలాండ్ లలోని కన్సర్వేటివ్ ప్రభుత్వాలూ, దక్షిణాఫ్రికాలోని మలాన్ ప్రభుత్వమూ, అమెరికా ప్రభుత్వమూ బ్రిటిష్ కన్సర్వేటివులను పూర్తిగా బలపరుస్తవని నిస్సందేహంగా చెప్పవచ్చును. అదీకాక, మధ్య ప్రాచ్యదేశాల్లో కలిగిన జాతీయ చైతన్యానికి ఫలితంగా అక్కడ బ్రిటనుకు కలిగిన చిక్కులను కన్సర్వేటివ్ ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న ఆశ బ్రిటిష్ ప్రజలకు ఉన్నది.

ఈ కారణాలనుపట్టి, కన్సర్వేటివ్ ప్రభుత్వం లేబర్ ప్రభుత్వ విధానాలకు సున్నా చుట్టటంలో తటపటాయిస్తుందని కొంతమంది ఆశపడటం నిష్ప్రయోజనమేమోనని తోస్తున్నది.

లేబర్ ప్రభుత్వం తన విధానాలను ధైర్యంగా అనుసరించలేకపోవటంవల్లనే ఓడినట్లు అన్ని దేశాల అభ్యుదయ వర్గాలూ భావిస్తున్నారు. కన్సర్వేటివ్ ప్రభుత్వం ప్రపంచంలో యుద్ధాలకు కూడా దారితీయవచ్చునని ఇండోనేషియా, ఈజిప్టు మొదలైన దేశాలు భయపడుతున్నవి. ఆ ప్రభుత్వం ఇండియా పట్ల ప్రతికూలంగా ఉంటుందనీ, కాశ్మీర్ వ్యవహారంలో పాకిస్థానుకు ఇంకా ఊతం ఇస్తుందనీ, ఇంకనుంచీ కామన్వెల్తులో ఇండియా సభ్యురాలుగా ఉండలేదనీ, ఇండియా వర్గాలు చెప్తున్నారు. ఏది ఎట్లా ఉన్నా, కన్సర్వేటివులు అమెరికా మాటలువిని తమ వ్యాపారాన్ని పోగొట్టుకోరు. చైనా, తూర్పు యూరప్ దేశాలతో వ్యాపారాన్ని వృద్ధి చేసుకునే ఉద్దే

శంతో రష్యాను కొంచం మంచిచేసుకొనటానికి కూడా ప్రయత్నిస్తారు.

* * *

1936 సం॥ వరకూ ఈజిప్టు, సుడాన్‌లు దాదాపు బ్రిటిష్ వలసలుగానే ఉండేవి. అప్పుడు సూయజ్ ప్రాంతంలో బ్రిటిష్ సేనలు ఉండే షరతుమీద ఈజిప్టు స్వాతంత్ర్యాన్ని పొందింది. 1899 నుంచీ సుడాన్ ఈజిప్టు, బ్రిటన్‌లు రెండింటికీ సమిష్టి డొమినియన్‌గా చేయబడ్డది. కాని నిజానికి అధికారమంతా బ్రిటన్ చేతుల్లోనే ఉన్నది. బ్రిటిష్ సేనలు నిలవటానికి అవకాశం ఇస్తున్న 1936 ఒప్పందాన్నీ, సుడాన్‌పై బ్రిటిష్ అధికారాన్ని అంగీకరిస్తున్న 1899 ఒప్పందాన్నీ ఈజిప్టు పార్లమెంటు అక్టోబర్ 15 న రద్దు చేసింది. ఈజిప్టురాజు ఫరూక్‌ను సుడాన్ రాజుగా ప్రకటించింది.

అయితే ఈ ప్రకటనలను బ్రిటన్ అంగీకరించలేదు. ఉభయపక్షాల సమ్మతి లేనిదే ఒప్పందాలను రద్దు చేయరాదని బ్రిటన్ వాదిస్తున్నది. అయితే ఒప్పందాలను సవరించాలని ఈజిప్టు గడచిన నాలుగేళ్లనుంచీ కోరుతున్నా బ్రిటన్ దానిని సానుకూలం చేయలేదు. ఈజిప్టు ప్రజలు బ్రిటన్‌పట్ల అతి తీవ్రనిరసనను ప్రకటిస్తున్నారు. బ్రిటిష్ సేనలు, నౌకలు సూయజ్ ప్రాంతానికి చేర్చబడుతున్నవి. ఉభయ సేనలకూ కొన్ని సంఘర్షణలు కూడా జరిగినవి. ఈజిప్టు ప్రభుత్వం బ్రిటన్‌లో సహాయ నిరాకరణం చేస్తున్నది. ఏ క్షణాన్నయినా భగ్గుమనేట్లుగా ఉన్న ఈ పరిస్థితుల్లో, బ్రిటన్ కరుగ్గా వ్యవహరించవలసిందేనని పట్టుపట్టే కన్సర్వేటివ్‌లు అధికారంలోకి రావటం మరింత ప్రమాదం తెచ్చిపెట్టింది.

సుడాన్ ప్రజల 'అభిప్రాయం' కనుక్కొనందే దానిని విడిచిపెట్టేది లేదని బ్రిటన్ చెపుతున్నది. ఇండియా, పాకిస్థాన్ విభజన సందర్భంలో, తమ ప్రాంతం స్వతంత్రం కావాలని కోరిన పఠానుల అభిప్రాయాన్ని బ్రిటన్ ఏ విధంగా 'నిర్ణయించిందో' అందరికీ తెలుసు.

పర్షియానుంచి ఈ నెల మొదట్లో బ్రిటిష్ సిబ్బంది అంతా ఇంటికి వెళ్లిపోయింది. అంతర్జాతీయ న్యాయస్థానం పర్షియానూనె జాతీయకరణం వ్యవహారంలో ఇచ్చిన 'ఇంజన్‌క్షన్' ఉత్తరువును పర్షియా నిరాకరించినందుకు దానిని మందలించాలనీ, తిరిగీ తనతో సంప్రదింపులు జరపవలసిందిగా పర్షియాకు ఆజ్ఞాపించాలనీ బ్రిటన్ భద్రతా మండలిని కోరింది. కాని ఆ కోరికను ఇండియా మొదలైన దేశాలు సమర్థించనందువల్ల నెగ్గే అవకాశం కనిపించలేదు. నూనె వ్యవహారం తన సొంత విషయం కనక అందులో భద్రతామండలి జోక్యాన్ని సహించేదిలేదని పర్షియా నాయకులు స్పష్టపరిచారు.

పర్షియా అడుగుజాడల్లో ఇరాక్ (ఇక్కడి నూనెగనులు కూడా బ్రిటన్ చేతిలోనే ఉన్నవి) కూడా నడుస్తూ, బ్రిటన్‌కు నూనె హక్కులు, సేనలు నిలిపే హక్కులు ఇచ్చిన పాత ఒప్పందాలను సవరించవలసిందని కోరింది.

* * *

మధ్య ప్రాచ్యదేశాలన్నిటిలోనూ జాతీయ చైతన్యం విజృంభిస్తున్నది. తమ దేశాలను దోచుకుంటూ, తమ గొంతులమీద కూర్చుని పీడిస్తున్న బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా మొదలైన పశ్చిమ రాజ్యాలమీద ప్రజలకు ద్వేషం పెరిగిపోతున్నది. అందువల్ల వెనుక పశ్చిమ రాజ్యాలతో ఒప్పందాలు చేసుకున్న నాయకులే ఇప్పుడు ప్రజాభిప్రాయానికి భయపడి, పశ్చిమ రాజ్యాలను ప్రతిఘటిస్తున్నారు. తమ గొంతులమీద కూర్చున్న పశ్చిమ రాజ్యాలు పరదేశాల స్వేచ్ఛను రక్షిస్తవని అరబ్ ప్రజలు నమ్మలేక పోతున్నారు. అందువల్లనే పశ్చిమ రాజ్యాలు మధ్య ప్రాచ్య 'రక్షణ' కని సూచించిన ప్రతి పాదనలను అరబ్ దేశాలన్నీ తోసివేసినవి. అరబ్ దేశాల పరిపాలకులకు ఇష్టం లేకపోయినా, పశ్చిమ రాజ్యాలపట్ల ప్రజల్లో కలిగిన తీవ్రక్రోధంవల్ల ఆ దేశాలు సోవియట్ రష్యాకు మరింత దగ్గరగా వెడుతున్నవి.

ఈజిప్టు మొదలైన వ్యవహారాల్లో పశ్చిమ రాజ్యాలు సక్రమ పరిష్కారానికి అంగీకరించక పోతే, అరబ్

రాజ్యాలన్నీ కలిసి బ్రిటన్, (ఈజిప్టు, సుడాన్, ఇరాక్‌ల శత్రువు), ఫ్రాన్స్ (మొరాకో, ఆల్జీరియా, ఉత్తరాఫ్రికా అరబ్బుల శత్రువు), అమెరికా (అరబ్ రాజ్యాలన్నిటికీ శత్రువయిన ఇస్రేలుకు మద్దతుదారు) లమీద, నవంబర్‌లో జరిగే సమితి సమావేశంలో తీవ్రచర్యలు తీసుకోబోతున్నట్లు తెలుస్తున్నది.

* * *

పాకీస్థాన్ ప్రధానమంత్రి లియాకత్ అలీఖాన్ 16వ తేదీ సాయంత్రం రావల్పిండిలో ఉపన్యసిస్తుండగా, ఒక సరిహద్దు ప్రాంతవ్యక్తి తుపాకితో కాల్చి హత్యచేశాడు. హంతకుడు స్వతంత్ర పఠానిస్థాన్ వాది అని కొందరూ, కాశ్మీరులో తీవ్రవైఖరి అవలంబించినందుకు లియాకత్ పట్ల అసంతృప్తిపడ్డ ఖాక్సార్ వర్గంవాడని కొందరూ అంటున్నారు. ఇదివరకు ఖాక్సార్ వర్గపు వ్యక్తే ఒకడు జిన్నాను బొంబాయిలో హత్యచేయ ప్రయత్నించాడు. పాక్ ప్రభుత్వాన్ని కూలదోయటానికి కుట్రచేశారని కొందరు ముఖ్యమైన సైనికాధికారులను కొన్ని నెలల కిందటే అరెస్టుచేసి ఉన్నది.

లియాకత్ తరువాత, గవర్నర్ జనరలుగా ఉన్న నజీముద్దీన్ ప్రధాని అయినారు. కాని ఆయనవైఖరి చూస్తే ఇండియా పట్ల మిత్రవైఖరి ఎక్కువగా కనిపించటంలేదు. కాశ్మీర్ వ్యవహారంలో లియాకత్ అలీ సూచించిన 'పిడికిలి, పోటు విధానాన్నే ఈయన ఇంకా ఘాటుగా అనుసరించవచ్చునని తెలుస్తున్నది. కాశ్మీర్ సమస్యమీద మధ్యవర్తి గ్రాహం భద్రతా మండలికి ఈ నెల 15న 2వ నివేదికను సమర్పిస్తూ, ఉభయ దేశాలమధ్య యుద్ధప్రచారం మొదలైనవి నిలిచిపోవాలనీ, మళ్లీ అంగీకారం కుదుర్చుకునే ప్రయత్నాలు చేయాలనీ సూచించారు. కాశ్మీర్ ప్రధాని అబ్దుల్లా మాంచెస్టర్ గార్డియన్ విలేఖరితో మాట్లాడుతూ అజాద్ కాశ్మీర్ నాయకునితో సమాధాన పడగలనని సూచించారు.

ఇటీవల—ఈ నెలలో రెండోసారి—రష్యాలో అటం బాంబు పేలినట్లు అమెరికా ప్రకటించింది. తాము అటం బాంబులను పరీక్షిస్తున్నమాట నిజమేననీ, అయితే అది కేవలం ఆత్మరక్షణకేననీ స్టాలిన్ ప్రకటించారు. అటం బాంబు రహస్యం అమెరికా, రష్యాలకే కాదు మాకుకూడా తెలుసునని పెకింగ్ రేడియో కూడా ప్రకటించింది.

వీటిఫలితమో, మరేకారణమోకాని, కొరియాలో మళ్లీ యుద్ధవిరమణ సంప్రదింపులను ప్రారంభించటానికి అమెరికా ఒప్పుకున్నది.

* * *

కాంగ్రెస్ ఎన్నికల సన్నాహాలు ఒక పక్కన జోరుగా జరుగుతున్నవికాని మరొక పక్కన అన్ని రాష్ట్రాల్లోనూ కాంగ్రెసులో తీవ్ర అభిప్రాయ భేదాలు ఏర్పడ్డవి. పంజాబ్, ఉత్తరప్రదేశ్, బీహార్, మద్రాస్‌నగరం, మధ్యభారత్ మొదలైనచోట్ల అవి చాలాతీవ్రంగా ఉన్నవి. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు టాండన్‌గారు ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డునుంచి తప్పుకోవలసి వచ్చింది. హిందూ మహాసభకు సన్నిహితమయిన సంస్థలన్నీ కలిసి అఖిలభారత జనసంఘమనే పార్టీగా ఏర్పాటయినవి. ఇన్నాళ్లనుంచీ కాంగ్రెసులో ఉన్న జాతీయ సిక్కులు, కాంగ్రెసుపట్ల అసంతృప్తిపడి అకాలీలతో కలిసిపోవటానికి నిశ్చయించుకున్నారు. తమిళనాడు జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కాంగ్రెసును ప్రతిఘటించటానికి నిశ్చయించుకున్నది.

* * *

ఆంధ్ర రాష్ట్రంమీద నవంబర్‌లో సత్యాగ్రహం చేస్తామని స్వామి సీతారాం పరివారం చెపుతున్నారు. ఆయన వ్యక్తిగతంగా చేసే కృషిని కోస్తాప్రాంతాల్లో కాకుండా, అది నిజంగా అవసరమయిన రాయలసీమ, చెంగల్పట్, మద్రాసు ప్రాంతాల్లో జరిపితే చాలా మేలుగా ఉంటుందని అనిపిస్తున్నది.

★



పృథ్వీరాజు

* * *

నాటిక

* * *

* శ్రీ బులుసు సీతారామశాస్త్రి *

[చారిత్రికాంశములలో కొలది మార్పులతో రచింపబడినది. వృథా విద్వేషములతో అంతఃకలహములకు లోనయిన వారి గతి నిరూపించెడి దలపే యీ రచనలకు కారణము—

రచయిత]

మొదటి రంగము

(స్థానము: ఢిల్లీ. రాజభవనములో, పృథ్వీరాజ మందిరములో, సముచిత స్థానాలలో పృథ్వీరాజు, రాణీ సంయుక్త కూరుచుండి యుందురు.)

పృథ్వీరాజు : ప్రియతమా! నీ నిష్కళంకమైన అనురాగమునకు, మీదుమిక్కిలి మహారాజ మండలిని తండ్రిని ధిక్కరించి నిర్భీకముగా పయనించిన నీ సాహసమునకు నే నానంద పరవశుడ నగుచున్నాను. మఱియు నిన్నెటు లభినందింప వలయునో తెలియకున్నాను.

సంయుక్త : ప్రియా! మానవ జన్మమెత్తి యుక్తాయుక్త పరిజ్ఞానముకల ఏ సామాన్యవ్యక్తియైన చేయగల, చేయదగు కృత్యము మాత్రమే నే చేసినది. దీని కభినందన మవసరమని నే భావింపజాలను.

పృథ్వీ : కాని ఒక్క విషయము మాత్రము నాకు బాధాకరముగా తోచుచున్నది. జన్మించినదాది నానా కష్టములుపడి పెంచి పెద్దచేసిన తండ్రి కవమానము కలిగించుటంత యుక్తము కాదేమో అని.

సం : జనకుని కరుణవలననే వివేకము గాంచితిని. వివేకమునకు దగినట్లుగా మహావీరుని దేశరక్షణ దీక్షాబద్ధకంకణుని వరించి, యుక్తమే ఆచరించితిని. ఇది తండ్రి కవమాన కరమెట్లు కాదగును?

పృథ్వీ : తాను పరమ శత్రువుగాను నీచాతి నీచుడుగాను భావించి స్వయంవరమునకు మర్యాదకైనను ఆహ్వానము పంపకపోవుటేకాక ప్రతిమా రూపమున ద్వారదేశమున నిల్పిన వానిని వరించుట అవమాన కరముగాక మఱేమి?

సం : అది నా నేరము కాజాలదు. దేవతా విగ్రహమును రత్నసింహాసనమునుండి తొలగించి పెంటకుప్పపై నుంచిన అజ్ఞానమునకు నా కృత్య మవమానకరముగా తోచిన నేనేమి చేయగలను?

పృథ్వీ : కేవలము అవమానకరమే కాదు. నీ చర్య జనకుని మహాయుద్ధమున దగుల్కొనజేసి భారత దేశ స్వాతంత్ర్య సంరక్షణ కంతరాయముగా పరిణమింప జేయగలదని నీ వూహింపలేదని నే తలపోయజాల.

సం : మీ వాక్కుల యర్థము గ్రహించితిని. నా తండ్రి తన కృత్యమునకు సిగ్గిలక మీపై యుద్ధ సన్నాహ మొనర్చుచున్నట్లు తెలియని దానను కాను. మీరు నా తండ్రిపై యుద్ధముచేసి నన్ను విషాదమునకు గుఱి చేయవలసి వచ్చునని సంశయించిన నన్నవమానించినట్లే యగును.

పృథ్వీ: నీ జనకుడు నాపై యుద్ధమొనర్చి జయించినను మన అనురాగానందముల విచ్ఛిన్నము చేయలేడు. నాపైగల ద్వేషముచే పరదేశీయులైన తురుష్కుల సాయము కోరి సంధి రాయబారములు వారితో జరుపుట భారత జాతికి ఉపద్రవకరమని నా మనమెంతయో బాధ నొందుచున్నది.

సం: కానున్నది కాక మానదు. వీరులై జన్మించిన వారు తుది శ్వాస విడుచువఱకు స్వాతంత్ర్య రక్షణకై సర్వమొడ్డి పోరాడుటే కర్తవ్యము. జయాపజయములు దైవాధీనములు.

పృథ్వీ: జయచంద్రున కిట్టి విద్వేషమునకు మన యనురాగమే, నీ స్వయంవర విధానమే కారణమైనచో దానికి ప్రతి క్రియ సలిపి దేశరక్షణకు హానిలేకుండ చేయుట కుపాయాంతరమేమియు లేదా?

సం: మహావీరా! నా మనస్సును మీరు నచ్చునట్లు పరీక్షించు కొనవచ్చును. నేను సమస్త పరీక్షలకు సంసిద్ధురాలనని నేను జరిపిన ప్రతిచర్య ప్రత్యక్ష సాక్ష్యమిచ్చుచుండ వేఱే శంకయేల?

పృథ్వీ: నీ నిర్మల ప్రణయమును శంకించి నన్ను నేనే అవమాన పఱచు కొనజాల; కాని, దేశము విపద్గ్రస్తము కాకుండు నుపాయమేదైన కలదేమోయని మాత్రమే ఆత్రము నొందుచున్నాను.

సం: మహారాజా. నేను మిమ్ము వరింపక ఇంట పడియున్నంత దేశరక్షణ సుగమమగునేని సర్వస్వము త్యజించియైన అందుకు అంగీకరింప గలను కాని ఈ స్వయంవరముతో నిమిత్త మేమియులేదు. నా జనకుడెట్లైన తురుష్క సాహాయ్యముతో ఢిల్లీపై దండెత్త మంతనములు సలుపుట మున్నే యెఱుగుదును. నేను దేశ స్వాతంత్ర్యమునే యెక్కువ ప్రేమించితినో నా మనోనాయకునే అధికముగా ప్రేమించుచుంటినో? బహుశః రెండు విషయములకు భేదము లేదనుకొందును. నీ సాహచర్యముతో దేశరక్షణకు కలుగబోవు సర్వోపద్రవముల నెదుర్కొన దలచియే యిటకేతెంచినది.

పృథ్వీ: సెహబాస్! కన్నతండ్రికంటె, మనసార వలచిన ప్రియునికంటే, దేశ స్వాతంత్ర్యము నధికముగా కాంక్షించిన నీ హృదయౌన్నత్యమునకు జోహారులు. జయచంద్రుడు ఢిల్లీపై దండయాత్ర గావించుటకు తురుష్క సాహాయ్యము వాంఛించు చున్నట్లు, కొలది దినములలో అతడు దండెత్తి రాగలడని చారులవలన తెలియుచున్నది. అతడు ఢిల్లీ పొలిమేరలలో చేరకముందే యెదుర్కొని అవసరమైనచో తురుష్కులతోసహా తరిమి కొట్టవలసిన దిన మాసన్నమైనది. వీరఖడ్గ మందిచ్చి సమర రంగమునకు నీ ప్రియుని పంపు సుదినమునకై వేచియుండుము.

సం: మీ వాక్యములు నాకు చాల నిరుత్సాహ కరముగా నున్నవి. సమరాంగణమున పార్శ్వవర్తినై శత్రుసంహార కార్యమున పాల్గొన నాకు నా ప్రియుడనుమతి నిరాకరింప జాలడని నమ్ముచుంటిని.

పృథ్వీ: నీ యుత్సాహమునకు ప్రియుడు భంగము కల్గింప జాలడు. కాని తుదిపర్యాయము జయచంద్రుని సన్నిధికేగి, భారతవీరుల అంతఃకలహమువలన దేశమునకు కలుగబోవు మహోపద్రవము గూర్చి వివరించి, ముష్కరులగు తురకల నీ దేశమున అడుగుపెట్ట నీయరాదని బోధించిరాగల దూతను పంపి యాతడు వినకున్న కాగల కార్యమునకు సిద్ధపడుట మంచిది. జాతి వినాశమునకు బాధ్యత మనది అను నిందకు భవిష్యత్తులో తావుండ రాదు.

సం: యుక్తముగా నున్నది. ఆదౌత్యము నిర్వహించుటలో నీ ప్రియయే యర్హురాలు. కాన అనుమతి వేడెదను. సంధి జరుగుట అసంభవమని నా యూహ. ఐనను ఏ షరతులపై మాటలాడ దగునో దేవరవారానతీయ వలయును.

పృథ్వీ: పవిత్ర భారతావని ఘోర తురుష్క పాదఘట్టన నొందకుండుట కేషరతులకైన నంగీకరింప గలను. చివరకు తానే ఢిల్లీ సింహాసన మారోహించి తురుష్కుల నెదిరించినను సహకార భావముతో ఆయన ననుసరింప గలను. కాని నీ దౌత్యమువలన ప్రయోజన

ముండకుండుటే కాక దురహంకార పూరితుడగు జయచంద్రునివలన నీ కవమానము ప్రాప్తమగునేమో!

సం : అయినను మంచిదే. దేశసేవా పరాయణత్వమున నుండు వారి కవమానము లెక్క కాదు. కార్యము నెరవేరుచో నట్టి వేయి యవమానములైన పొందవచ్చును.

పృథ్వీ : సరే, జయచంద్రుని తోడి యుద్ధము నీ మనమునకు విషాదకరమని ఇంత కాలమునుండియు నీ సమ్ముఖమున ప్రస్తావించి యుండలేదు. నేడు నా శంకలన్నియు నిరాధారములని తేలినవి. రాయబారు లెవరాయను విషయము ఒకటి రెండు దినములలో నిర్ధారణ చేయుదము. విశేషాలోచనా పరిశ్రాంతవైనట్లు తోచెడివి. ఈ సేవకుని పరిచర్య యేమైన తచ్ఛాంతి నొనర్ప గలదేమో!

సం : ఈ ప్రణయనిధిని చేరుటతోనే నా పరిశ్రాంతియంతయు పోయినది. త్వదధీనురాలనైన నేను మీ యాజ్ఞల పరిపాలించుటకై నిరీక్షించుచుందును.

పృథ్వీ : అయిన నిటు... అని కరము గ్రహించును.

(తెరపడును)

ద్వితీయరంగము

(ప్రదేశము : స్థానేశ్వరము. తురుష్క సేనా శిబిరములకు వెలుపల సెలయేటి ఇసుక తిన్నెపై ఆలోచనతో జయచంద్రుడు. అలతి దూరములో సేవక వేషములో అబ్దుల్ కరీము.)

జయ : సెలయేటి నీటితుంపరలతో కలిసివచ్చు ఈ మంద మారుతము ఆలోచనా పరిశ్రాంత మనస్కుల కెంతయో ఉల్లాసము నొసంగజాలు.

సేవ. ప్రభూ తమ దర్శనమునకై ఏకాంతమున నెవ్వరో రాజపుత్రు డేతెంచు చున్నట్లున్నది.

జయ : (పరికించి చూచి) ఎవరు వారు ?

వీరుడు : (జయచంద్రుని పాదములపై బడి) ప్రభూ కాపాడుము. అనుమతి లేకుండ రావలసి వచ్చినది.

జయ : ఓ వీరాగ్రణీ, నీముఖవైఖరి జూచిన మహాపురుష లక్షణములు తోచుచున్నవి. నీ విట్లొంటరిగా ఆకాలమున రానవసరమేమి కలిగెను ? ఏదో తాత్కాలిక విషాదమలముకొన్నట్లు తోచుచున్నది. సత్వరమే కారణ మెఱిగింపుము.

వీర : సాహసమునకు క్షమింపవేడెదను. తాము, పూర్వపు ఢిల్లీ చక్రవర్తియు, అన్యదేశీయుల పవిత్ర భారత భూమిపై అడుగిడకుండ నెదిరించిన విధము లోక మింకను మఱువలేదు.

జయ : ఆ దినములు గతించినవి. కిరాతకుడగు పృథ్వీరాజు చక్రవర్తి నన్యాయ మొనరించి ఢిల్లీ సింహాసన మారోహించినాడు కదా!

వీర : ఆతడు ఢిల్లీ సింహాసన మధిష్ఠించినది రాజలోకమంత నేకముఖ మొనరించి శత్రుదుర్గమ్య మొనర్చుటకే కదా!

జయ : నీ వాగ్వైఖరింగాంచిన నా శత్రు పక్షము వాడవని తోచుచున్నది. ఆ మూర్ఖుని ప్రశంసించుటకే యిటకేతెంచిన వృథాశ్రమగొనక మరలిపోవుట మంచిది.

వీర : పృథ్వీరాజు సంగతి పరిపూర్ణముగ దెలిసికొన్న మీరట్లు భావింపరు. ఆతడు తురకల నెదిరించుటకై మీ సహాయము నపేక్షించుచున్నాడు. దేశ వినాశమును దప్పించుట కెంతటి త్యాగమునకైనా సంసిద్ధముగా నున్నాడు.

జయ : కల్ల. నామిత్రుడగు చక్రవర్తిని పదభ్రష్టు నొనరించి, సింహాసన మెక్కి, గర్వాతిరేకమున, నా కుమార్తె నపహరించి, నాపై యుద్ధమునకు కత్తిగట్టిన యాతడటు లెన్నటికి గోరడు.

వీర : నీ కుమార్తె నాత డపహరించె ననువార్త నూతనము. ఆతని లోకాతిశయ సద్గుణ సౌందర్యములచే నామె యాతని వరించినదని లోకమంతయు చెప్పుకొనుచుండెను.

జయ : అనవసర ప్రశంసలకు దిగక నీ వృత్తాంత మెఱిగించి, రాకకు కారణము తెలుపుము. నీ ముఖముం గాంచిన

వీర రాజపురుష లక్షణములు నన్ను చకితుని చేసినవి. లేనిచో ఇంతవఱకు శత్రుగుణ ప్రశంస అనుమతింపబడి యుండదు.

వీర : కృతార్థుడను. పృథ్వీరాజు...

జయ : అతని విషయ మొక్కమాట కూడ పలుకరాదు.

వీర : క్షమార్హుడను. దేశైక్యతకై, స్వాతంత్ర్య దీప్తికై ఢిల్లీ ఆధిపత్యము తమ పాదముల కడనుంచి అనుచరుడుగా తురకల నెదిరించుట కాతడు సంసిద్ధుడు.

జయ : నమ్మజాల. ఒక వేళ అది నిజమే యైనను ఒక స్త్రీ జనాపహారి, వంచకుడు రాజ్యాధిపత్య ప్రదాన మొనరించిన, చేయి చాపుట కీ జయ చంద్రుడు యాచకుడుగాడు.

వీర : ఉదాత్తాశయముతో, స్వాతంత్ర్య యుద్ధమునకు నాయకత్వ మంగీకరించుట కొఱకు అట్టి యాచనమైన మేలు కాదా.

జయ : మాకు హితోక్తులు బోధింప నెంచినట్లున్నది. వచ్చిన కారణము దెలిపి వెంటనే పొమ్ము.

వీర : ఏమని తెల్పగలను ? నీ కుమార్తె సంయుక్తయే స్వయముగావచ్చి నా వచనములు సత్యమని పలికిన నేమందువు?

జయ : ఆ పితృద్రోహి నామాక్షరము లుచ్చరించిన నీ నాల్క చీల్పవలయును.

వీర : హా తండ్రీ. అకారణ విద్వేషమున నెంతటి అవివేకమునకు తల యొగ్గుచుంటివి.

జయ : ఛీ ! నీచురాలా ! నీవేనాడో గతించితివని తలచితిని. కన్నకులమునకు కళంకము తెచ్చిన, నీచ పురుషాభిసారికవైన నీ ముఖము చూడ నిచ్చగింప.

వీర : తండ్రీ. నీ వెన్ని అవమానము లొనర్చినను, దేశరక్షణమే పరమావధిగా నెంచి ఈ రూపమున నిన్ను గలిసికొనవలసి వచ్చినది. ఢిల్లీ సామ్రాజ్యము నీ యధీనము గావింతుము. నీవు చేయూతయై శత్రుతురుష్కులను నెదుర్కొందుము. అనవసరావేశమునకు దావీయక చక్కగా పర్యాలోచింపుము.

జయ : ఛీ నీచురాలా !

వీర : నే నొరిన్చన నైచ్యమేమి ? అనురాగము లేని రాజపుత్రమ్మన్యుల వరింపక పోవుట నీచ కృత్యమా ? సర్వసద్గుణసమన్వితుని స్వాతంత్ర్య ధర్మదీక్షాబద్ధ కంకణుని వరించుట దూష్యమా ! భక్తిచే సర్వస్వము జనకుని కర్పణ చేయునట్లు ప్రియుని ప్రోత్సహించుట క్షుద్రత్వమా ఆలోచింపుము తండ్రీ.

జయ : నీ ముఖమిక జూడ నొల్ల. నాకవమాన మొనర్చిన రాక్షసివి. స్త్రీ హత్యకు విముఖుడనై యూరకుంటిని లేకున్న ఈ పాటికి...

వీర : ఎన్ని రాక్షస లక్షణములున్నను తండ్రివే యని తలచితిని. నీ పౌరుషము స్త్రీ పైనే చూపగలవు. మహా వీరుల స్నేహము నీకంగీకారము గాదు. తురుష్కుల నాశ్రయింపగలవు. నా ముఖము చూడవలయునని అంగలార్చు సమయమున, నీకా యదృష్టము భగవానుడీయ జాలడు. స్త్రీయని నన్ను జంపక విడుచు చున్నావు. నీ వట్లు విడువనిచో ద్వంద్వ యుద్ధమున నా పవిత్ర ఖడ్గమునకు నాశిరమిప్పుడే బలియగును. మహావీరుడు, సాటివాడు పృథ్వీరాజు కన్న మహా పవిత్రులుగా నెంచుకొన్న తురుష్కుల చేతిలో మరణింప వలయు నీస్పర్శవలన నాఖడ్గము నపవిత్ర మొనరింపజాల. జాతికి వేరుపురుగవై, నీచాతి నీచుడవై దేశము నన్యులకు, ముష్కరులకు, గోమాంసభక్షకుల ధార పోయదలచిన నీకు మృత్యు ముఖముననైన నిజవృత్తాంతము తెలిసి, వివేక ముదయించుగాక. అప్పుడైన దేశ స్వాతంత్ర్య రక్షణకై ఒక యబలపడిన పరితాపమును అర్థము చేసికొందుగాక. ఈ క్షణముననే నాతండ్రి హతుడైనాడు. తిలాంజలు లొసగి మఱి ముందు కార్యక్రమమున ప్రవేశించెదగాక. (వేగముగా నడిచి వృక్షచ్ఛాయనున్న అశ్వము నధిరోహించి నిష్క్రమించుచుండగా తెరపడును.)

తృతీయ రంగము

(స్థానము: స్థానేశ్వరమున కొంతదూరము మహామ్మదీయుల సేనా శిబిరములు. గోరీ ఉచితాసనముపై నుండును. సేనాని కరీము మంత్రియు ప్రక్కల గూరుచుండి యుందురు.)

మహామ్మదు గోరీ: పృథ్వీరాజు మూఢత్వము వలన అనాయాసముగ రాజ్యము చేజిక్కినది. ఢిల్లీ ఆక్రమించి సత్వరముగా కనోజీపైకి ఎత్తి వెళ్లవలయును.

కరీము: జయచంద్రుడు యుద్ధములో జయించి భారత సామ్రాజ్యమున నేకచ్ఛత్రాధిపత్యము వహింప నువ్విళ్లూరు చున్నాడు. మీతో సంభాషింప సమయమునకై నిరీక్షించుచున్నాడు.

గోరీ: ప్రవేశ పెట్టుము. వినోదమునకై యాతని యభిలాష మేమో తెలిసికొని ముందటి సంగతి చూతము.

(జయచంద్రుడు విషాదముతో ప్రవేశించును. కరీము సామాన్యాసనము చూపును. జయచంద్రుడు కూర్చుండక నిలిచియే సంభాషించును.)

గోరీ: సార్వభౌముల వారేలకో విజయం చేసినారు.

జయ: ఏలినవారి సేనలు ఢిల్లీ నాక్రమింప బోవునట్లే కాక కనోజీపైకి వెళ్లనున్నట్లును వదంతులు వినబడుచున్నవి. అట్టి యవకాశము లేకుండ కర్తవ్య నిశ్చయార్థమిచ్చటికి వచ్చియున్నాను.

గోరీ: మేమీ మహాప్రయాసము లన్నియు తమకు చక్రవర్తిత్వ మొప్పగించి అడవుల వెంట పోవుటకేయని తమ యభిప్రాయమా?

జయ: చేసిన వాగ్దానముల మఱచి యిట్లు పలుకుట న్యాయమా?

గోరీ: ఒడ లెఱిగి ఎచట ఏ పరిస్థితిలో నున్నది గుర్తించి మాట్లాడుము. పృథ్వీరాజు దిక్కులేని మరణము పొందిన తర్వాత నీ వంటి క్షుద్రుడొక లెక్క యనుకొనకుము.

జయ: ఇంతటి వంచనము వీరునకు దగదు.

గోరీ: సాటి మహావీరుడు శత్రువు నెదుర్కొను చుండ పరరాజు సాహాయ్యమునకై ప్రార్థేయపడుట క్షుద్రత్వమని నీకు తోచలేదా? అది వీర కృత్యమే యను కొంటివా?

జయ: ఢిల్లీ నీవు జయించి ఆక్రమించినను నాకు సమ్మతమే. నా రాజ్యము జోలికి నీవు రాదగదు.

గోరీ: నీవు విశ్వాస ద్రోహివి. కన్న కూతురును వంచించితివి, ద్వేషించితివి. వృథా పౌరుషము ప్రదర్శించి చేజిక్కినపుడు అంత మొందింపక పందతనము జూపితివి. ఆమె మాత్రము పౌరుషము జూపలేక పోయితివి. నిన్ను నీ కనోజిని విడిచినచో మాకు విశ్వాస ద్రోహము చేయవను నమ్మక మేమి?

జయ: అవకాశము చిక్కినపుడు కూతురని విడిచినట్లు నీకెవరు చెప్పిరి?

కరీము: నీచుడా, నీకు సేవకుడై పరిచర్య చేసిన కరీమును గుర్తింప నేరవైతివి. నీకు రాజ్యతంత్ర మొప్పగించిన ఆరాజ్యపు గతి వేఱే చెప్ప నక్కఱలేదు.

జయ: హా దైవమా! ఎంత మోసము. అందఱు వంచకు లేనా? (ఒఱలోని కత్తిపై చేయి వైచును.)

కరీము: చేయి అణుమాత్రము కదల్చితివేని నీచేయి, శిరము ఒక్క మాఱుగా నేలకూలును.

జయ: హా ప్రియ తనయా, సంయుక్తా! మూఢ పశువునై నీ వాక్యముల సారము గ్రహింపజాలనైతిని. నిర్మల ప్రణయ తేజో విరాజమానమై దేశ స్వాతంత్ర్య సంరక్షణ దృఢ దీక్షాబద్ధమై యొప్పు నీ ముఖ మొక్కసారి చూపవా?

గోరీ: అసమాన పౌరుషము జూపి కదనరంగమున కాళికా దేవియై వెలగిన ఆమె ముఖము పాషండులకు చూడ యోగ్యము కాదు. ఈ మూర్ఖునితో కాలయాపన మొనర్పరాదు, కరీమ్. ఈతని వెంటనే ఖండ ఖండములుగా నఱకి కాకులకు, గ్రద్దలకు వైచి ఢిల్లీ కనోజీలతో ఆర్యావర్త మంతయు పాదాక్రాంతమగు నేర్పాటులన్నియు చేయుము.

జయ: (ఖడ్గము తీసి క్షణములో పొడిచికొని పడిపోవు చుండ తెరవాలును.)

సమాప్తము

★

కథ అడ్డం తిరిగింది

* "శ్రీ" *

1

"తొంగలి ఱెప్పలన్ దొలఁగ ద్రోయుచు
బైపయి విస్తరిల్లు క
న్నుంగవ యాక్రమించు కొనునో
ముఖచంద్రు నటుంచుఁ బోవనీ
కంగజు డాన వెట్టి కదియన్
గుతిఁద్రావె ననంగ జాతి సా
రంగ మనంబు లేఁజెమట గ్రమ్మె
లలాటము డిగ్గి చెక్కులన్"

(మనుచరిత్ర)

అని సన్నని గొంతుతో చదువుతూ 'అమ్మయ్య' అన్నాడు రామదాసు అప్పుడే ముగించిన వరూధినీ చిత్రాన్ని దూరంగా పెట్టి చూస్తూ. ఇంతలో పోస్టుమేన్ 'లెటర్ సార్' అని కిటికీ లోంచి ఒక కవరు పడేసి వెళ్లాడు. దాసు చేతిలోని కుంచెను బల్లమీద పెట్టి కవరుతీసి వెంటనే విప్ప కుండా 'ఎవరు వ్రాసారు?' అనుకుంటూ పైనున్న విలాసం పరిశీలిస్తున్నాడు. కవరుమీద ఒంకర టింకరగా నున్న పెద్ద పెద్ద తెలుగక్షరాలతో—రామదాసు-మహారాణీపేట, విశాఖ పట్టణం అని వ్రాసివుంది. విలాసం చూచినంత మాత్రాన ఉత్తరం వ్రాసిన వారెవరో అర్థంకాక ముఖం చిట్లించుతూ కవరు విప్పాడు దాసు.

"శ్రీ రామదాసు బావకు అనేక నమస్కారములు చేసి వ్రాయునది—

అమ్మకు నెల దినములనుండి చాలా జబ్బుగా నున్నది. ఇంట్లో చాలా ఇబ్బందిగా నున్నది. నిన్నొకసారి రమ్మనమని వ్రాయమన్నది. నీవచ్చట క్షేమముగా నున్నావని కొనియెదను.

విశేషములు లేవు

ఇట్లు మీ మరదలు

మణి"

'ఊఁ'...'మణి' అని సాలోచనగా చూస్తూ ఉత్తరం మడిచిపెట్టి డ్రాయరులో పెట్టాడు. ఇంతలో టకటకా జోడుచప్పుడు చేసికొంటూ 'ఏం వోయి', ఇంకా యిలాగే ఉన్నావేమిటి అంటూ వచ్చాడు విశ్వం.

దాసు 'యింకా ఆరు గంటలేగా అయింది. అరగంటలో వెళ్లలేమా?' అన్నాడు.

"ఇవ్వాళే బిగినింగ్. ముందుగా వెళ్లకపోతే టిక్కట్లు దొరకవు"

'ఇదుగో వచ్చేస్తున్నా! కూర్చో" అంటూ టువలు సోపు తీసికొని పెరట్లోకి వెళ్లాడు దాసు. విశ్వం వరూధినీ చిత్రాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు.

దాసు పావు గంటలో బట్టలు మార్చుకొని క్రాపు దువ్వుకొని నీటుగా తయారయి వచ్చి 'ఊఁ నాపనయింది' అన్నాడు.

'పద' అంటూ లేచాడు విశ్వం.

ఇద్దరూ చెప్పులు తొడుగుకొని 'మినర్వా' టాకీసుకు దారి తీశారు.

2

రాత్రి తొమ్మిది గంటలు దాటింది. మినర్వా టాకీసు నుండి జనం గొల్లుమంటూ బయటికి వచ్చారు. బీచి రోడ్డంట జనం గుంపులు గుంపులుగా వస్తున్నారు. సినిమా హాలు ఆవరణ దాటి జన సమూహం నుంచి కాస్త యివతలకి తప్పుకొన్న ప్రతి యిద్దరు ముగ్గురు వ్యక్తులూ 'కల్పన' చిత్రంలోని మంచి చెడ్డలను గూర్చి వితర్కిస్తున్నారు. అందులో కొందరు విద్యార్థులు ఆ చిత్రం తీయడంలో ఉదయ శంకరుని అభిప్రాయమేమిటా అని వాదించు కొంటున్నారు. మరికొందరు సినిమా అర్థమే కాలేదని విసుగుకొంటున్నారు. కొందరు పెద్దలు అర్థం కాలేదంటే నాట్య శాస్త్రంలో తమకభిరుచి లేదంటారేమోనని చాలా బాగుందనుకుని

వారికి వారే తృప్తి పడుతున్నారు. కొందరు సత్యవాదులు 'అర్థం చేసికొంటే అద్భుతమైన చిత్రమిది' అంటున్నారు.

చాలావరకూ జనం రద్దీ తగ్గింది. సిగరెట్లు కాల్చుకుంటూ దాసు, విశ్వం తీరికగా వస్తున్నారు. కొంత దూరం నడిచాక దాసు 'ఇప్పటినుండీ యింటికివెళ్లి ఏం చేయాలి, కొంతసేపు సముద్రపు ఒడ్డున కూర్చుందాం రావోయి' అన్నాడు

విశ్వం కొంచెం విసుగుదలగా "అబ్బా సినిమా చూసి తలనొప్పి వచ్చింది. ఇంటికిపోయి పడుకుంటా. కావలస్తే నువ్వుపోయి ఆ ప్రకృతి సౌందర్యాన్ని అనుభవించు" అన్నాడు.

దాసు తల పంకిస్తూ- 'ఆ తప్పకుండా అనుభవిస్తాను. అనుభవించడం చాతకాని నీలాంటి వాళ్లను చూస్తే నాకు తలనొప్పి, అన్నాడు విశ్వంవైపు చురుకుగా చూస్తూ. 'సరే తలనొప్పికి రేపు మందు తెస్తానులే. నేను పోతున్నాను,' అంటూ ప్రక్కసందుకు మళ్లిపోయేడు విశ్వం.

దాసు నెమ్మదిగా అడుగులువేసికొంటూ రోడ్డుదిగి సముద్రపు ఒడ్డుకువచ్చి కూర్చున్నాడు.

వెన్నెల చక్కగా ఉంది. ఉబుకుతూ వస్తున్న నీటి తరంగాలు వెన్నెల కాంతిలో మెరసి పోతున్నాయి. దూరంగా స్టీమరు కాబోలు మినుకు మినుకు మంటున్న ఎర్రలైట్లతో చక్కని దృశ్యాన్నిస్తూంది.

దాసు సముద్రంలోకి దూరంగా చూస్తూ క్రొత్త సిగరెట్టు వెలిగించాడు. ప్రకృతి ప్రశాంతంగా ఉంది. దాసు ఏమిటో ఆలోచిస్తూ సిగరెట్టును గట్టిగా పీల్చి పొగ ఒదిలిపెట్టాడు. సిగరెట్టు పొగ సుడులు తిరుగుతూ తన కళ్లముందరే నాట్యం చేస్తూంది. దాసుకు తన పూర్వ జీవితమంతా ఒక్కసారి స్మృతిపథానికి వచ్చినట్లయింది. పాత సంగతు లొక్కొక్కటీ జ్ఞప్తికి రాసాగినై.........

"ఎంత అదృష్ట జాతకమో గాని తాను పుట్టిన రెండు సంవత్సరాలకి తన తల్లి చనిపోయిందట. భార్యపోయిన దుఃఖమే కాక ఈ పసిగ్రుడ్డును పెంచడ మెలాగ అని తన తండ్రి బాధపడుతున్న సమయంలో తన మేనత్త రాధమ్మ తన తండ్రిని "అన్నయ్యా అన్నిటికి బెంగపడితే ఎలాగ-పిల్లాడిని నేనుపెంచి నీ కప్పచెపుతాను. నువ్వధైర్య పడకు" అని హామీ యిచ్చి తనను తీసుకు వెళ్లింది.

దాసుతండ్రి కేశవరావు అమలాపురంలో ప్లీడరు గుమాస్తా. లేని సంసారమైనా భార్య చనిపోయేసరికి తనకు 30 సంవత్సరాలైనా నిండక పోవడంచేత జీవిత రథం ఒంటి చక్రంతో నడవడం కష్టమని తోచి, భార్య చనిపోయిన రెండు సంవత్సరాలకే మళ్లీ వివాహం చేసుకున్నాడు కేశవరావు.

మహేశ్వరి (తన సవతి తల్లి) బీద సంసారంలో పుట్టినా మంచి గడసరి, తెలివితేటలు కలది. కాపురానికి వచ్చిన కొద్ది నెలలకే "అబ్బాయిని తీసుకురండి" అని భర్తను ప్రోత్సహించింది. ఎందుకోగాని కేశవరావే మొదట జంకాడు. "పెంచుతానని కోరి తీసుకువెళ్లిన మేనత్త కంటె సవితి తల్లి ఎక్కువ ఆదరణ చూపుతుందా" అని అతని సందేహం.

ఎలాగైతేనేం భర్తను పడే పదే వేధించి మేనత్త గారింట్లో పెరుగుతున్న దాసును రప్పించింది.

దాసుకు తాను మేనత్తగారింట్లో ఉండటం తండ్రివచ్చి తనను తీసుకు వెళ్లటం చిన్నలీలగా జ్ఞాపక మున్నాయి. మహేశ్వరిని తాను 'పిన్నీ' అని పిలచేవాడు. ఆమెకూడా ఆప్యాయంగా 'ఏం నాయనా' అని సంబోధించేది.

నిజానికి మహేశ్వరి లోకంలో అందరూ చెప్పుకునే వంటి సవితి తల్లి మాత్రంకాదు. తనను అభిమానంగానే చూచేది. కాని ఆమెది కొంచెం గర్వ స్వభావం. తన హయాంలో ఉన్న వాళ్లంతా తనకు అణిగి మణిగి ఉండాలంటుందామె స్వభావం. అందుకనే ఆమె కాపరానికి వచ్చిన కొద్ది దినాల్లోనే భర్తను తన అదుపాజ్ఞలలో ఉండేలా చేసుకుంది. దాసుకు కూడా తనంటే భయభక్తు లుండేలా పెంచింది.

'కాని ఆ తరువాత నాలుగైదు సంవత్సరాలలోనే పిన్నివైఖరి మారింది. దానికి కారణం ఆమెకీ ఒక కొడుకు పుట్టడం-లోకానికి వెరచి తనను ఆమె కుమారునితో సమా

నంగా చూచినా మునుపటి ప్రేమాభిమానాలు దూరమై నాయి. చాటుమాటుగా తనను చూసి విసుగుకునేది. అప్పుడప్పుడు కొట్టేది కూడా. కాని ఆమెకు తనయెడల గల అభిమానం సన్నగిల్లడానికి ముఖ్యకారణం తనే. ఎప్పుడైయినా పిన్ని కొడితే తనకు చాలా కోపం వచ్చేది. చాలా పెళుసుగా జవాబు లిచ్చేవాడు తాను పిన్నికి. ఆమె తనయెడల ఆశించే వినయ విధేయత లతనిలో లేవు. అందుకనే ఆమెకు కోపం వచ్చేది.........

............ఆ దినం అతనికి బాగా గుర్తుంది. తన జీవితంలో ఎన్నటికీ మర్చిపోలేని దినమది. అప్పుడు తాను ఫస్టుఫారము చదువుతున్నాడు. వీధికొట్లో పెన్సిలితో గోడ మీద బొమ్మగీస్తున్నాడు తాను. అప్పుడే కోర్టునుండి వచ్చి కాళ్లూ చేతులూ కడుగుకొని ఈజీ చెయిర్లో కూలబడ్డాడు నాన్న. పిన్ని గ్లాసుతో కాఫీతెచ్చి నాన్నకిస్తూ 'అబ్బాయి చెప్పినమాట బొత్తిగా వినటంలేదు. రోజు రోజుకీ వ్యవహారం ముదిరిపోతూంది. ఊరంట తిరగడం ఎక్కువయింది. నెలదినములనుండి వాడు బడికే పోవటం లేదట' అన్నది.

'అయితే ఇన్నాళ్లు ఎందుకు చెప్పలేదు' అన్నాడు నాన్న.

'ఏమో! నాకు మాత్రమేం తెలుసు. పుస్తకాలు పట్టు కుని వెళుతూంటే బడికి కాబోలు ననుకున్నాను. ఇవేళే నాకీసంగతి తెలిసింది. మీ అబ్బాయిని మీరెలా సరిదిద్దు కుంటారో. నేనేమైనా అంటే సవితి తల్లి కిట్టక చేసింది అని నన్నాడిపోసుకుంటుంది లోకమంతా' అంటూ వంటింట్లోకి వెళ్లిపోయింది. తాను వీధికొట్లోఉండే ఈ మాటలన్నీ వింటున్నాడు-ఇంతలో నాన్న 'అబ్బాయి!' అని పిలవడం వినిపించింది. చేతిలోని పెన్సిలు అక్కడే పడేసి నాన్న ఎదుటికి వచ్చి నిల్చున్నాడు తాను.

'రోజూ బడికి వెళ్తున్నావురా!' అన్నాడు—నాన్న కోపంగా చూస్తూ.

'లేదు!' అన్నాడు తాను.

'ఎందుకు వెళ్లడం లేదూ!' అని గర్జించాడు నాన్న.

'డ్రాయింగు మాష్టరి గారింటికి వెళ్లి బొమ్మలు వేయటం నేర్చుకుంటున్నా.'

'బొమ్మలు గీసుకుంటూ కూర్చుంటే అవి నిన్నుద్ధరి స్తాయా యేం? తిన్నగా బడికి వెళ్లి చదువుకుంటేనే సరి. లేకపోతే అనవసరపు జీతం దండగ.' అన్నాడు నాన్న తనను వెరిపిస్తున్నట్లు చూపిస్తు.

కాని నిజానికి తనేమీ భయపడలేదు—'నా కసలు చదవాలని లేదు—ఇకమీద బడికి వెళ్లను' అన్నాడు నిక్కచ్చిగా.

తన మొండి జవాబుకు విస్తుపోతూ "అలాగ వీలులేదు నువ్వు తిన్నగా బడికి వెళ్లి చదవాల్సిందే నా దగ్గర ఇలాంటి వెధవ వేషాలు పనికిరావు" అన్నాడు నాన్న.

అంతే! ఆ సాయంత్రమే తాను కట్టు బట్టలతో యిల్లువదిలి వచ్చేశాడు. ఎందుకు వచ్చేశాడో తనకే తెలియదు"...

......చేతిలోని సిగరెట్టు కాలిపోయి చెయ్యి చురి కింది. దాను మళ్లీ ఈ ప్రపంచంలోనికి వచ్చాడు. చంద్రుడు తెల్ల మబ్బుల్లోంచి పరుగులు పెడ్తున్నాడు. ఎత్తుగా కొట్టు కునే కెరటాలనుండి నీటి తుప్పరలు తనమీదకు తూలు తున్నాయి. మళ్లీ అతడు తన గత జీవిత సింహావలోకనంలో పడ్డాడు.

అవును అది నిజంగా యిప్పటికీ అర్థంకాని సమస్య. ఆ దినం తాను యింటినుండి పారిపోడానికి కారణం? తాను యింట్లో ఉండలేనంత ఎక్కువగా ఎవ్వరూ కష్టపెట్ట లేదు. పిన్ని కూడా తన పెంకి జవాబులకు చాలకాలం ఓర్చింది. నాన్న ఎప్పుడూ తనని ఒక దెబ్బయినా కొట్టలేదు. ఆఖరికి వచ్చేసేనాడు కూడా తనను బుద్ధిగా చదువుకో మన్నాడేగాని మరేమీ అనలేదు. కాకపోతే కాస్త కళ్లెర్ర చేశాడు. అంతమాత్రానికే. తాను అలిగి వచ్చేశాడా? ఊహు! అదికాదు. ఎందుకో తాను ఇంట్లో ఉండలేక పోయాడు. స్వేచ్ఛగా ప్రపంచములో విహరిద్దామను కున్నాడు. ఇంటినుండి వచ్చేశాడే కాని తనకు తిండి, బట్ట, బస వీటినిగురించి ఆలోచించనయినా లేదు. అప్పుడప్పుడు

(తరువాయి 49వ పేజీలో)



జాజిమల్లి

అడివి బాపిరాజు

[పద్మాలు, బుచ్చి వెంకులు, పల్లీలు. యుద్ధంలో సంపాదించిన డబ్బుతోపాటు కొంత నాగరికత కూడా సంపాదించి, యిల్లాలు పద్మాలుకు సంగీతం చెప్పించి, వర్తక నిమిత్తం చెన్నపట్టణం చేరతాడు బుచ్చి వెంకట్రావు. ఆ కొత్తవాతావరణంలో, కొందరి వ్యక్తుల సహవాసంలో, వారిరువురి జీవితాల్లో చెలరేగినతుపాను, తన్మూలంగా వారికి ఏర్పడ్డ ఎడబాటును గూర్చి ఇంతవరకూ చదివినాము. 11-వ గుచ్ఛంలో తిరిగి వారిరువురకు పూర్వ జీవిత స్మృతి రావడం కూడా చదివినాము. ఇకపైన ఏమవుతుందో ఈ 12-వ గుచ్ఛంలో చదవండి. దీనితో కథ సమాప్తం]

ద్వాదశ గుచ్ఛము

౧

రైలు వేగంగా సాగిపోతోంది. పద్మావతి హృదయంలో ప్రత్యూషం ఉదయించేటట్లే లేదు. తన బావ ఢిల్లీ రాకపోతే? తన బావకు తానేమీ పనికి రాకపోతే? పురుషునకు స్త్రీగాని, స్త్రీకి పురుషుడుగాని ఒక్క స్త్రీ పురుష సంబంధార్థానికేనా ఉద్భవించింది? అయితే పండులవలె, ఋషిదంపతులవలె జీవించే వృద్ధులైన భార్యాభర్తలగతి? బ్రహ్మచారిణులై, విధవాత్యాన యోగినులై జీవిస్తూ, జాతిసేవ చేసే ఉత్తమ స్త్రీల జీవితాలు అర్థము లేనివేనా? మానవ జీవితం తీగెలల్లుకు పోయిన నికుంజము వంటిది. బహుళ లతాపూర్ణ నికుంజములో ఏ తీగను విడిగా పరిశీలించ గలము? అని పద్మావతి భావించుకొన్నది.

రైలులో తనతోటి ప్రయాణీకులైన ఈ నూత్న స్నేహితురాండ్రు తన్ను సంగీతం పాడమని ప్రార్థించినప్పుడు, తాను పాడుటకూ సందేహించలేదు. వారాపాటువిని ఆనందంలో ఏవో లోకాలలో తేలిపోయామని ఉప్పొంగిపోతూ తన్ను

మెచ్చుకొన్నారు. భగవంతుడు తనకా గాంధర్వ మహిమను ప్రసాదించింది ఏదో ఉత్కృష్ట సేవ జగానికి అర్పించమనే కదా! ఎంతకాలం తాను నీడలను చూచి భయపడి పారి పోవడం? తన బావ ఢిల్లీలో తన్ను కలుసుకుంటాడా పరేసరి. అతనికి నిజమైన సైదోడై, అతని నీడలనుండే సంఘసేవలో మానవ జాతికి సాష్టాంగమవుతుంది. తన్ను కలుసుకోలేడూ—తాను ఒంటిగానే బ్రతుకు దారుల ప్రయాణిస్తూ జాతికి పరిచర్యచేస్తుంది. చదువు పూర్తి చేస్తుంది. సేవచెయ్యాలనే అనుకుంటే, చేసే దీక్షకలవారికి మార్గాలూ ఉన్నాయి. ఆ మార్గాలలో మహోత్తమమైనవీ ఉన్నాయి.

ఇంక తన బావను దూరంనుండే ఆరాధించుకుంటూ తన సేవామార్గాన్ని అనుసరించి పోతుంది.

మనుష్యులెంత దగ్గిరవారైనా వారి హృదయాలు ఇనప గోడల వెనక ఉన్నట్లు ఉంటాయి. ఆ హృదయాలు తామన్న ప్రేమార్ద్రితా పూర్ణములై కరిగిపోతాయి అని నమ్మినంతసేపూ ఆ హృదయాలు ఆ రీతిగానే ప్రత్యక్ష మవుతూ ఉంటాయి. ఎదుటి జీవితాలలో అర్థములేని ఏదో ఒక సంఘటన సంభవించే సరికీ, ఆ సంఘటన ఇవతలి హృదయాలకు కోటి క్రీనీడలు కమ్ముకొని దర్శన మిస్తుంది. ఇంక వీరికీ వారికీ ఇంతవరకూ ఉన్న సామ రస్యం మాయమై, కాకోలంవంటి విషం ఉద్భవిస్తుంది. తాము గరళ కంఠులై ఎవరావిషం ఆస్వాదించుకోగలరు?

తన బావ తన్ను ప్రేమించడం లేదని తానెందుకు నిర్ధారణ చేసుకోగలిగింది? పద్మాలు నిట్టూర్చింది. రైలు స్టేషనులలో ఆగుతూనే ఉంది. యోజనాలను అంగుళాలు చేస్తూ సాగిపోతోనే ఉంది.

తాను మాత్రం తన బావను అంతు ఎరగని గంభీర ప్రేమతో ప్రేమించి ఉంటే, తనకెందుకు బావంటే విసుగు జన్మించింది? బావంటే ఏదో భయంవేసి ఏదేని సాకుతో, బావనువిడిచి పారిపోయింది! ఎట్లు విడిచి ఉండగలిగింది తాను? ప్రేమకోసం సర్వమూ ఆహుతిస్తారన్నమాట వట్టిది. గాటంగా కోరిన ఏ సంఘటన కోసమైనా మనుష్యుడు తన జీవితం కొంత ఆహుతిస్తాడు. ధనం, పదవి కోరినవాడు తన గౌరవం, తనలోని ఉత్తమ మానవత్వం నాశనం చేసుకొంటూనే ఉన్నాడు.

ఇప్పుడు పద్మావతిలో బాలికాత్వము జారిపోయింది. ఆమె మనస్సులోని మంచులు దెసలకు ప్రవహించి మాయ మైనాయి. చిన్ననాటి నుండీ తన నాయకుడు బుచ్చి వెంకులు బావే! అతడు తనకై, అతనికై తాను, మెట్లెక్కుతూ పైకి నడచివచ్చారు. తాము చిన్ననాడు ఆడుకొన్న సముద్రానికి మేరలు చిన్నవి. ఈనాడవి విస్తరించి కడపలను దాటిపోయాయి.

ప్రతి జీవితమూ ఇంకో జీవితంతో చేయి అంది పుచ్చుకొని మెట్లెక్కి పోవలసిందే. అదే మానవుని నిత్యలీల! అదే భగవంతుని నిత్యఖేల! అనుకుంది ఆమె చిన్న బిడ్డలా. ఆమె హృదయం శాంతి పొందింది.

రైలు వేగంగా సాగిపోతూ ఉంది.

౨

బుచ్చి వెంకట్రావు ఆకాశపథంలో మహావేగంతో ఉత్తరానికి ఎగిరిపోతున్నాడు. నరసింహమూర్తి మేష్టారి టెలిగ్రాం అందిన వెంటనే కారుమీద విమాన కార్యాలయానికిపోయి, వెంకట్రావు ఢిల్లీకి టిక్కెట్టు కొనుక్కున్నాడు. ఆ మర్నాడు ఉదయమే విమానం అందుకొని ప్రయాణం సాగించాడు.

క్రింద ఎన్ని పట్టణాలు, నదులు, కొండలు వెనక్కు పరుగిడుతున్నాయో పొలాలు, అడవులు, జిల్లాలు, రాష్ట్రాలు వెనకనే ఉండి పోయాయి. ఆలాగే తన బ్రతుకులో ఎన్నో కాంక్షలు, బాధలు, ఆనందాలు, సంఘటనలు వెనక్కు వెళ్లిపోయాయి. ఈ నదులూ, కొండలూ వెనక్కు వెళ్లినా, అవన్నీ ప్రయాణ మార్గంలో ఉండనే ఉన్నాయి. అదేరీతి తన జీవితంలోని సంఘటనలూ ఆలాగే ఆ వెనక సంవత్సరాలలో ఉండిపోయాయో? మనుష్యుడు వెనక్కు వెళ్లడం నేర్చుకుంటే, ఆ జీవితయానంలో మళ్లీ ఆ సంఘటనలన్నీ సంభవిస్తాయా? తన తల్లితండ్రులు వెనకటి ప్రపంచాన్ని ప్రత్యక్షం చేస్తూనే ఉన్నారు.

తాను తన గ్రామంలో తల్లితండ్రులకు అన్నదమ్ములకు చక్కని పెంకుటిల్లు కట్టించి ఇచ్చాడు. మామగారికీ,

చాలామంది చుట్టాలకూ తన రొయ్యపప్పూ ఎండుచేపలూ ఎగుమతి కంపెనీలో వాటాలు ఇచ్చాడు. తనతో వాటాల వారందరి దగ్గర కొద్దో గొప్పో సొమ్ము నిల్వ ఉంది. ఆ వాటాదార్లందరూ చిన్నచిన్న పెంకుటిళ్లు కట్టుకున్నారు. కాని వారందరూ ఇంకా పల్లీయులే. ఇంకా పుట్టగోచీలు పెట్టుకొని తన చుట్టాలు, పెద్దలూ చిన్నలూ అందరూ సముద్రం వేటకు వెడుతూనే ఉన్నారు. ఆలా పల్లీయులు సముద్రం వేటకు వెళ్లకపోతే తన కంపెనీ దివాలా తీసిందన్నమాటే!

తన పల్లెవారిలోనుండి ఇంగ్లండులోవలె ఉత్తములైన నావికులు తయారు కావాలి. చదువులు లేకపోవడం చేతనే కదా తనవాళ్లని ప్రభుత్వం యుద్ధ నౌకానావికులుగా జేర్చుకొనకపోవడం. కులమత వైషమ్యాల వంటి ఈ నికృష్ట జీవితానికంతకూ చదువు లేక పోవుటమే గారణం. తన పద్మ చదువు కొన్నది. చదువు కొంటుంది. తానూ చదువు కొంటున్నాడు. ఈ పరీక్షలు చదువులో ముందుకు ప్రయాణం చేయించగల మజిలీలవంటివి. తన పద్మ బి. యే., ప్యాసవుతుంది. తానూ తన పద్మా దేశాలు తిరుగుతారు. తన కంపెనీ బాగా ఏర్పాటుచేసి, తానూ తన పద్మా ఆమెరికాకో, ఇంగ్లండుకోపోయి అక్కడ చేపల విషయమూ అందుకు సంబంధించిన సముద్ర జ్ఞానమూ, సముద్రయాన ప్రావీణ్యతా నేర్చుకుని రావాలి. అప్పుడే తన దేశానికి తానేదైనా సేవ చేయకలడు. తనకు ఉద్యోగాలు అవసరంలేదు. తన కంపెనీ మంచిలాభాలు తెస్తున్నది. తాను ఇదివరకు కంపెనీలవారివలె పల్లెవారిదగ్గిర అతి చవకగా కొని, అతిలాభంగా అమ్మటంలేదు. తానన్ని కంపెనీలకన్న ఎక్కువ ఖరీదులకు కొంటున్నాడు. లాభసాటికిగా పరదేశాలకు ఎగుమతి చేస్తున్నాడు. చీనాకు, జపానుకు, బర్మాకు, మలయాకు, సింహళానికి, జావాకు తన సరకు రవాణా అవుతోంది. తాను ప్రభుత్వానికి లెక్కలన్నీ సరీగా చూపించి, ఇవ్వవలసిన పన్ను సకాలంలో ఇస్తున్నాడు. తనకు రాజకీయాలతో అనవసరం. ఆంధ్ర రాష్ట్రం విషయంలో మాత్రం తనకు తీరనికోర్కె ఉంది. మదరాసులో సగపాలు తెలుగు వారున్నారు. అయినా మదరాసు తెలుగువారిది కాకపోవడమేమి? పోనీ కొందరన్నట్లు సగంసగం పంచితే ఉభయరాష్ట్రాలవారికీ మేలు. ఏ రాష్ట్రం వారిదైనా మదరాసు దెబ్బతింటుంది. చివరకు ప్రత్యేక రాష్ట్రమైనా మదరాసు హీనస్థితి పొందుతుంది. రెండు రాష్ట్రాలకు ముఖ్య పట్టణమైతే మదరాసు ఇప్పటికన్న మహోన్నతస్థితి పొందుతుంది. లేనిపోని అహంభావాలు పెట్టుకొని మనుష్యులు తామూ నాశనమౌతారు, ఇతరులనూ నాశనం చేస్తారు.

ఏమిటీ తనకీ ఆలోచనలు. ఈలాంటి ఆలోచనలే తనకీమధ్య. వీని అన్నింటికీ కారణం పద్మాలు. పద్మాలు తనకు, చిన్నతనాన నుండీ ఓ దేవకన్యలా దర్శనం ఇచ్చేది. ఆమెకు తగిన భర్తకావాలని తాను యుద్ధానికి పోయినాడు. యుద్ధంవారికి అన్నీ సప్లయి చేసే కంపెనీవారి విషయం అంతా చూసి, తాను యుద్ధంనుంచి రాగానే రొయ్యపప్పు ఎండుచేపల ఎగుమతి కంపెనీ పెట్టినది పద్మాలును లక్ష్మీదేవిని చేయడానికే. తన పద్మాలు సౌందర్యదేవత. తన పద్మాలు సరస్వతి. తన పద్మాలు తన జీవితానికి ఆరాధ్యదేవి.

ఏ తిక్కపుట్టిందో తనకు. మదరాసు నగరంలో తన పద్మాలు వట్టిపల్లెపిల్ల అనిపించింది. తనతోపాటు తన పద్మాలు ముందుకు సాగి రావటము లేదనిపించింది. ఈ సినీమా తారలు, ఈ బీచిసుందరులు తన్నేదో మైకంలో ముంచారు. కాస్తయితే తన పద్మాలు తనకు దూరమైపోయి ఉండును. ఆమె గీతాదేవి. తానువట్టి మొరకుడు. ఆమె సంగీతం పాడుతూ ఆ సభలలో వేదికపైన కూర్చుని ఉంటే, తనకు ఆకాశంనుంచి దిగివచ్చిన దేవతామూర్తిలా కనబడింది. తాను బజారులవెంట వెడుతూ ఉంటే, ఆమె రికార్డులు విన్నప్పుడు, రేడియోలో ఆమె పాడినప్పుడు, దివ్యమైన ఆ గాంధర్వం విన్నప్పుడు తనకప్పుడామె వెలిగిపోయే శరీరంతో ఎదుట నిలుచున్నట్లే అయ్యేది.

పద్మాలూ! సౌందర్యాలరాణీ, దివ్య గాంధర్వాలు లోకాలను ఉప్పెనలుగా ముంచే గీతాదేవి! ఇంత మూర్ఖుడై తాను తన్నేమరిచి పోయేస్థితికి వచ్చాడా?

తానట సినీమా కంపెనీ పెడతాడట. సుశీలవంటి సీతాకోక చిలకల్ని, భరతపక్షులను కొన సాహసించాడట! ఎంత


MY AMRUTANJAN
* నాది నాది నాది *
* నాది నాది నాది *
There are Millions of "My's in that MY,
Applied to the 46 year old "Pocket Doctor" of INDIA.
అమృతాంజనము
గాని,
" యధాయధా................కాళీధవళత్వ శంకయా."
అమృతాంజనమా ! నీ కీర్తి ముల్లోకములను దెల్పుజేయు పూనికతో పెరుఁగు
చున్నప్పుడెల్లను, నా నల్లని ముంగురులు, దెల్లబడునేమోయను భయముచే
నా హృదయము మిక్కిలి పరితాపమొందుచున్నది సుమా !!!

దౌర్భాగ్యము. ఏనాటికైనా పతితుడు కాబోయే పురుషునికీ స్త్రీయే చేయి అందిస్తుంది. స్త్రీ పట్టి బిడ్డలకనే పశువు అనుకొన్న ప్రతి పురుషుడూ కూపం నదివంటి పరమ దౌర్భాగ్య కూపంలో కూలిపోతాడు.

విమానం హైదరాబాదులో ఆగి మళ్లీ బయలుదేరింది. నాగపురంలో ఆగింది. ఆతనికి ప్రయాణంలో పలకరించే వారేలేరు. ఆలోచనలే ఆతని తోటియాత్రీకులయ్యాయి.

విమానం మహావేగంతో రెక్కలు చాచి, వింధ్యపర్వతాలు దాటింది.

3

పద్మావతి న్యూ ఢిల్లీలో దిగగానే ఎదురుకువచ్చి బుచ్చి వెంకట్రావు నిలుచుని ఉన్నాడు. పద్మావతికి తక్కిన సర్వమూ మాయమైనది. ఠీవిగా, రూపమెత్తిన దివ్యత్వంలా ఆమెకు బుచ్చి వెంకట్రావు కనిపించినాడు. రైలులో ప్రయాణం చేసిన తోటి మహిళలు, ఒక దేవికి నమస్కారం చేసినట్లు పద్మావతికి నమస్కరించి, ఆమెను కౌగలించుకొని, కరస్పర్శచేసి తమ తమ ఇండ్లకు ఢిల్లీనుండి వెళ్లపోయే ముందు ఆమెను రమ్మని ఆహ్వానించారు.

పద్మావతి సర్వమూ మరచి వారేమంటున్నారో ఆమెకు వినబడలేదు. ఏదో చిరునవ్వు! ఏదో నిర్వచింపరాని ఆనందం.

ఇంతట్లో ఆమెకు చటుక్కున జ్ఞప్తికివచ్చి, వారికి బుచ్చి వెంకట్రావును కళ్లతో చూపి, సిగ్గుతో "వారే! వారే!" నన్ను కలుసుకోడానికి విమానంమీద ఢిల్లీవచ్చారు!" అని చెప్పింది. వారాతనికి నమస్కరించారు. ఆతడూ సిగ్గుపడుతూ వారికి ప్రతి నమస్కరించాడు. ఎవరిమగవారు వారికడకు వచ్చారు. మగవారిని ఒకరికొకరు ఆడవారే పరిచయం చేశారు. ఒకరికొకరు నమస్కరించు కొన్నారు.

అందరూ ఒకరిదగ్గిర ఒకరు సెలవు పుచ్చుకొని మళ్లీ కలుసుకుందామనుకొని ఎవరిదారిని వారు వెళ్లిపోయినారు.

ఆమె ఏర్పాటు చేసుకొన్న వారింటికిగాక బుచ్చి వెంకట్రావు తా నేర్పాటుచేసిన హోటలుకు పోదామన్నాడు.

నరసింహమూర్తి మేష్టారునకు తన బిడ్డలిద్దరు ఈ విధంగా కలుసుకోడం వైకుంఠం అబ్బినట్లైనది. సర్వ పవిత్రక్షేత్రాలు ఒక్కసారిగా దర్శించినట్లు ఆతని ఆత్మపొంగిపోయినది.

నరసింహమూర్తి మేష్టారు జీవితం సంగీత మయం. విశ్వమే గాంధర్వంలో నుంచి ఉద్భవించిందని ఆతని నమ్మకం. ఆతడు కలలుకన్న పరమ సంగీతమూర్తి తన శిష్యురాలైన ఈ శైవర్తక బాలికరై ఉద్భవించింది. ఆతడు ధనంకోసం ఆదినుంచి ఈ కుటుంబాన్ని నమ్ముకొని మదరాసు రాలేదు. పద్మావతి సంసార మోహంలోపడి ఎక్కడ సంగీతం మరిచిపోతుందో అన్న భయంతో వారు అడగగానే వారివెంటబడి వచ్చాడు. తానింత వండుకొన్నాడు వారికింత పెట్టాడు. వారు తనకోసం మాంసాహారమే మానివేశారు. బుచ్చి వెంకట్రావునకు మాంస భక్ష్యాలపై మనస్సుపోతే మిలిటరీ హోటలులో మంచిదానికి పోయి తినివచ్చాడు. స్త్రీలకున్న పట్టుదల పురుషుల కుండదు. పద్మావతి మాంసంమాని వేసిందంటే తన జన్మలో మాంసాహారమే ఎరగనిదిగా అయిపోయింది. అందుకనే నరసింహమూర్తి మేష్టారు పద్మావతిని కన్న కూతురుకన్న ఎక్కువగా ప్రేమించుకొన్నాడు.

వారు ముగ్గురూ టాక్సీమీద బుచ్చి వెంకట్రావు ఏర్పాటు చేసిన ఉత్తమమైన ఒక హోటలునకు వెళ్లారు.

రైలుస్టేషను ప్లాటుఫారం మీదగాని, కారులోగాని హోటలులో దిగి తమ భాగంలోనికి పోయినప్పుడుగాని పద్మావతి భర్తతో ఏమీ మాట్లాడ లేకపోయింది. బుచ్చి వెంకట్రావూ భార్యతో ఏమీ మాటలాడలేకపోయినాడు.

నరసింహమూర్తి మేష్టారు మాత్రం ఏదో గ్రహించినట్లు దారిపొడుగునా మాట్లాడుతూనే ఉన్నాడు ప్లాటుఫారంలో.

"ఏమయ్యా బుచ్చి వెంకట్రావూ! మాకన్న ముందు వచ్చేశావే?" అన్నాడు. అందుకు వెంకట్రావు

"అవును!" అన్నాడు.

"అక్కడ మాయమై ఇక్కడ తేలినావా?"

"అవును!"

కారులో డ్రైవరు పక్క ముందు సీటులో కూర్చుని ఉన్నప్పుడు నరసింహమూర్తి మేష్టారు వెనక్కుతిరిగి చూడకుండానే "నిన్ననే వచ్చేసేయగలిగావన్నమాట బుచ్చి వెంకట్రావూ ?" అని ప్రశ్నించాడు.

"అవును ?" అని అన్నాడు బుచ్చివెంకట్రావు!

"విమానంలో భయం వేయదూ ?"

"వేయలేదు !"

"రెండుమూడు గంటలలో విమానం రాగలిగిందన్న మాట."

"ఊఁ !"

హోటలులో "సామానెక్కడ పెట్టించమన్నావయ్యా బుచ్చి వెంకట్రావూ ?" అని నరసింహమూర్తి మేష్టారు ప్రశ్నించాడు.

"అది నీగది. ఆ గది—"

"సరే సరే !" అన్నాడు మేష్టారు.

ఇద్దరి గదులమధ్యా తనగది ఏర్పాటు చేశాడేమిటి ? అని నరసింహమూర్తి మేష్టారు దిగులుపడి పోయినాడు. తన కొద్ది సామానూ తనగదిలో పెట్టించుకొని, పద్మావతి సామాను పద్మావతిగది అని వెంకట్రావు సైగచేసి చూపించిన గదిలో పెట్టించాడు. గది, గదివెనక పడకగది, పడకగది ప్రక్కన స్నానాలగది. అందులో వేడినీళ్ల కుళ్లాయీ, చన్నీళ్ల కుళ్లాయీ ఉన్నాయి. పడకగదులలో పందిరిమంచం పరుపూ రంగుల శుభ్రమైన దుప్పటీ, బీరువా అద్దం ఉన్న బల్ల, సోపా, ఓ మంచి కుర్చీ.

అందమైన వస్తువులు అలంకరించి ఉన్నాయి. ఇవన్నీ చూచి నరసింహమూర్తి మేష్టారు ఓ నిట్టూర్పు పుచ్చి "నా కెందుకయ్యా ఇవన్నీని ?" అని అనుకున్నాడు. పది నిముషాలు ఏమిటిది ? అని తలపై చేయిపెట్టుకొని ఆలోచిస్తూ సోఫాలో కూలబడి కూర్చుని ఉన్నాడు. ఏదో జ్ఞాపకం వచ్చిన వానిలా తువాలూ, నలుగుడుపిండీ, నూనే తీసుకొని స్నానాల గదిలోనికి పోయాడు.

రమ్మని టెలిగ్రాం ఇవ్వగానే వచ్చాడు; బుచ్చి వెంకట్రావు మనస్సు మారింది అని నరసింహమూర్తి మేష్టారు పొంగిపోయాడు. హా ! వారిరువురకు ఈ విడి గదులు ఏర్పాటేమిటి ? వచ్చినప్పటినుండి ఇంతవరకూ వారిరువురకూ మాటలే లేవే ? పూర్ణమైన ఆనందంతో మాట్లాడుకోలేక పోయారా ? మొదట ఒకరిని ఒకరు చూడగానే వారిరువురు ముఖాలు వికసించాయి. తాను చూడనట్లు నటిస్తూ జాగ్రత్తగా పరిశీలిస్తూనే ఉన్నాడు. బుచ్చి వెంకట్రావుకూ సుశీలకూ ఎంతవరకూ సాగింది ? సంబంధం హద్దుదాటితే ఎందుకు వచ్చినట్లు ఈతడు ? భార్యగనక అధికారం చెలాయించడానికా ? అయితే భార్యను పరీక్ష పూర్తిచేసుకోనీయకుండా తీసుకు పోతాడా ? అయితే ఇంత కర్చయ్యే ఈ హంగామా ఎందుకు ? ఆడవారి మనస్సు బ్రహ్మకే అర్థం కాదన్నారుగాని మగవారి మనస్సులు వారికే అర్థం కావు. తాను భగవంతుని ప్రార్థన చేయడం తప్ప గత్యంతరం ఏముంది ?

౪

తన గదిలోకి వెళ్లింది పద్మావతి. స్టేషను ప్లాటుఫారంలో తన బావను చూడగానే ఆమెకు పట్టరాని ఆనందం కలిగింది. చిన్నతనంలో ఒకసారి తన బావ సముద్రానికి బలి అయిపోయాడు అన్నప్పుడు తన ప్రాణమే పోయినట్లయి, తనకీ ప్రపంచమే లేదనుకుని, తానుకూడా సముద్రానికి బలి అయిపోదామని నిశ్చయించు కొన్నప్పుడు, బావ దొరికాడు, బ్రతికి ఉన్నాడు రెండు రోజులలో వస్తాడు అని వార్త విన్ననాటి అద్భుతానందం కన్న ఈ నాడు తన కెక్కువ ఆనందం కలిగిందే ! ఆ వెంటనే బావ ఏదో విధంగా ఉంటే తాను మాట్లాడలేక పోయింది. ఏదో అధోలోకాలకు క్రుంగిపోతున్నట్లు తనకు ఆపరాని నిస్పృహ కలిగింది. తనకీ విడిగా గది ! బావకు తనపై ప్రేమే పోయిందా ? బావ తన్నిక ప్రేమించడా ? తనకీ సంగీతం ఎందుకు ? ఈ చదువులు పరీక్షలు ఎందుకు ? రమ్మనగానే వచ్చాడే ? ఎందుకు ? కళ్లనీళ్లు తుడవడానికా ? ఆమెకు వెక్కి వెక్కి ఏడ్పువచ్చింది. ఆ పందిరి మంచంపైన వాలిపోయింది.

అటు బుచ్చి వెంకట్రావుకు ఆశ్చర్యం కలిగింది. పద్మావతికి తనపై కోపం తీరలేదని అతడనుకున్నాడు. ఆమె మాట్లాడదు, అంత మౌనం. తాను సిగరెట్లు అవీ కాలుస్తూ ఉంటాడుగదా అని ఆమెకు ప్రత్యేకగదీ అవీ ఏర్పాటు చేశాడు. ఒక్కమాట మాట్లాడదు. తన కెందుకు రమ్మని టెలిగ్రాం ఇచ్చినట్లు, తన దేవి పద్మావతి ఇక దూరమై పోతుందా? ఇక్కడనుండి తన బ్రతుకు తెల్లవారి పోతుందా? అతడు సిగరెట్టుపైన సిగరెట్టు కాలుస్తున్నాడు. ముందుగదిలో ఒక సోఫాకుర్చీపై చదికిలంబడి కన్ను మూశాడు.

ఒకసారి మహామారిలా ఎక్కడనుండో తప్పు అభిప్రాయం కలిగినప్పుడు, ఆ తరువాత అందుకు సంబంధించిన వారి వర్తనమంతా ఆ భావానికి శ్రుతి అయిపోతుంది. ఆ తప్పు అభిప్రాయం ఇంకా గాటమై పోతుంది.

ఆ ముగ్గురూ ఆ రోజూ ఆ మర్నాడూ ఏలా గడిపారో? ఆ మహానగరంలోని, ఆ చుట్టుప్రక్కల విచిత్రాలు ఏలా సందర్శించినారో? కుతుబ్ మీనార్, లాల్ ఖిల్లా, జమా మసీదు, ఫత్తేపూర్ సిక్రీ పైత్యరోగి నోట భక్ష్యాలయ్యాయి. మహాత్మాజీ చైత్య ప్రదేశమైన రాజఘాట్ దివ్యక్షేత్రంకడ పద్మావతి గుండెలవియగా రోదించింది. బుచ్చి వెంకట్రావునకు కన్నుల నీరు తిరిగింది. నరసింహమూర్తి మేష్టారు ఆడదానిలా వాపోయినాడు.

మహాత్ముడు అవతారపురుషుడు. దుఃఖార్తులైన సర్వ మానవుల బాధలూ హరించి తన బ్రతుకులో ఆస్వాదించుకొన్నారు. బీదతనం వల్ల, కడుపునకు ఒక కణమైనా లేని దౌర్భాగ్యంవల్ల ఒక కన్ను నుండైనా ఒక్క బొట్టుబిందువైనా రాలిననాడు తక్కినవారి బ్రతుకులు వృథా అనీ, ఆ బ్రతుకులు హింసా పూరితాలనీ ఆయన బోధించాడు. ఆయన శిష్యులే నేడు రాజ్యభారం వహించి, దీనమానవుల నుండి కళ్లనుండి రక్తాశ్రువుల మహాఝరులుగా ప్రవహింప చేస్తున్నారని నరసింహమూర్తి మేష్టారు గజగజలాడిపోయినాడు.

ఈ అవతారము, ఈ దైవస్వరూపుడు కోరి అవతారం చాలించింది మనుష్యుల కర్కశ హృదయాలు చూచే కదా! ప్రేమలు ఉద్భవించని, ప్రేమలు ఎండిపోయిన మనుష్యులే మహాత్ముని గుండెలో రివాల్వరు పేల్చినారు. "ఓ ప్రభూ! నువ్వు ప్రేమ సముద్రానివి! ఓ పరమకరుణా మూర్తీ నీ బ్రతుకే ఒక ధర్మ విశ్వం!" అని వెంకట్రావు వివశుడై ఆ పవిత్రక్షేత్రం ఎదుట సాష్టాంగము పడినాడు.

వారందరూ లేచి ఈవలికి వచ్చినప్పుడు వెంకట్రావు భార్య దగ్గరకుపోయి "పద్మా! నాపైన ఇంకా కోపం తీరలేదా?" అని ప్రశ్నించినాడు. పద్మావతి కన్నుల నీరుతోనే అతనిమోము ఒకసారి ఆశ్చర్యంతో చూచి "కోపం ఏమిటి బావా?" అన్నది.

"వచ్చినప్పటి నుండీ ఏదో ఆలా ఉన్నావేమి?"

ఆ బాలిక కన్నులు గంగా యమున లయ్యాయి. "బావా! బావా! నిన్ను—నిన్ను—ఓ నిముషమైనా—వదిలి...ఉండలేను. నాకీ పరీక్షలూ వద్దు... ఈ...ఈ...సంగీతమూ...వద్దు!...నీ కింత చాకిరీ చేసుకుంటూ...ఉంటాను."

"అదేమిటి పద్మా!"

"బావా! నువ్వే ... నువ్వే ... నాకు ... మహాత్ముడవు...నాపైన నీకు ... నీకు ... ప్రేమ ... పూర్తిగా పోయింది...అని—అని—"

"ఓసి వెఱ్ఱిపిల్లా! నీకోసం నేను బ్రతికి ఉన్నాను. సముద్రంలో నా పడవ ఆలా దరీ అంచులేకుండా కొట్టుకుపోతూ నీమూర్తి...అందాలనీ నువ్వు...నా ఎదుట ప్రత్యక్షం అవుతూ...నాకు సరియైన దారి చూపించింది. నీ కోసం యుద్ధానికి వెళ్లాను. ఆ యుద్ధంలో నీ ఆలోచన, నువ్వు నాకోసం పెట్టుకొని ఉన్నావన్న ఆలోచన నాకు ఏనుగుబలం, సింహం శక్తి ఇచ్చినాయి. నువ్వే నన్నెప్పుడు కాపాడుకొంటున్నావు అన్న గాఢమైన నమ్మకంతో ముందుకు చొచ్చుకు వెళ్లేవాడిని."

"నా...నా...మీద...నీప్రేమ ఏమీ పోలేదు?"

"ఏలా పోతుంది. పోలేదుకదా మరీ కోటిరెట్లు పెరిగిపోయింది. నువ్వుకోరితే అన్నీమాని మన ఊరు ప్రయాణం కడ్తాను."

ఆమె కన్నులు వెలిగిపోయాయి. అప్పుడే పాల సముద్రంలో దివ్యకమలంతో ఉద్భవించిన లక్ష్మిలా ఆమె తేజరిల్లిపోయింది. ఆమె పదిమంది చూస్తున్నారని సిగ్గయినా లేకుండా భర్త పాదాలకడ మోకరిల్లి నమస్కరించింది. వెంకట్రావు ఆమెను లేవనెత్తి హృదయాని కదుముకొన్నాడు. సంధ్య చీకట్లు ఆవరిస్తున్నాయి. రాజఘాట్ పవిత్ర చైత్యంపై సాయం సంధ్యాదేవి అరుణకాంతులు వెలిగించింది.

నరసింహమూర్తి మేష్టారు తనలో ఒక నూతనానందం పాలవెల్లువలా పొంగిపోగా ఆ దంపతులను యమునానది తీరాన్నే వదిలి తాను రాజఘాట్ కడ ప్రార్థిస్తూ కూర్చున్నాడు.

చీకట్లు ఆవరించాయి. జగమంతా దీపావళిలా దీపాలతో నిండింది.

“పద్మా!”

“బావా!”

“నువ్వు బి. యే., కూడా పూర్తిచేయాలి!”

“మీరు తలపెట్టిన సినీమా పూర్తి చేయండి!”

“మనకథే కొంచెం మార్చి, పేరులు మార్చి తీయిద్దాము.”

“ఛా! సిగ్గు కాదండీ!”

“నా గీతాదేవి! నా ఆత్మలో అధివసించి ఉన్న పద్మా!”

ఆమె అతని ఒడిలో తలనుంచి అతని పాదాలు హృదయానికి అదుముకొంది.

జాజిపూల పరీమళాలు జగమంతా నిండిపోయాయి.

“ఓం అసతోమా సద్గమయ!
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతం గమయ.”

★

నిష్ఫల వైరాగ్యం—

శ్రీ ఆర్. సోమసుందర్

అర్ధ రాత్రి...సంసార విరక్తుడైన ఒక సాధకుడిటు అన్నాడు—“ఈశ్వరాన్వేషణకై సంసారమును పరిత్యజించుటకిది యెంతటి యుత్తమ సమయం! అబ్బా! నన్నెవ్వరు యింతవరకూ మాయాజాలంలో పడద్రోసినారు?”

ఈశ్వరుడు నర్మోక్తిలో ‘నే’ నన్నాడు. కాని భావి విరాగి ఆ పలుకును ఆకర్ణింపలేదు...

పాన్పుకొకమూల బిడ్డను యెదకదుముకొని అతని భార్య దీర్ఘసుషుప్తిని మునిగియుంది. వారిని భావి విరాగి పరికించి—“నన్ను యింతవరకూ మూఢుని గావించిన మీరంతా యెవర” ని మరీ పలికినాడు.

“అంతా నేనే”—అని వాణి జవాబిచ్చింది. కాని అతడు ఈ పలుకులను కూడ వినలేక పోయినాడు.

కలలో కెవ్వుమని కలవరించి బిడ్డ తల్లిని హత్తుకొని ఆమె ఒడిలో దూరింది.

“ఓయి మమతాహీనుడా! నిలు, నిలు. నీ సంసారమును పరిత్యజింపకు”—మని ఈశ్వరుడాదేశించాడు. కాని విరాగి ఆ ఆజ్ఞనుకూడ వినలేదు.

జగదీశ్వరుడు నిట్టూర్చినాడు. “నన్ను త్యజించి నన్నే అన్వేషించుటకై నా దాసుడెందుకో సంచరింప వాంఛించుచున్నాడు”—అని వాపోయినాడు.

—గురుదేవు రవీంద్రుడు

★

"తీరిక సమయాల్లో లలిత కళలు"

* శ్రీమతి పి. సుభద్ర *

ప్రపంచంలో భారతదేశం లలితకళల విషయంలో పేరు ప్రతిష్టలు సంపాదించింది. మన పూర్వీకుల అపార కృషిని కొంతకాలం మనం విస్మరించినా, తిరిగి కళాభ్యాసనకు పూనుకోడం భావి అభ్యున్నతికి శుభ సూచకం.

ఒకనాడు భారతదేశం కళాకౌశలానికి పుట్టినిల్లు అనిపించుకొంది; మన లలితకళలు మహోన్నత శిఖరాలను అందుకొన్నవి; మన కళానైపుణ్యాన్ని కళ్లార చూచి వెళ్లుటకు విదేశీయులు మన కళాకేంద్రాలకు యాత్రలు సాగించేవారు.

తీరిక సమయాల్లో స్త్రీలు వూరక ప్రొద్దుపుచ్చడంకంటె కొన్ని లలితకళలను అభ్యసించి మనోవికాసాన్ని పొందడం సముచితంగా వుంటుంది. చూడండి—ప్రతి గృహిణి సులభంగా అభ్యసించగలిగిన విద్యలు ఎన్నో ఉన్నాయి. వీటికి చెప్పుకో దగినంత పెట్టుబడిగాని, పరికరాలుగాని అవసరం లేదు. ఒక కుట్టుపని విషయం పరిశీలిద్దాం. దీనికి ఏమేమి కావాలి? సూదులు, నూలుదారం, ఉల్లు యింతేగదా? వీటితో ఎంతో అందమైన వస్తువులు తయారు చేయవచ్చును గదా? పిల్లలకు ఈ అల్లిక పని సులభంగానే నేర్పవచ్చు. కళాదృష్టితో ఈ విద్యను అభ్యసిస్తే ఎంతో ఉత్తేజకరమైన వస్తువులను తయారుచేయడానికి వీలుంటుంది. గృహాలంకరణానికి శోభనుకూర్చే కర్టనులు, మేజాగుడ్డలు, పడకల మీద దుప్పట్లు, పిల్లల ఉడుపులు మరి ఎన్నో విధాలైన బట్టల మీద కళాకౌశలాన్ని ప్రదర్శింపవచ్చు. వీటి తయారీ వల్ల కొంతవరుమానాన్ని సంపాదించి, తద్వారా కుటుంబ ఆదాయాన్ని పెంపుచేసుకోవచ్చు. సరైన దృష్టితో యీ విద్యను అభ్యసిస్తే అభ్యాసకుల దృక్పథంలో కళాకాంతులు వినూతనమైనవెన్నో పొడసూపక మానవు.

విశ్రాంతి సమయాల్లో స్త్రీలు తమ కుటుంబాలకు కావలసిన బట్టలో కొంతైనా సంపాదించడానికి శ్రమించాలి. యీ విషయమై మహాత్మాగాంధి ఒకప్పుడు యిలా అన్నారు: "నన్నడిగితే స్త్రీ విధులలో నూలు వడకడం ముఖ్యమైంది అంటాను. పురుషుడు పొలాలుదున్ని పండిస్తే, స్త్రీ నూలు వడికి బట్టలు నేయిస్తుంది. ఈ విధంగా స్త్రీ పురుషులు జీవిత రంగంలో అన్యోన్య సహాయం చేసుకుంటూంటే దేశం సుభిక్షంగా ఉంటుంది. నూలు వడకడం దేశాభ్యుదయానికి ముఖ్యం. తద్వారా స్త్రీలు దేశసేవ చేస్తున్నారన్నమాట." అంటే ఖద్దరు పరిశ్రమకు స్త్రీ వెన్నెముక యని వారి అభిప్రాయం.

సంగీతం అతి చక్కని విద్య. స్త్రీలు సహజంగా మంచి శారీరాన్ని కలిగి వుంటారు. సంగీతాభ్యసనంలో ఒక ఆధ్యాత్మిక ఆనందం మేళవిస్తుంది—కళారాధకునకు కలిగే ఆనందం శ్రోతకుకూడ లభిస్తుంది. జీవితానికి వికాసాన్ని, ఆనందాన్ని యివ్వగలిగే శక్తి సంగీతానికి అద్వితీయంగా వుంటుంది. మన కర్నాటక సంగీతశాస్త్రం పునరుజ్జీవింప చేయబడే మంచిరోజులు వస్తూ వున్నాయి. మన త్యాగరాజు పెంచిన సంగీత తరువు మహా వృక్షమై తన తియ్యని ఫలాలను ఆంధ్ర దేశానికేగాక, అరవదేశానికంతా అందజేసింది. ఆ మహనీయుని రచనలు, మన సంగీతానికి స్వాభావికమైన భావసంపదను, కళారూపాలను ప్రతిబింబిస్తున్నాయి. కళ స్వేచ్ఛగా అభివృద్ధి పొందిననాడే యిటువంటి వైవిధ్యమూ, సృజనాత్మక భావశబలత రూపొందుతాయి. భారత పౌరుని కదలించే విషయాలు—శాంతి, నిర్మాణాత్మక కృషి—మన సంగీతకళలో ప్రతిబింబించాలి. మన సంగీత రచనలు నూతన భావాలకు, నవనవోన్మేషమైన సృజనాత్మక చిత్రణకూ, గాఢమైన సజీవ వ్యక్తీకరణకూ పేరుపడ్డవిగా వుండాలి.

సంగీతంలో వుండే మహావిశేషమేమంటే మానసికంగా ఏ వ్యక్తి అయినా ఏ విధమైన సంగీతం నచ్చితే దాన్నే అభ్యసనం చేయవచ్చు. మగవారికంటే మగువలు వ్రేళ్లతో సున్నితంగా వాయిద్యాలను పలికించడంలో ప్రతిభను చూపగలరు. ప్రపంచములో ఏన్నో వందలరకాలై

తీరిక సమయాల్లో లలిత కళలు

వాయిద్యాలున్నాయి కదా? కాని మన వీణకు సరిపోల్చగలిగిన వాయిద్యం ఒక్కటైనా వుందా? వీణకు వీణేసాటి. బ్రహ్మనాదాన్ని ప్రతిబింబించే మహా ప్రభావం దీనిలో వుంది. ఇట్టి పవిత్ర వాయిద్యాన్ని చేపట్టగలిగిన గృహిణి జీవితమే సార్థకం. మన నవనాగరిక హార్మోనియాన్ని ఎంత సిద్ధహస్తులు వాయించినా సరే వీణ పలుకును పలికించగలరా? నాదస్వరం, పిల్లనగ్రోవి, ఫిడీలు, మృదంగం, కంజీర, వాయిద్యాలు మనసును ఎంతో రంజింప జేస్తాయి. ఏదో ఒక వాయిద్యాన్నయినా అభ్యసించి కళోపాసకులం కావడం మన పవిత్ర ధర్మం.

నాట్యం లలితకళలకు రాణివంటిది. ఆదేశం, ఊహ, విజ్ఞానం వున్నవారు యీ విద్యను ఆరాధిస్తే దానిశోభ సర్వజనామోదాన్ని పొందగలగడం తప్పనిసరి. ఇది శారీరకంగానే గాకుండా మానసికంగా గూడ వికాశాన్ని కలిగిస్తుంది. నేడు మన సీమలో భరతనాట్యంలో అభిరుచి జాస్తి అవుతున్నది. మన బస్తీలో వుండే స్త్రీలకేగాకుండా, గ్రామాల్లో వుండే మగువలకు కూడ తీరిక సమయాల్లో అభ్యసించడానికి అనువుగా సంగీత, నాట్యమందిరాలు నెలకొల్పాలి. కళాదృష్టితో చూస్తే మన భరతనాట్యానికి సరిపోయినది ప్రపంచంలో మరేదేశంలోగాని లేదనే చెప్పాలి. అంచేతనే దాని కౌశలాన్ని చూచిన విదేశీయులు ముగ్ధులై పోతున్నారు. ఈ దశాబ్దంలో మనదేశంలో నాట్యకళకు మంచి ప్రాముఖ్యత ఏర్పడింది. ప్రతి సీమలోను నాట్యకళారాధకులు వుంటున్నారు. పరదేశాల కెళ్లి మన కళాప్రౌఢిమను ప్రకటించే శక్తి సామర్థ్యాలుగల యువతులనేకమంది నేడు రంగస్థలంలో వున్నారు.

స్త్రీలు తీరిక సమయాల్లో శిల్పం, చిత్రలేఖనం ద్వారా పల్లె ప్రజలకు కావలసిన కళాన్విత వస్తుసామగ్రిని కూడ తయారు చేయవచ్చు. ఈ లలిత కళా పరిశ్రమలో స్త్రీకే ప్రత్యేకత వుంది. స్త్రీ సహజంగా కళాస్వరూపిణి—ఆనందదాయిని—ఆమె హస్తస్పర్శలోనే కళ పుడుతుంది. కృష్ణాజిల్లాలోని కొండపల్లి బొమ్మలు, ఏలూరు తివాసీలు చెన్నపట్టణం బొమ్మలు, మైసూరు సిల్కుచీరలు, బందరు కలంకారీ అద్దకం, తిరుపతి చందనపు బొమ్మలు, తిరువాన్కూరు, విశాఖపట్టణపు దంతపు చెక్కడాలు—స్త్రీలు పనిచేస్తున్న లలితకళా పరిశ్రమలకు యింతకన్నా ప్రత్యక్ష నిదర్శనాలు ఏమికావాలి? ఈ విధంగా మన దేశంలో స్త్రీలు సంగీతంలో, చిత్రలేఖనంలో, నాటక కళలో, క్రీడలలో తమకుగల సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి.

నిజమైన కళ ప్రజల ఆత్మనూ, వారి అంతర్గత మనోభావాలను, ఆశయాలను, ప్రతిబింబిస్తుందని ఒక పురాతనమైన సూక్తివుంది. స్వభావంలోను, స్వరూపంలోను, వైవిధ్యం గలిగిన లలిత కళలలోని ఉత్తమ రచనలు నేటి జీవితంలో గల ముఖ్యఘటనలను ప్రతిబింబించాలి. ఇవన్నీ మన దేశ ప్రజల జీవితానికీ, ఆదర్శాలకు సంబంధించిన స్పష్టమైన రూపచిత్రాన్ని చూపాలి. శాంతి! ప్రతి భారత స్త్రీ హృదయకుహరంలో ప్రతిధ్వనించేది యిదే. కళారచనలు ఆనందాన్ని, శాంతియుతమైన కృషిని ప్రతిబింబించాలి. శాంతి! మన కళలో సాధారణంగా కానవచ్చే ముఖ్యాంశంగా వుండాలి. శాంతికి అంకితం చేయబడిన చిత్రాలు తక్కిన వాటన్నిటికంటె, మన కళాకారులకు ప్రజలతోగల సన్నిహిత సంబంధాన్ని వ్యక్తపరచుతున్నాయి. దివ్య శాంతిగానం—మన కళకు చుక్కాని.

భారత నారీమణులు పరిశ్రమిస్తే లలితకళలో సాధించరానిది అంటూవుండదు. అంచేతనే ఓ మహాకవి "మదితల్ నేర్వగరాని విద్యగలదే ముద్దార నేర్పించినన్" అని సత్యాన్ని చాటి చెప్పారు.

జై భారత్

(ఆలిండియా రేడియో సౌజన్యంతో.)

★

శాపం

* శ్రీమతి ఎ. మంగతాయారు *

[కుళ్లు, కపటాలకు, మాయ మోసాలకు నిలయా లయ్యాయి గ్రామాల్లోని నేటి రేషను షాపులు. సక్రమ పద్ధతిలో ప్రభుత్వము రేషను అమలు జరుప లేకున్నారు. అన్యాయాక్రమాలు తొలగించాలంటే ప్రభుత్వము వెంటనే రేషను రద్దు చేయుటయే ఉత్తమమైన మార్గం.........రచయిత.]

సుబ్బారావు, రేషను షాపు గుమస్తా.

చంద్రమ్మ, తూర్పునుంచి క్రొత్తగా వచ్చిన హరిజన స్త్రీ.

సుబ్బారావు : ఛీ, ఛో, అవతలికి పతుందా లేదా? ఎందు కంత అబద్ధాలు.

చంద్రమ్మ : నూవ్వా, నేనా అబద్ధమాడేది. 5 రు॥లు పుచ్చుకు నేదంటావు. మాలోళ్లంగదా అని యిట్టం వచ్చినట్టు బొంకేత్తున్నావు. మాకు కులం ఫధానం గాదు. గునమే పధానం.

సు : అయితే నేనే అబద్ధ మాడుతున్నానంటావా. యింత ట్లోకే ఎక్కడెట్టాను. నువ్వేచూడు. నిజంగా యిస్తే ఆ పెట్లోనే పడేద్దును. నువ్వివ్వాలేదు. నేనెక్కడా పెట్టాలేదు. అల్లరి చేయక మర్యాదగా అవతలికి నడు లేకపోతే గెంటేస్తాను.

(సుబ్బారావు బియ్యం మూట లాక్కున్నాడు)

చం : బాబోయ్. సుబ్బారావుగోరు. నాను సత్తెంగా సెపుతున్నా. నా యిద్దరి బిడ్డ పమాణంగా నా నిచ్చినాను. రెండు రెండు రూపాయిల కాంయితాలు ఓ రూపాయి యిచ్చినాను. నేదంటారేంటి బాబు?

(చంద్రమ్మ గొల్లుమని ఏడవటం మొదలెట్టింది)

రేషను షాపు చుట్టూ జనం పోగడ్డారు. (చంద్రమ్మ చెప్పుకోవడం మొదలెట్టింది.)

చం : బాబయ్యా. నాయం సెప్పండి. డబ్బీందే బియ్యం ఎలా కొల్చినారు. బియ్యం మూట కట్టుకుంటున్నాను బాబు. మూట నాక్కుని, నువ్వు డబ్బీనేదు ఎలా పట్టు కెడతవాంటున్నాడు సూడండి బాబు. నాకు సత్తెమే పధానం.

సు : నీ యేడుపుల కెవరూ దడవరు. ముందవతలికి నడు. నాపని చెడుతూంది. ఇదేం గోలండీ. ఎంత మందికి బియ్యం యివ్వటంలేదు. డబ్బు పుచ్చుకోవటం లేదు. యిలాంటి గొడవెప్పుడేనా వచ్చిందా? పోనీ నేనొక్కడనే వున్నానుటండీ, పంతులు లేడూ యిక్కడ. యిలాంటి దాన్నెక్కడా చూడలేదు.

చం : ఆలకించండి బాబయ్యా. మా మనిషికి వంటో సుఖం నేదు. సంటిబిడ్డ తల్లినైనా నానే పన్లో కెల్తున్నాను. 10 రోజుల కూలి పెద్దయ్యగోరు తిప్పి, తిప్పి, ఈరోజేలే యిచ్చినారు బాబు. మా మనిషికి తెగు లొచ్చినప్పటి నుంచీ పూటతింటే పూట నేదు. నాయంగా యిత్తేనే యిచ్చాడు — లేకపోతే......(చంద్రమ్మ మాటన బోయింది. ముఖం ఎఱ్ఱబారింది. మనస్సాక్కమాటు మారింది. యింకేమీ మాటన్లేకపోయింది) బాబా యిదంతా నాబిడ్డ ఖరమం అంటూ కళ్లనీళ్లు తుడుచు కుంది.

వచ్చిన వాళ్లు చంద్రమ్మని నిజంగా యిచ్చావా అనే వాళ్లొకరు, ఎక్కడేనా పారేసుకున్నావా అనేవాళ్లొకరు. సుబ్బారావుని మాత్రం ఎవరూ ఏమన లేకపోయారు. ఆ ఊరి పెద్దలందరకు, ధనవంతులకు, ఎక్కువగ పంచదార కావాలన్నా బియ్యం కావాలన్నా అతనిదే సప్లయి. ఇదేటయిములో ఆ గ్రామంలో ధనవంతులు, అయ్యంగార్లు, కర్ణం గారు బస్సుకోసరం వెడుతూ ఈ గొడవచూసి కొట్లోకెళ్ళి

బోయారు. చంద్రమ్మ కర్ణంగారి కాళ్ల మీదపడి ఏడుస్తూ.

చం: సూడండి బాబా మీరు పెద్ద బాబులు. నాయం సెపుతారు. 5 రూపాయ లిచ్చినాను. ఈ నేదంటాడు.

కర్ణంగారు: ఏయ్ నడు. నడివతలికి. అదెక్కడ మఱచి పోయావో. బుద్ధుందా లేదా? పైగా యిదంతా అల్లరి చేస్తున్నావు.

చం: ఆ! మీరుకూడా యిదేమాటా. నాయం సెపుతారను కున్నా.

(అంతవరకూ ఏడుస్తున్న చంద్రమ్మ ఒక్కమాటు రౌద్రరూపం దాల్చింది. అన్యాయ పిశాచాలు ఆమెకళ్ల యెదుట నాట్యం చెయ్యడం సహించలేక పోయింది.)

చం: అవును బుద్ధినేదు. అంతా కల్లు. సత్తెం నేదు. నాయం నేదు. మీలాంటి పెద్దలే ఈసెల కీసెల పణద్దార, బత్తాలకు బత్తాలు బియ్యం మాలాంటోళ్ల నెత్తికొట్టి యింటికి జేరేసుకుంటరు. ఏం జయం బాబు మీకిది. అందుకనే మీరునాయం సెప్పనేరు. మీలాటి కామందుల బలం చూచుకుంటే ఈన మమ్మల్ని మాయసేసి మోసం జేత్తుండరు.

బాబూ, సుబ్బారావుగోరు. నానెప్పుడూ ఒకర్నీ మాట స్నేదు. నామాటకే సత్తెంవుంటే, నానే నిజం సెపితే నారెక్కల కట్టం తీసుకున్నందుకు, తెల్లారేచరికి భూమంతుని మాత్తెం కనిపిత్తందిసూడు. నామాటకు తిరుగునేదు.

అయ్యంగారు: ఒరేయ్ వెంకన్నా, దీన్ని రెక్కట్టుకు గెంటరా. మహా పోగరు మోతుదానిలావుంది.

చం: బిడ్లనోటి కాడ కూడు పడగొట్టినరు. (అంటూ చంద్రమ్మ వెనక్కు తిరిగి చూడకుండా వెళ్లిపోయింది.)

మర్నాడు సుబ్బారావు మూడవ కూతురుకు అకస్మాత్తుగా పిల్లలకొచ్చే జబ్బు వచ్చింది. డాక్టరు పెదిమ విరచాడు. సుబ్బారావు భార్య భోరున ఏడ్చింది. సుబ్బారావుకు చంద్రమ్మ జ్ఞాపకం వచ్చింది. న్యాయదేవత నవ్వింది.

★

ఏది అభ్యుదయ మార్గము?

* శ్రీమతి పి. సుశీల *

ప్రస్తుత మధ్యతరగతి కుటుంబాలలో సంస్కరణ అంటే సరిపోదేమో అనుకుంటా! ఆడపిల్లల వివాహాలలో జరిగే అవకతవకల మూలంగా కలిగే అసంతృప్తి ఒక వంక, నాగరికతా చిహ్నమైన చదువు చదివించాలనే ఆశయాలు మనసులో భాధిస్తోంటే, విద్యాభివృద్ధికి దారితీయడాన్కి కుటుంబాలలో వెనుకపడిన అభివృద్ధి నిరోధక వ్యక్తులవలన వచ్చే ఆడ్డంకులకు తట్టుకునే శక్తికోరకు పెనగులాట మరియొక వంక, బాధిస్తూ వుంటాయి. ఇంక మూడో విషయం సమాజంలో పెద్దలు నిర్వహించే భాధత్య ఒకటివుంది కనుక, ఆర్థిక పరిస్థితులు చక్కగా లేకపోవడంవలన నిర్ణీత వయస్సురాగానే ఒక అయ్యచేతిలో స్త్రీని పెట్టి భాధ్యత ఒదిలించుకునే ప్రయత్నం. ఇన్ని ప్రతిబంధకాలవలన మరొక గత్యంతరం లేక మధ్యతరగతి కుటుంబ మర్యాదలు, సాంప్రదాయాలు, దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తు నిర్ణయించవలసి యుంటుంది.

ఏమనండి, సమాజములో ఆడవాళ్ల ఆర్థికపరిస్థితులు, అభివృద్ధికాలేదు! చదువుకొన్న స్త్రీలైనా కొద్దిమంది. పైగా చదువుకున్న స్త్రీలలో, ఉద్యోగము నిర్వహించే స్త్రీలెంతమంది అంటే వేళ్లమీద లెక్కించ వచ్చును గదా! ఆ కొద్దిమందైనా, స్వతంత్ర ఆర్థిక జీవనంకొరకు సమాజాభివృద్ధికి ఏదో ఒక పాత్రను నిర్వహించుతూ వుండడం అభ్యుదయమే!

అంత మాత్రము అభ్యుదయమని తలచి ఊహించే వాళ్లు, ప్రోత్సహించే వాళ్లు కొద్దిమంది ఉన్నా సముద్రములో కాకిరెట్టలా వాళ్ల కంఠం ఎవరికి వినిపిస్తుంది.

అనైక్యత, అసౌఖ్యతచేత, ఆ నాలుగు గోడలే ప్రపంచ ప్రాకారాలుగా భావిస్తూ స్త్రీలకు ఆ స్థానమేవుచితమని అనుకుంటూ, అందుకుగాను సమాజ ప్రతిబంధకాలు బిగిస్తూ, జరిగే అవకతవకలకు కర్మసిద్ధాంతాన్ని స్త్రీ జాతి నెత్తిని రుద్ది తమయొక్క విశ్రాంతి స్వేచ్ఛలకోసం క్లబ్బులు, పార్కులు, సినిమాలుచుట్టూ లేదా, జార గృహాల చుట్టూ తిరుగుతూ, అదే పెద్ద సంస్కరణగా భావిస్తూన్న ఈనాటి నవనాగరీక వ్యక్తులు స్త్రీ జాతి అభివృద్ధి కొరకు విశపమైన కృషి చేయడంపోయి, వీలైతే ఒకరాయి స్త్రీ మీద (అపనిందలు) వేద్దామనుకునే ఈనాటి సంస్కరణే చాలామందికి పురుషుల్లో కనిపిస్తూంది. వీరితోపాటు సమాజంలో సనాతనంగా కరడు గట్టుకుపోయిన స్త్రీలు, ఈ పరిస్థితుల్లో కొట్టుకుపోయి స్త్రీ స్థానం నాల్గుగోడలనే సిద్ధాంతాన్ని బలపరుస్తున్నారంటే ఆశ్చర్యమేమీ లేదంటాను!

అభివృద్ధి నిరోధకులు తమ స్వార్థానికి అడ్డు తగిలే ప్రతీ సమస్యా సమాజంలో పెద్ద తప్పుగా భావిస్తారు. గోరంతలు కొండంతలుగా చిత్రిస్తారు. ఇటువంటి సమాజ వాతావరణంలో కూడా అనేక కుటుంబాల్లో చొరవగలిగిన కొంతమంది పురుషులు తమ కుటుంబంలోని స్త్రీల పాత్రగుర్తించి వారి అభివృద్ధికొరకు విజ్ఞానంకొరకు పాటు పడుతున్నందుకు చాలా సంతోషించ వలసినదే! కాని ఇంకా కొన్ని చిక్కులలో సతమత మవుతూన్న కుటుంబాల పరిస్థితి చూద్దాం!

అమ్మాయిని ఉద్యోగములో తన భవిష్యత్తును తాను నిర్ణయించు కొనడాన్కి తన వ్యక్తిత్వముతో పాటు ఆర్థిక స్వతంత్రము కల్పించాలా? లేదా? నిర్వచనమైన సనాతన సమాజాచారాలలో కొట్టుకు పోవడమా? ఏది వాంఛనీయం? అనే సమస్యలతో సమాజంలోని చాలా కుటుంబాలు సతమతమవుతున్నాయి.

ఈ రోజుల్లో ఆడపిల్లలను కొద్దో గొప్పో అందరూ చదివిస్తూనే వున్నారు. అయితే చదివిన వాళ్లంతా, ఉద్యోగాలు నిర్వహిస్తున్నారా? లేదు. అంతా చదివించడంలో గల ఆంతర్యము ఏమీ లేకపోవచ్చును. అమ్మాయికి ఏ పెద్ద చదువుచదివిన మొగుడో వస్తాడనో లేక కుటుంబ గౌరవం కొంత పైకివస్తుందనో అంతే. అయినా ఇవీదీ ఒక మెట్టు ముందుకు రావడమే! ఇది సమాజములో అంతర్గతముగా పొందే పరిణామాలలో, ఒక దశకువచ్చి అంతకంటె ముందుకు పోవడాన్కి దారులులేక అక్కడితో ఆగిపోవలసి వస్తూంది.

ఏది అభ్యుదయ మార్గము?

ఆ అడ్డును విచ్ఛిన్నంచేసి సరిహద్దులను దాటి ఇంకొక అడుగు ముందుకు వేసే వుదాహరణలు వున్నాయి. సంస్కరణ, సమాజ మర్యాదలు, ఈ రెంటిలో ఏది ప్రాధాన్యత వహిస్తుంది, అనడంలో, కుటుంబ మర్యాదలు సమాజ అడ్డంకులే ప్రాధాన్యత వహిస్తున్నాయి. అమ్మాయిలే తీరా వుద్యోగము చేస్తుంటే సమాజం ఇచ్చే దీవెనలతో (నిందలు) సరైన సంబంధం కుదురదేమో ననే బెంగ కూడా వుంది. ఆడపిల్లలుగల మధ్యతరగతి కుటుంబాలు స్త్రీ ఆర్థిక ప్రతిపత్తికి కృషిచేయాలంటే, ఇన్ని తీరని సమస్యలు! వీనిలో ఆలోచిస్తే ముందడుగా, వెనుకడుగా అనే సమస్య చదువుకొన్న స్త్రీల విషయంలో ప్రత్యక్షమౌతూంది.

అందుకనే స్త్రీల దృష్టిలోకూడ, స్త్రీ చదువులో వెనుకబడ్డా వుద్యోగం చెయ్యాలా ఊళ్లేలాలా? అనే కనీసపు అభిప్రాయంవుంది. ఇంకో చిన్న విషయం, స్త్రీని డబ్బుపెట్టి చదివించినా, మళ్లా వరకట్నాలు తప్పవాయె, మగవాడిని చదివిస్తే కలిసివస్తుంది అనే ధోరణిలో ఆడపిల్లకు ఏదో నామమాత్రపు విద్యతో స్వస్తి చెప్పిస్తున్నారు.

ఈ రెండూ నిర్వహించిననాడే దేశాభ్యుదయాన్ని దోహదం ఇస్తుంది. స్త్రీల ఆర్థికస్థితి ఆనాడే చక్కబడుతుంది. చరిత్రలో స్త్రీలు నిర్వహించిన పాత్రలను గురించి ఈనాడు మనం పురాణాల్లో కట్టుకథలవలె చదువుకు ఆనందించడమేగాని, అనుకరించుట జరుగుట లేదు. ఆ నాటి స్త్రీల కార్యదక్షత మనలను ముగ్ధులను చేస్తూంది.

పైగా అది సత్యకాలం కనుక చెల్లిందనవచ్చు. లేదా ఆ వుద్యోగాలకు పొట్ట చేత్తో పట్టుకున్న వాళ్లకే చెల్లిందనచ్చు. ఈ నిర్వచనాలు చేస్తో, స్త్రీ ఆర్థికహక్కులు అనుభవించలేదని మర్యాద భంగం అనే సాకులతో స్త్రీకి పరిధులు ఏర్పడ్డాయి. క్రిష్టియన్ మతములో చూడండి. ముందు స్త్రీకి పురుషునితో సమానంగా ఆర్థిక అభివృద్ధికి దోహద మిస్తారు. వివాహాలు కూడా అటువంటి స్త్రీలకే కట్న కానుకల బాధ లేకుండా అవుతాయి. ఈ పద్ధతి మనం మెచ్చుకుంటాం. అయితే ఆచరణలో జరిగేది ఇందుకు వ్యతిరేకము.

మన మధ్యతరగతి కుటుంబాలలో తాండవిస్తున్న దరిద్రాన్ని హేతువు, ఒకరిమీద పదిమంది ఆధారపడి వుండడమే! ఈ ఆర్థిక సమస్యతోపాటు వివాహ సమస్య ముడిపడి వుండడం, వేలకువేలు కొంపా గోడీ అమ్ముకుని ఆ అల్లుడిగార్ని కొనుక్కు తెచ్చుకుంటే వారి అభిరుచులకు నెగ్గితే సరి, లేకపోతే కాపరాలుచెడి, ఆ పిల్లను మళ్లా తమ బాధ్యతల్లోకి తీసుకుని అనేక విపరీత పరిస్థితులకులోను కావలసి వస్తోంది.

ఇటువంటి పరిస్థితుల్లో శ్లేష్మంలోపడిన ఈగవలె కొట్టుకుంటె ఈ రోజున ప్రధాన సమస్యగా పరిణమించిన వాటిని పరిష్కరించడాన్ని ముందుకు రావడం అభ్యుదయము కాంక్షించడంతో పాటు, స్త్రీ జాత్యభివృద్ధికి దోహదము కాదా!

ప్రస్తుత అధునాతన సమాజ పరిస్థితుల్లో వరకట్నాలు, అల్లుడిగారికే కాక, లాంఛనాల రూపంలో వియ్యపురాలుగారు, ఆడబడుచులకు కూడా రేట్లువిపరీతంగా పెరిగిపోయాయి. ఇటువంటి పరిస్థితులు సమాజాభివృద్ధికే తీరని చిక్కుగా పరిణమించాయ్! ప్రభుత్వం వరకట్నాలు నిషేధించినా, ఈనాడు, కంట్రోల్స్ వస్తువులమీద వున్నా బ్లాక్ మార్కెట్ ఎల్లా బాహాటంగా సాగిపోతూందో, అల్లాగా చట్టము వున్నా కట్నాల బ్లాక్ మార్కెట్ ధరలు రోజురోజుకు పెరిగిపోయి, చితికిపోయే కుటుంబాలను, నేలమట్టం త్వరగా చేస్తున్నాయ్!

ఈ సమస్య పరిష్కరించడం ఆడపిల్లలను ముందుకు వచ్చి చదివించడం వరకే కాక అవకాశాలున్నంతవరకు, వివిధవృత్తులలో వారుజేరి, ఆర్థిక స్వాతంత్ర్యం పొందే విధానాన్ని ప్రోత్సహించటం, అప్పుడుగాని సమాజము ఉన్నతిని పొంది, వివాహము మొదలుగాగల అన్ని సమస్యలూ పరిష్కరింపబడవు. (ముఖ్యంగా ఆర్థిక చిక్కులను తొలగించుకోడాన్ని కూడా)

“దేశ సౌష్టవాన్ని ఆర్థిక విధానం ఎంత గీటురాయో, కుటుంబ గౌరవ మర్యాదకు ముఖ్యంగా నైతిక జీవితాన్ని ఆర్థిక స్వాతంత్ర్యము అంత ముఖ్యమనడంలోసందేహములేదు.”

మన దేశాన్ని ఆర్థిక స్వతంత్రం లేక పోవడంవల్ల పెట్టుబడి దేశాలకు ఏ విధంగా దాసోహమనవలసిన వస్తోందో ఆవిధంగానే, స్త్రీలకు విజ్ఞానమున్నా ఆర్థిక ప్రతిపత్తిలేని మూలంగా, సమాజ వాతావరణాన్ని బలి కావలసి వస్తోందంటే ఆశ్చర్యం లేదు!

★

కీ. శే. శ్రీమతి రుక్మిణీ లక్ష్మీపతి

* శ్రీమతి కనకమ్మ, శ్రీమతి లక్ష్మీబాయమ్మ *

భారత జనని నేడు మరియొక ఉత్తమ పుత్రికా రత్నాన్ని కోల్పోయింది. స్వాతంత్ర్య యోధులైన వీరయోధులలో ఒక సాధ్వీమతల్లి అస్తమించింది. సరోజినీ దేవివంటి నాయకమణులస్తమించిన కంటితడి ఆరకముందే సోదరి శ్రీమతి ఆచంట రుక్మిణమ్మగారి నిర్యాణవార్త మమ్ములను గాఢ విషాదంలో ముంచింది. దక్షిణావనికే కాదు, భారత భూమికేయిది తీరనికొరత. ఆమె ధన్యజీవి.

శ్రీ రుక్మిణమ్మగారు గొప్ప విదుషీమణి. భారత స్వాతంత్ర్య సమరములో ఆమె నిర్వహించిన పాత్ర అమోఘమైనది. ఆమె సేవా త్యాగములు ఆదర్శనీయములు. మహిళాభ్యుదయమునకు ఆమె చేసిన కృషి అపారము. దేశ సేవలో అడుగు పెట్టినది మొదలు తుది క్షణము వరకు ఆమె ప్రజాహితము కొరకే తనకాలము వెచ్చించినది. జాతీ యోద్యమములు వేనియందును ఆమె వెనుకాడలేదు. కర్తవ్యమును ఎన్నడును ఏమరలేదు. సర్వవిధాల దేశానికి సంఘానికేగాక కుటుంబానికి కూడ ఉత్కృష్ట సేవ చేసి కీర్తి శేషురాలైన ఉత్తమయిల్లాలు. దేశ కల్యాణానికి జీవితాలు అంకితం చేసికొన్న చరితార్థులలో ఆమె యొకరు. స్వాతంత్ర్య వీరనారీమణులైన భారత స్త్రీలలో ఆమె శాశ్వతముగా వెలుగొందగలరు.

మా కామె కేవలము సోదరివంటిది. ఆ ఆత్మీయమైత్రి చిరస్మరణీయమైనది. జైలులో వారు అతి సన్నిహిత మిత్రులలో ఒకరుగా ఉండేవారు. ఈ విషాదవార్త వినగానే అవి అన్నీ కళ్లకు గట్టునట్లయినవి.

శ్రీ రుక్మిణీ లక్ష్మీపతిగారిది మంచి సంస్కార కుటుంబము. వారియిల్లు వచ్చే పోయేవారితో ఎప్పుడూ కలకలలాడుతూ వుండేది. బంధుమిత్రులకు, అతిథి అభ్యాగతులకు వారు స్వయంగా చేసే సత్కార మర్యాదలు ఎంతో ఆదరణీయమైనవి. బీదలపై ఎంతో ప్రేమ వాత్సల్యాలు చూపేవారు. వారి అండచేరి బ్రతుకు తెరువు పొందిన వారూ, వారి నాశ్రయించి ఉన్నతి చెందినవారూ ఎందరో యున్నారు. ఆమె నిరాడంబరము శ్లాఘనీయము.

ఆమె ఎన్నో పదవులు నిర్వహించినారు. శాసన సభలు ఎన్నికలలో తొలిసారిగా పాల్గొని గెలుపొందిన మొదటి స్త్రీ ఆమె. మద్రాసు రాజ్యాంగములో మంత్రిపదవి నిర్వహించిన ఏకైక మహిళామణి కూడ ఆమెయే. ఇంకను మద్రాసు అన్నామలై యూనివర్సిటీల సెనేటు సభల యందును, అనేక ప్రజా సంస్థలలోను, ప్రభుత్వ కమిటీల లోను సభ్యురాలై విశేష కృషి చేసినది. తన మంత్రిత్వ హయాములో పట్టుదలవహించి మద్రాసు ఎల్. ఐ. ఎమ్. స్కూలును కాలేజిచేసి మెప్పు పొందినారు.

ఏ సభలకైనా అధ్యక్షులుగా రాక తప్పదని ఆహ్వానిస్తే శాంతంగా అంగీకరించి విచ్చేసేవారు. వేదికపైని లిస్తే ఇక సింహగర్జనమే. చక్కనివక్త. ఆధారావాహినికి ప్రేక్షకులు ముగ్ధులు కావలసిందే. అంత చక్కని ఇంగ్లీషుమాట్లాడ గలవారు పురుషులలో సైతము అరుదు.

జాతీయ అంతర్జాతీయ రంగాల్లో ఆమె అత్యంతమూ పేరు ప్రతిష్ఠలు పొందినది. అంతర్జాతీయ మహిళా సభల్లో ఆమె ప్రాతి నిధ్యం భారతభూమికి కీర్తి తెచ్చింది. ఆమె ఎంత విద్యావతియో అంత స్నేహమయి. ఎంత త్యాగశీలయో అంత సేవావ్రత. మహిళా లోకానికి మాననీయ మైన చక్కని సంస్కృతీ జీవనాన్ని ప్రదర్శించి ఇహలోక యాత్ర చాలించారు. నిండు జీవితమున షష్ఠి పూర్తిగడపి ఆ పండు ముత్తైదువు బిడ్డలముందు భర్తముందు ఉల్లాసముగా వెళ్లిపోయినారు. ప్రశాంతముగా కన్నుమూసి భారత స్త్రీ కోరుకునే పరమ పదవి ప్రాపించింది ఆ పుణ్యవతి.

అసత్తునుండి సత్తుకు, తమస్సునుండి జ్యోతిస్సుకు
మృత్యువునుండి అమృతమునకు నిర్గమించిన ఆ
పవిత్రాత్మకు సర్వదా జోహార్లు:

★

వనలక్ష్మి

* శ్రీమతి అయ్యగారి రాఘవమ్మ *

వనలక్ష్మీ! నినుగన్న నేమొ కొ మదిన్ వేవేడుకల్ పుట్టు నీ
కనుసన్నన్ వశియించి వాకలుగు గాథల్ చెప్పుకొందమ్మరో;
యని నిన్నే మనసారగాఁబిలువఁగా నౌత్సుక్యతం జెందు; శ్రీ
వనితా నీదు కరాబ్జమెంత మృదువమ్మా; తెల్పశక్యంబొకో;

ఈ వేలేకనె యున్న నీ జగమెడారే గాదె; ఓతల్లి! నీ
పూవుల్గుత్తుల రంగు సౌరభములున్ పోషించి వర్ణింప, నా
భావాడంబర వీధి, చాలదిఁక నిన్భావించి కన్మోడ్చెదన్
దేవీ; సందియమేల రమ్మికను హృద్గేహాన పూజించెదన్:

చిన్నారి పొన్నారి చిఱుతగూండ్లను కట్టు
కొని వశించెడు పక్షికులములెన్నొ
పాంథులాహార పానీయముల్ సేవించి
చల్లగా నిద్రింత్రు చల్లగాలి
ముదముతో నిన్గొల్చి మ్రొక్కుచునుందురు
అతివలు గొందఱారాధ్యవనుచు
ధన్యోస్మి యనుచుంద్రు తల్లి నీ నీడల
సుఖముగాంచెడి యోగిశుభగులెల్ల


అందఱకు నన్ని విధముల నన్నిచోట్ల
నలరి సృష్టిలో నే ముఖ్యకలనఁ గాంచి
యున్ననీ జీవితంబున నోర్మి నెంచి
మ్రొక్కుదురటన్న నెందు నక్కఱము గలదె:

కొమ్మ సందులలోన రెమ్మలన్ దాచుచు
కాయలఁగని వాని గారవమున
బంగారురంగున పచ్చగా పండించి
చక్షురుత్సవములఁ జాటుఁజేసి
బిడ్డలారా! రండు; ప్రీతితోఁ గొనుడంచు
అందిచ్చుచుండెడు నమితప్రేమ
కొనుకొలేరొకొ! కూర్మి నాబిడ్డల
టంచు నెంచెదొ; అహో మించుగూర్మి

వంగియేయుందు పండ్లతో పొంగుమీర
మధురమధుర మకారసముల మరచి నిన్ను
హాయిగా త్రాగుచుందురు అమృతమూర్తి
తెలియగలరమ్మ వీరు నీదివ్య మహిమ:

తెగవేయన్గమ కించువానిఁగనియున్ తీవ్రంబుఁ జూపిం
ప వీవుగదా! సరిదానికేమి; మఱివానిన్గూడ నే మాత్రమున్
వగలన్ జెందఁగనీక నీడలను నాహ్వానించి పూపండ్లతో
తగవిందుల్ పచరింతువీవినతి కాత్మ నే మ్రొక్కెదన్ నమ్రమై:






కిరణ్ సాహస కృత్యాలు

* వి. కృష్ణమూర్తి *

[వెనుకటి సంచికలో—రత్నాల వ్యాపారియైన కిరణ్ అధిక ధనాన్ని ఆర్జించి ప్రపంచయాత్ర ప్రారంభిస్తాడు. స్నేహితుడు షాజ్ ఓడలో దొంగలుంటారు జాగ్రత్త యని హెచ్చరిస్తాడు. అరేబియన్ సీలో ఓడ ప్రయాణం సాగిస్తూంటే, స్నేహితుని మాటలు స్మరిస్తూ, భయపడ్తూనే ప్రయాణం చేశాడు. కొన్ని రోజులకు ఓడ ఏడన్ రేవును జేరింది. తరువాత———]

కిరణ్ కూడా దిగాడు. తను ఏడన్ లో ఏమేనా కొందామనుకొన్నాడు. కొంతడబ్బు తీసుకొని దిగాడు. తనకి కావలసినవన్నీ కొనుక్కొని ఓడలోకి వచ్చాడు. తాను కొన్న సామాన్లను పెట్టెలో పెట్టాలనుకొన్నాడు. పెట్టె తాళాన్ని తీయబోయాడు. ఆశ్చర్యం!



తాళం తీసివుంది! ఎవరు తీశారు? సందేహంగా పెట్టె తీశాడు. విపరీతం! తాను తెచ్చిన బట్టలు మాయమైనయ్! వెంటనే ఓడ అధికారికి యీ సంగతి తెలిపాడు.

"మీరు ఓడ దిగే ముందు జాగ్రత్తచేసి వెళ్ల కూడదూ? ఇప్పుడిలా అనకపోతే?" అన్నాడు ఓడ అధికారి.

"నేను చాలసార్లు ఓడలో ప్రయాణం చేశాను. ఎన్నో చోట్లలో దిగాను; ఒక్కసారీ యిల్లాగ జరగలేదే!" అన్నాడు కిరణ్.

ఓడ అధికారి తనచేతనైనంత ప్రయత్నాలు చేశాడు. కాని కిరణ్ బట్టలు దొరకలేదు.

"పోనీ! నాకున్న ధనంలో యీ వస్త్రాలు పోతే ఒక లెఖ్ఖా? ఇకమీదనైనా జాగ్రత్తగా వుంటా" ననుకొన్నాడు కిరణ్....

మళ్లీ ఓడ బయల్దేరింది. ఎఱ్ఱ సముద్రంమీద పోతూంది. చాల రోజులకి స్పెయిన్ చేరింది.

కిరణ్ ఎక్కడికి పోతున్నాడో చెప్పటానికి మఱచా. దక్షిణ అమెరికాకి పోతున్నాడు. అక్కణ్ణించి వరుసగా ప్రపంచ ప్రయాణం చేసు కొంటూ తన దేశాన్ని చేరాలనుకొన్నాడు.

తన బట్టలు దొంగతనం పోయాక కిరణ్ చాల జాగ్రత్తగా వున్నాడు. తన సామాన్లలో ముఖ్యమైన దాన్ని—డబ్బును—చాల మెలకు వతో చూస్తున్నాడు. ఎంతవరకు తన జేబుల్లో వుంచుకో వచ్చునో అంతవరకు తన జేబుల్లో వేసుకున్నాడు. తక్కిన ధనాన్ని ఎవ్వరి కండ్లా పడకుండా పెట్టాలి. ఎక్కడ పెట్టేది? ఆలో చించాడు: మంచి ఆలోచన తట్టింది. ఆ డబ్బు లుంచిన పెట్టెను గదిలో ఒక మూలలో వున్న లైఫ్ బోట్ (Life Boat) లో పెట్టేడు. తర్వాత దానిపైన తన పరుపుని పఱచాడు. రాత్రి దాని మీాదే పడుకొనేవాడు.

తాను తన దేశం విడిచి చాలరోజులు గడి చాయ్. ఓడ దక్షిణ అమెరికా—ఆఫ్రికాల మధ్య అట్లాంటిక్ సముద్రంలో పోతూంది.

ఒక రోజు రాత్రి కిరణ్ గాఢ నిద్రలో వున్నాడు. స్వప్న సామ్రాజ్యములో పచారు చేస్తున్నాడు. ఏవేవో కూతలు వినబడ్తున్నయ్. గాఢ నిద్రలోవున్న కిరణ్ కి నిద్రాభంగం కలగ లేదు.

కిరణ్ కి చలిగాలి తగిలింది. ఎప్పుడూ లేని చలికి కారణం ఏమో! పెట్టెలోంచి కంబళి తీయాలనుకున్నాడు. కన్ను తెఱచాడు—విప రీతం!! కిరణ్ "ఇదంతా కలకాదు కదా! మనం యెక్కడ వున్నాం!" అనుకొన్నాడు. ఏమంటే తాను నడి సముద్రంలో వున్నాడు. ఓడ యేదీ! చుట్టూ సముద్రం!! తాను Life Boat లో వున్నాడు. కిరణ్ కి బోధపడింది. ఓడ సముద్రంలో మునిగి పోయింది. తాను విన్న కూతలు ఓడలోనివాళ్లవి. తాను Life Boat లో పడుకున్నాడు. కాబట్టి తప్పించుకొన్నాడు. లేకుంటే ఈపాటికి సముద్రంలో మునిగేవాడే కదా! ఆ రోజు ఏడర్లో దొంగతనం జరక్క పోతే తన గతి అంతేగా! ఆ దొంగతనం తన మంచికే అయింది. "అంతయు మన మేలునకే" అన్న పెద్దల మాటలు వృథాగా పోతాయా?

"ఆహా! దేముడా! సముద్రంలో మునిగి చచ్చేవాడ్ని విచిత్రంగా బ్రతికించావు. ఇంకా ఎన్ని విచిత్రాలు చేస్తావో కదా!" అను కొన్నాడు అతను.

తెలతెల వారుతోంది. తానెక్కడ వున్నాడో కిరణ్ కి అంతా అయోమయంగా వుంది. ఎన్ని రోజులకైనా ఒక దీవి చేరుకుంటామను కొన్నాడు. కాని అన్ని రోజులవఱకు ఆహారం ఎల్లాగ? తిండిలేక 10 దినాలు వుండొచ్చు. ఆ 10 దినాల్లోనే ఒక దీవిని చేరితే బాగుండునని దేవుణ్ణి ప్రార్థించాడు. చచ్చేవాణ్ణి బ్రతికించిన దేవుడు తనకి ఆహారం యివ్వకపోతాడా అని ధైర్యం తెచ్చుకొన్నాడు.

నాలుగు రోజులు గడిచాయ్. దీవి చేరుకోనే ఆశ పీడిస్తోంది కిరణ్ ని. అలా ఆకాశం వేపు చూస్తూ ఏమో ఆలోచిస్తున్నాడు. పాపం ఓడలోని వాళ్లెందరు చచ్చారో కదా! అను కొన్నాడు. ఐదవ రోజు ఉదయం దూరంగా

ఒక చిన్న దీవి కనబడింది. కిరణ్ సంతోషించాడు. Life Boat తిన్నగా అక్కడికే పోతుందని నమ్మటానిక్కి లేదే! ఐనా చేరగలమని కిరణ్ నమ్మాడు.

కిరణ్‌కి ఐదు రోజులనుండి తిండి లేదు. కృశించి పోయాడు. దీవి చూడగనే సంతోషించాడు. "సంతోషం సగం బలం" అన్నారు మన పూర్వులు. అట్లే అతనికి సగంబలం వచ్చింది. లైఫ్‌బోట్ మెల్లగా ఆ దీవిని చేరింది. కిరణ్ "అమ్మయ్య! బతికా" మనుకొని తన పడవను ఆ దీవిలోకి లాగేడు తాను దిగి. కాస్తసేపటికి భూకంపంలాగ ఆ దీవి అదిరింది. కిరణ్ బెదిరాడు. అది దీవికాదు. ఒక పెద్ద చేప! తన దేహం మీద స్పర్శకలిగే సరికి కదిలింది. కాని కిరణ్‌కి ఏ అపాయం కల్గలేదు. ఆ చేప యీద సాగింది. పడవకన్న చాల రెట్లు వేగంగా పోతూంది. దాని వీపుమీద కిరణ్, తన పడవ (Life Boat) పోతున్నారు. అతను ఎంత సంతోషించాడో అంత దుఃఖించాడు.

కిరణ్‌కి ఒక మేలు కలిగింది. ఏమంటే ఇప్పుడు ముందటికన్నా వేగంగా పోతున్నాడు. తన బోట్‌లో చూచాడు. డబ్బు వుంది. ఆకలి వేస్తోంది. ఎంత డబ్బుండి యేం లాభం? తన ఆకలి తీరిందా? షాజ్ చెప్పినట్లు పంచభక్ష్య పరమాన్నాలు తింటూ హాయిగా బొంబేలోనే వుండిపోయివుంటే ఎంత బాగుణ్ణను కొన్నాడు. కాని యిల్లాగ ఔతుందని యెవరికి తెలుసు? ఇంకా ముందు ఏం జరుగుతుందో కూడా ఎవరికి తెలుసు?

అల్లాగ ఆ చేపమీద ప్రయాణం చేస్తున్నాడు. సాయంత్రం ఐంది. తిండిలేదు. నిద్రపోదామని తన బోట్‌లో పడుకున్నాడు. నీరసంగా వున్నమూలాన నిద్రపోయాడు.

చీకటి పడుతోంది. కిరణ్‌కి ఏవో మాటలు వినవచ్చె. కళ్లు తెఱచాడు. తానేదో దీవిలో వున్నాడు. చుట్టూ ఎవరో మనుష్యులున్నారు. ఒక మూలలో తాను వచ్చిన చేపవుంది. కిరణ్‌కి ఏమీ అర్థం కాలేదు. లేచి కూర్చున్నాడు. ఆ దీవిలో వున్నవాళ్లు తనకు ఆహారం ఇచ్చారు; తిన్నాడు. తనకళ్లను నాల్గు వైపులా ప్రసరింపజేసాడు. అందులో తనకి పరిచితమైన ముఖాలు రెండు కన్పడినయ్! వ్యాపారం చేసేప్పుడు వాళ్లతో పరిచయం ఐంది.



"మీరిక్కడి కెల్లాగ వచ్చారు?" అన్నాడు కిరణ్ ఆ పరిచితుల్ని చూచి.

"ఇప్పుడు నీవెల్లా వచ్చావో మేం కూడా అల్లాగే—అదుగో (ఆ చేపనిచూచి) ఆ చేప మీదనే వచ్చాం." అన్నారు వాళ్లు.

"ఆ చేప విచిత్రంగా వుందే!"

(ఇంకా వుంది)

★

చిట్టి తల్లి

* పీలా మల్లేశ్వర్ *

అందుకోన రావేమి అందాల తల్లి
అందొస్తె నీ యంద మెవరు తీయాలి ?
పరుగు పరుగున రావె మా పాలవెల్లి
పాలు పండ్లును దెత్తునే పట్నమెళ్ళి
చెంగు చెంగున గెంతు చిట్టి నా తల్లి
చిరునవ్వు చూపవె చిన్న నా రాణి
బాలచంద్రుని మోము బాల మా పాప
బంగారు బంతులు బాబు తెచ్చాడు.
నయగారములు వెలుగ, నయనాల తల్లి
జడలోకి దెచ్చెదను నే జాజిమల్లి.
పరువెత్తబోకు ; నే పాముజడలల్లి
విరులెల్ల తురిమెదను రా పుష్పవల్లి,
ముద్దు చేతులు ఊపు ముత్యాలచుక్క
పట్టుబట్టలు దెచ్చె పెద్ద మీ యక్క.
చిలుక పలుకులు నుడివె చిలుకమ్మ లెల్ల
నీ బోసి మోము కడవాడ వలసిందే!
చెంగు చెంగున రాగ సిగ్గేమి తల్లి ?
పెళ్ళికొడుకుని దెచ్చి నే జేతు పెళ్ళి.
ముంజేతు లందీయమురిపె మా తల్లి !
చిరు చేతులెత్తవే చిట్టి నా తల్లి.

★

నవ్వులు—పువ్వులు

మేష్టరు : ఏమిరా అబ్బాయ్! శేరు శనగలు నానేస్తే రెండు శేర్లవుతాయి. కుంచెడు నానేస్తే రెండు కుంచాలవుతాయి. అయితే 50 గింజలు నానేస్తే ఎన్నవుతాయ్!

కుర్రాడు : వందవుతాయండి.

*   *   *

మేష్టరు : ఈ లెక్క ఎలాచేస్తావురా ? నువ్వే !

కుర్రాడు : తెలీదండి.

మే : అయితే తెల్సుకోవాలి !

కు : తెలిస్తేకదా !

మే : మొన్న పరీక్షలో 60 మార్కులొచ్చాయ్. ఏ వెధవదగ్గర కాపీకొట్టేవురా వెధవా ?

కు : మీ కుర్రాడిదగ్గరేనండీ !

★

ఉద్బోధ

* శ్రీ యస్. టి. సుదర్శనాచార్య *

రారమ్మ ! రారమ్మ ! లేచిరారో
సకలైక ముస్లిం హిందూమ తల్లులారా ! ॥రా॥
రారమ్మ లేచిరారో
రారమ్మ మంగళమ్మీయరారో
మన భారతికి నిత్య శుభమంగళ మీయరారో॥రా॥
మన భారతీవధువు స్వాతంత్ర్యవరుని కోరే !
మన భారతీవధువు స్వాతంత్ర్యవరుని చేరే ॥రా॥
స్వాతంత్ర్య సమరాన సమసిపోయిన సుమాల
మనవధువు జడగుప్పరే
మనశౌర్యమేయొప్పగా ! ॥రా॥
ఆశలో జనియించి, ఆశలో ప్రభవించి
ఆశలోనే నాశమా మన వీరనారుల
ఆశీస్సులే హారతీ ! మనభారతికి నిత్య
శుభహారతీ ॥రా॥

★

ఆంధ్ర మహిళా సభలో

దసరా వుత్సవములు

అక్టోబరు 8, 9, 10 తేదీలలో ఆంధ్ర మహిళా సభలో, దుర్గాష్టమి, మహానవమి, విజయ దశమి పండుగలు యథాప్రకారంగా, దేవీపూజ, బొమ్మల కొలువు, పేరంటములు, వినోద కాలక్షేపములతో జరిగిపోయినవి. ఆటలు, పాటలు, వివిధ భాషలలో వక్తృత్వము, నాటకములలో పోటీలు జరిగినవి. గెల్పొందిన వారికి విజయ దశమినాడు పెదపవని జమీన్‌దారిణిగారు ఆంధ్ర మహిళా సభ తరపున బహుమానములను పంచిరి.

వక్తృత్వ పోటీలు

1-10-51 సోమవారం మధ్యాహ్నం 2 గం॥ నుండి ఇంగ్లీషులో ఈ క్రింది విషయములపై వక్తృత్వ పోటీలు జరిగినవి.

విషయములు :	సీనియర్ శాఖ	పరీక్షాధి పతులు :
సీనియర్ శాఖకు 1. హిందూ దేశములో ఆహార సమస్య. 2. నీవు శాసన సభలో రానున్న ఎన్నికలలో సభ్యురాలుగా నిలబడిన నీ వోటు దారునికి ఏ విధముగా చెప్పెదవు. 3. చలన చిత్రములు మన జీవితములను ఏ విధముగా మార్చెను. 4. హిందూ దేశమునకు సామాన్య భాష. 5. గాంధీజీ బోధనలు.	ప్రథమ బహుమతి సుమంగళీ చెట్టియార్ ద్వితీయ బహుమతి యస్. పద్మావతి	శ్రీమతి ఎస్. కమలగారు. శ్రీమతి కమలా జీవనాథంగారు. శ్రీ శంకర్ నారాయణగారు.

దసరా వుత్సవములు

విషయము :	జూనియర్ శాఖ	పరీక్షాధి పతులు :
జూనియర్ శాఖకు ఏదో ఒక పద్య భాగమును భావ యుక్తంగా తప్పులు లేకుండా కంఠత చెప్పుట.	ప్రథమ బహుమతి ఎన్. భానుమతి ద్వితీయ బహుమతి జి. శకుంతల ప్రత్యేక బహుమతి జయశ్రీ	శ్రీమతి ఎస్. కమలగారు. శ్రీమతి కమలా జీవనాథంగారు. శ్రీ శంకర్ నారాయణగారు.

3-10-51 తేది బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు హిందీలోను, తమిళంలోను, ఈ క్రింది విషయములపై వక్తృత్వ పోటీలు జరిగినవి.

విషయములు :	హిందీ	
సీనియర్ శాఖ 1. స్త్రీలపై పాశ్చాత్య నాగరికత యొక్క ప్రభావం. 2. ఆభరణములవలన కలిగే లాభ నష్టములు. 3. మనో వినోదాలు — ఉత్తమ సాధనలు. 4. హిందూదేశంలో ఆహారసమస్య. 5. సంఘసేవ—స్త్రీల యొక్క కర్తవ్యము.	సీనియరు శాఖ ప్రథమ బహుమానం కే. నిర్మల ద్వితీయ బహుమానం యస్. నిర్మల	పరీక్షాధిపతులు : శ్రీమతి నూతలపాటి శారదాదేవిగారు. శ్రీమతి ఆర్. శకుంతలగారు. శ్రీ జనార్ధ శర్మగారు.
జూనియర్ శాఖ ఒక వచనము ఇచ్చి దానిని భావ యుక్తముగా కంఠత చెప్పుట.	జూనియర్ శాఖ ప్రథమ బహుమతి ఎ. రాజేశ్వరి ద్వితీయ బహుమతి కుసుమ పటేల్	

దసరా వుత్సవములు

తమిళం

విషయములు :		పరీక్షాధిపతులు :
సీనియర్ శాఖ	**సీనియర్ శాఖ**	
1. స్త్రీలయొక్క ఘనత	ప్రథమ బహుమానం బి. సరస్వతి	శ్రీమతి కమలా జీవనాథంగారు.
2. స్త్రీలు రానున్న ఎన్నికలలో పోటీ చేయుదురా ?	ద్వితీయ బహుమానం యస్. పద్మావతి	శ్రీ శంకర్ నారాయణగారు.
3. గాంధీజీ బోధనలు.		శ్రీ కె.వి. రాజగోపాల అయ్యర్.
4. చలన చిత్రములు ఏ విధంగా మంచికై ఉపయోగింపబడును.		శ్రీ మురుగ విశాఖనంబిగారు.
5. ఆహార సమస్యను ఏ విధంగా తీర్చెదరు.		
జూనియర్ శాఖ	**జూనియర్ శాఖ**	
విషయము : ఒక వచనభాగమును భావయుక్తముగ, కంఠత చెప్పుట.	ప్రథమ బహుమానం సుందరవల్లి	
	ద్వితీయ బహుమానం వి. ఆర్. కాంతి	

5-10-51 తేది తెలుగులో వక్తృత్వ పోటీలు జరిగినవి.

విషయములు :		పరీక్షాధి పతులు :
సీనియర్ శాఖ	**సీనియర్ శాఖ**	
1. భాషా ప్రయుక్త రాష్ట్ర విభజనము సంకుచిత దృష్టికి దారి తీయునా ?	ప్రథమ బహుమానం టి. శారద	శ్రీమతి వారణాసి యశోదగారు.
2. హిందూ ధర్మశాస్త్ర క్రోడీకరణ బిల్లువలన హైందవ కుటుంబ వ్యవస్థ తారుమారగునా ?	ద్వితీయ బహుమానం బి. సత్యవతి	శ్రీమతి కామరాజు మైత్రేయిగారు.
3. లలిత కళలలో కవిత్వమునకు గల స్థానము.		శ్రీ కె. సుందరరామశాస్త్రిగారు.

దసరా పుత్సవములు

విషయము :

జూనియర్ శాఖ

1. అహింసా సిద్ధాంతములు దైనందిన జీవితములో నెంతవరకు నాచరణీయములు.
2. కుటీర పరిశ్రమలా? యంత్రములా? దేశోన్నతిని పెంపొందించునవి?
3. సమ్మెలు సమర్థింప వచ్చునా?
4. విద్యార్థులు రాజకీయములలో పాల్గొనవచ్చునా?
5. కవియా? దేశభక్తుడా? ఎవరెక్కువ దేశమునకు మేలు చేయుదురు?

జూనియర్ శాఖ

వచనం కంఠత వప్పచెప్పుట.

జూనియర్ శాఖ

ప్రథమ బహుమానం

కె. రాజ్యలక్ష్మి

ద్వితీయ బహుమానం

ఎ. లక్ష్మీకామేశ్వరి

జూనియర్ శాఖ

ప్రథమ బహుమానం

కె. ప్రమీల

ద్వితీయ బహుమానం

వి. రామమ్మ

పరీక్షాధి పతులు :

శ్రీమతి వారణాసి యశోద గారు.

శ్రీమతి కామరాజు మైత్రేయిగారు.

శ్రీ కె. సుందర రామశాస్త్రిగారు

సంగీతములో పోటీలు

4—10—1951

సీనియర్ శాఖ

వీణ వాయిద్యము

సీనియర్ శాఖ

ప్రథమ బహుమానం

మీనాక్షీ సుందరం

ద్వితీయ బహుమానం

జి. శకుంతల

ప్రత్యేక బహుమానం

యం. శ్రీనివాసమ్మ

(తరువాయి 53-వ పేజీలో)

పరీక్షాధి పతులు :

శ్రీమతి కె. భానుమతి అమ్మగారు.

శ్రీమతి వి. లీలావతిగారు.

శ్రీమతి ఎ. సరస్వతిగారు.

కథ అడ్డం తిరిగింది

(24-వ పేజీ తరువాయి)

పిన్ని యిచ్చిన డబ్బులు కూడబెడితే వచ్చిన పది రూపాయిలు—తనవద్ద నున్న ఆస్థి.

చేతిలో నున్న పది రూపాయిల ఆస్థితోటి ముక్తేశ్వరంలో నున్న మేనత్త గారింటికి బస్సెక్కాడు తాను. ఇదివరకు మేనత్త గారింటినుండి నాన్న తనను తీసుకు వచ్చే సరికి తనకు 5 సంవత్సరాలుంటాయి. ఆ తరువాత తన మేనత్త రెండు మూడుసార్లు వచ్చి 'అబ్బాయిని చూడాలని వచ్చాను' అని పెంచిన ప్రేమ కనబర్చేది. ఆమె వచ్చినప్పుడల్లా తన చేతిలో ఒకటి రెండు రూపాయిలు పెట్టి వెళుతూండేది. కాని 4 సం|| క్రితం ఆమె భర్త చని పోయాడు. అప్పటినుండీ ఆమె గ్రామం విడిచి ఎక్కడికీ వెళ్లలేదు. ఆమె భర్త చని పోయినప్పుడు మాత్రం తన తండ్రి అక్కగారిని పరామర్శించడానికి వెళ్లి రెండు దినాలుండి వచ్చేశాడు.

ముక్తేశ్వరం చేరాక కనిపించిన వారందరినీ తన మేనత్త గారిల్లెక్కడని అడిగాడు. చివరకి మట్టి గోడలతో నున్న ఒక చిన్న తాటాకుల యిల్లు చూపిస్తూ 'అదేనండి రాధమ్మ గారిల్లు' అని చూపాడొక రైతు. తిన్నగా లోపలికి వెళ్లేసరికి పదేళ్లమ్మాయి ఎదురుగా వచ్చింది. తనను చూడగానే లోపలికి పరుగెత్తి అమ్మా 'ఎవరో వచ్చారే' అంటూపోయి రాధమ్మతో చెప్పింది. వంటింట్లోంచి ఇవతలికి వస్తూనే రాధమ్మ తనను చూచి ఒక్కసారి ఆశ్చర్యంగా 'ఎన్నాళ్లకు కనిపించావు నాయనా! అందరూ క్షేమమేనా? అమ్మాయి! బావకు చెంబుతో మంచినీళ్లు తెచ్చియ్యమ్మా' అని మణికి పురమాయించింది.

కాళ్లు కడుగుకొనే లోపల రాధమ్మ తన కూపిరి సలుప నీయకుండా లక్ష కుశల ప్రశ్నలు కురిపించి 'పెట్టయినా పట్టుకు రాలేదు—ప్రయాణ మరచేత పెట్టుకునా వచ్చేవు? పది రోజులుండ కుండానే వెళ్లిపోతావా?' అన్నది. ఆప్రశ్నకు తాను సరియైన జవాబు చెప్పనే లేదు.

క్రమంగా ఎలాగైతే నేం? తనను ప్రశ్న మీద ప్రశ్న వేసి తాను యింట్లో నుండి పారిపోయివచ్చిన సంగతి తెలుసు కుంది.

'చెప్పకుండా వచ్చేశావా బాబూ—ఇంట్లో అమ్మా నాన్నా వెతుక్కోరూ!' అని కాస్త నెమ్మదిగా మందలించింది.

ఆ మరుదినమే తనతో చెప్పకుండానే "అబ్బాయి! యిక్కడకు వచ్చాడు. దిగులుపడవద్దు" అని పోస్టుకార్డు వ్రాసి పడేయించింది తన అన్నగార్కి. అయితే ఆమె తన అన్నగారు వచ్చి కొడుకును తీసుకు వెళతాడనుకుంది. కాని అలా జరగలేదు. తాను మేనత్త గారింటికి వచ్చిన ఆరు మాసములకు మాత్రం నాన్నవచ్చి ఒక్కసారి చూచి వెళ్లాడు. అప్పుడు తనను 'ఏంరా బాగున్నావా!' అని మాత్రమే అన్నాడు."

ఒక పెద్ద కెరటం కాళ్లవరకు వచ్చి పంచెను తడిపింది. దాసు గబుక్కున లేచి తడిసిన పంచె అంచులను పిండుతూ కొంచెం వెనక్కి జరిగి కూర్చుని మళ్లీ సిగరెట్టు వెలిగించాడు......

'తన జీవితంలోని రెండవ అంకం త్వరగానే ముగిసి పోయింది. తాను మేనత్త గారింట్లో రెండు సంవత్సరాలు మాత్రమే ఉన్నాడు. ఆ ఉన్న రెండు సంవత్సరాలు మాత్రం బాగానే వినియోగించుకున్నా ననుకున్నాడు. గోదావరి ఒడ్డుకి పొలాల్లోకిపోయి ప్రకృతిని చిత్రిస్తూండటం అతని నిత్యకృత్యం తాను వేసిన బొమ్మలలో కొద్ది తప్పులున్నా అప్పటికీ ఎందరో మెచ్చు కొనేటట్లు వేశేవాడు తాను. అతడు వెళ్లిన కొన్నాళ్లకు మాత్రం "చదువు సంధ్యలు లేకపోతే ఈ కాలంలో కడుపు గడవటం ఎలాగ నాయనా? అందులో మగపిల్లవాడి వాయెను" అని రాధమ్మ ఒకటి రెండు సార్లతనిని మందలించింది. కాని దాని కతడేమీ జవాబు చెప్పలేదు. ఆ తరువాత ఇక ఆమె ఆ ఊసే ఎత్తలేదు.

నిజానికి తన మేనత్తది కూడా చితికిపోయిన సంసారం. ఆమె భర్త చనిపోయే టప్పటికి ఆమెకు మిగిలినదా పూరి కొంప, నాలుగు ఎకరముల మాగాణి మాత్రమే. ఆ స్వల్ప ఆస్థితో ఆమె తవ కూతురిని పెంచుకోవడమే కష్టంగా జరుగుతూంది. అందుచేత తాను అచ్చటికి వెళ్లడం కూడా ఆమెకు బరువే. ఈ సంగతిని గ్రహించేకే అతడు అచ్చటి

నుండి వచ్చేయడం జరిగింది. రోజులెంత గడ్డుగా గడుస్తున్నా రాధమ్మ తనకయేఖర్చు కెన్నడు విసుగుకోనైనా లేదు. తాను బయలు దేరేముందు 'నేను వెళ్లి పోతాను' అని చెప్పినప్పుడు 'మీయింటికా నాయనా?' అన్నదామె— "కాదు ఎక్కడి కయినా పోయి నాబ్రతుకు నేను బ్రతుకుతాను" అన్నాడు.

"అలా బ్రతక గల్గితే సంతోషమే. కాని నాకున్న దాంట్లో ఇంత పెట్టటానికేమీ అభ్యంతరం లేదు. మధ్యలో మీ నాన్న వచ్చి తీసుకు వెళ్లబట్టి కాని లేకపోతే పుట్టిన నాటినుండి యిక్కడ పెరగవలసిన వాడవేగా" అన్నదామె. కాని నేను వెళ్లిపోతానంటే ఎక్కువ అభ్యంతర మేమీ పెట్టలేదు.

నీటి మీద నుండి గాలి విసురుగా కొడ్తూంది. గాలికి రేగిన ఇసుక మీద పడింది, కళ్లల్లో కూడా పడింది. దాసు మళ్లీ ఈ ప్రపంచంలో కొచ్చేడు. రెండవ ఆట సినిమా యింకా ఆడుతూనే ఉంది. ఒక రిద్దరు రిక్షా బండివాళ్లు కాళీ బండ్ల నీడ్చుకుంటూ బీచిరోడ్డంట పోతున్నారు. దాసు చేతిలో ఉన్న సిగరెట్టు అతనికి తెలియకుండానే ఆరిపోయింది. మళ్లీ అతడు మామూలు ఆలోచనలో పడ్డాడు. తన జీవితంలోని 3వ అంకం ఎలా ప్రారంభ మయిందీ నెమరువేయ సాగాడు.

మేనత్త గారింటినుండి తాను తిన్నగా విశాఖపట్టణమే వచ్చాడు. వస్తూనే సత్రంలో బసచేశాడు. వచ్చిన రెండు మూడు దినాలకే ఆ ఊళ్లో 'ప్రణయిని' అనే క్రొత్త పక్ష పత్రిక ప్రచురిస్తున్నారనీ దానికి ముఖచిత్రం తదితర చిత్రాలు వ్రాసియివ్వగల చిత్రకారుని కొరకు చూస్తున్నారనీ విన్నాడు. 'ఇంకేం' తనకు కావలసినదే అది. తన చిత్రకళకు కాస్త ఆదరణ చూపించి తన పొట్టగడచిపోయే మార్గం చూపిస్తే అంతకన్న తనకు గావలసినదేమీ లేదు. హాయిగా చిత్రాలు గీసుకుంటూ కాలంగడిపేయ గలడు. వెంటనే ప్రణయిని సంపాదకునకు తాను అదివరకు వేసిన చిత్రాలన్నీ చూపించి తాము కాస్త చేయూతనిస్తే ఇంకా అభివృద్ధి చేసికొన గలనని చెప్పాడు. పత్రికలో కావలసిన అన్ని బొమ్మలూ తాను చిత్రించి యివ్వడానికి వారు తనకి నెలకేబది రూపాయిలు యిచ్చుటకు నిర్ణయమైనది. మొదటి రెండు సంవత్సరాలు సత్రంలోనే కాలక్షేపం చేశాడు. ఆ రెండు సంవత్సరాలలో తాను సేకరించిన ధనంతో కలకత్తా వెళ్లి సంవత్సరం పాటు శాస్త్రోక్తంగా చిత్రకళ నభ్యసించాడు. తరువాత తిరిగి విశాఖపట్టణమే వచ్చేశాడు. ఆ తరువాతే మహారాణీ పేటలో ఇల్లు అద్దెకు తీసుకొనడం జరిగింది. మరికొంత కాలానికి ఎదురింటిలో రూము తీసికొని ఉంటున్న కాలేజీ స్టూడెంటు విశ్వంతో పరిచయం కల్గడం జరిగింది. అప్పటికి దాసు తన పూర్వ జీవితంలోనుండి ప్రస్తుతం లోనికి రాగలిగేడు. సినిమా రెండవ ఆట విడిచిపెట్టేరు. జనం గొల్లుమంటూ బయటికి వస్తున్నారు. దాసుకూడా 'ఊ 12 అయింది కాబోలు' అనుకుంటూ లేచి యింటి ముఖం పట్టాడు.

త్రోవలో అతడు మళ్లీ ఒక్కసారి తన వెనకటి జీవితం లోకి వెళ్లాడు. తాను మేనత్తగారింట్లోఉన్నప్పటికి మణి చాలా చిన్నపిల్ల. చక్కని ఉంగరాల జుట్టు—పచ్చని దేహచ్ఛాయతో తీర్చి దిద్దినట్లున్న ముఖ లక్షణాలతో ఆ చిన్న మణి తనను 'బావా' అని ముద్దుగా పిలవడం అతనికి గుర్తుంది. చదువు సంధ్యలు లేక పోయినా మణి చాలా చురుకైన పిల్ల. తనంటే ఎంతో అభిమానంగా ఉండేది. తాను డ్రాయింగు పుస్తకం రంగులపెట్టె పట్టుకొని ఎక్కడకో పొలాలంట పోయి ప్రొద్దు పోయిన దాకా తిరిగి రాకపోతే వీధరుగు మీద కూర్చుని తన రాక కొరకు ఎదురు చూస్తుండేది. తాను యింట్లోకి వెళ్లగానే 'యింత సేపు బొమ్మలే వేస్తున్నావా? బావా! చీకటిలో నీకెలా కనిపిస్తుంది,' అనేది అమాయకంగా.

ఇంతకీ మణి తనకిప్పుడెందు కలా వ్రాసింది? నిజంగా తన మేనత్తకు తనను చూడాలని ఉందా. 'ఇబ్బందిగా ఉన్నది' అని వ్రాసింది—బహుశ డబ్బుకై ఉంటుంది. ఆమె తన కొరకు ఎంతో ఖర్చు చేసింది. ఇప్పుడు తన నుండి ఏమైనా సహాయం ఆశించి ఉంటుంది. ఏదో కొంత డబ్బు పంపిస్తే సరి. తాను వెళ్లడం అనవసరం, అనుకుంటూ యిల్లు చేరాడు దాసు.

(ఇంకా వుంది.)

★

గేయ కవిత్వానికి సమాదరణ

* శ్రీ వసంతరావు రామకృష్ణరావు *

శాస్త్ర పరిజ్ఞానం, సాహిత్య విజ్ఞానం—ఈ రెండూ సాంఘిక జీవనంలో అధికతరమైన ప్రభావాన్ని ప్రదర్శించే రెండు బలవత్తరమైన విభిన్నశక్తులు. ప్రకృతి తత్త్వపరిశోధనాసక్తి ఫలితంగా పరిణామాలు వచ్చాయి. సంఘంలో శాస్త్రజ్ఞానం, విమర్శనాసక్తి, వృద్ధి చెందుతున్నాయి. వీటిఫలితంగా భావనా ప్రాధాన్యమైన కవిత్వానికి శక్తి సన్నగిలి పోతూంది. ఈ విషయం నిరూపించడానికి పాశ్చాత్య దేశాలలో సారస్వతముపై అధికారమును స్థిరపర్చుకొనిన శాస్త్రవిజ్ఞాన ప్రభావమే ప్రబల నిదర్శనము.

మనోమోహనమైన దివ్యానుభూతికి స్థానమైన కావ్య ప్రపంచంలో, భావనావ్యాపారముకన్న మేధోవ్యాపారముతో గూడిన శాస్త్రపరీక్ష అభివృద్ధి కావడంవల్ల, కవిత్వోద్యమానికి ప్రతీకారచర్య కలిగింది.

ఈ ప్రతీకారచర్య ఫలితంగా పాశ్చాత్య దేశాలైన, ఫ్రాన్సు, జర్మనీ, అయిర్లాండులలో ఒక నూతనమైన కవిత్వ తత్త్వము అవతరించింది. ఈ నూతన కవిత్వము అంతకు పూర్వమునుండి సాంప్రదాయముగా వచ్చుచున్న కవిసమయములను పాటింపక, యేదోయొక అగాధమైన, అనంతమైన సూక్ష్మప్రకృతినిగూర్చి, అందు నిబిడీకృతమై యున్న అనిర్వచనీయమైన సత్యమును, సౌందర్యమును, సాంకేతికముగా వెల్లడించుటచే ఈ తరగతికవులను సాంకేతిక కవులని ప్రజలు వ్యవహరింపసాగిరి.

పాశ్చాత్య కవిత్వోద్యమములలో సాంకేతిక కవులు నిర్వహించిన పాత్ర చాల ప్రధానమైనది. ఈ కవులు తమ కవితా తత్త్వములో, అగాధమైన ఊహాతీతమైన ఆధ్యాత్మిక విషయాలను ప్రదర్శించుచు సాంకేతికమైన జీవితమందలి సౌందర్య రసభరిత విషయాలను, సత్యాలను, సంకీర్తనము చేయుటచే, ప్రజలు వీరిని మర్మకవులని పిలువసాగిరి.

ఆంగ్ల కవితా సాంప్రదాయానికి చెందిన జేమ్సు. హాచ్. కజిన్సు, ఈట్సు, సిమన్సు మున్నగువారు మర్మకవులు—యూరపు ఖండమందలి దేశాలలోని సాంఘిక చైతన్యమునకు, మర్మకవులు కొనసాగించిన మర్మ కవితా సాంప్రదాయముతే కారణమనుటలో అతిశయోక్తిలేదు.

మర్మ కవిత్వము గేయరూపంలో (Lyric), గానప్రాధాన్యంతో కూడికొని ఉంటుంది. మర్మకవులు భావమునూ, భావాలకూ సమానమైన ప్రాముఖ్యమిచ్చి, గానాన్వితముగా ఈ గేయాలను రచించారు. పాశ్చాత్య సారస్వత క్షేత్రంలో మొదటిలో గేయ కవిత్వానికి తగిన సమాదరణ లభించలేదు. కాని, కాలక్రమములో గేయాల ప్రతిభ ప్రజలను ఆకర్షించింది.

సమకాలీనమైన పరిస్థితులను దాటి భావనాశక్తి మూలంగా, అనంత సౌందర్యాన్ని సందర్శించి, తన ఆత్మానుభూతిని, సంకీర్తనము చేసికొని, మర్మకవులు అవ్యక్తమైన ఆనందాన్ని రచనలలో ప్రసరింపచేసారు.

ఆంధ్ర సారస్వతానికి, ఆంగ్ల సారస్వతంతో సంబంధం, సన్నిహితత్వం ఉన్నాయి. భారతీయ నాగరికతలో, ఆంగ్లనాగరికత కలిసినట్లే, ఆంధ్ర సారస్వతంలో ఆంగ్ల సారస్వతప్రభావం గోచరిస్తుంది. ఈ విషయం నిరూపించడానికి అనేక కావ్యాలను నిదర్శనముగా చూపించవచ్చును. అయితే ఒక విషయం ఏమిటంటే, ఆంగ్లభాషాప్రభావం ప్రత్యక్షంగా ఆంధ్ర సారస్వతంలో ప్రతిఫలించలేదు. కాని, గేయకవిత్వమునకు సంబంధించినంతవరకు, ఆంగ్లభాషా ప్రభావం అనివార్యమైనదన్న విషయం అందరూ అంగీకరిస్తారు.

ఆంధ్రులకు గేయరచనా విధానం ప్రాచీనమైనదే—వేదములు ఉదాత్తానుదాత్తాది స్వరాలతో చదువునపుడు శ్రుతిహితంగా ఉండి, గేయరూపాన్ని ప్రదర్శిస్తున్నాయి. అంటే, గేయరూపం కవిత్వావతరణమైన నాటినుండి, నేటివరకు ప్రచారంలో ఉన్న విషయం ప్రత్యక్షంగా గోచరిస్తూంది.

కాని గేయ ప్రతిభ అనేక రూపాలలో పరిణామం చెందినది. గేయాల ప్రతిభ అనాగరక జాతులలో విలక్షణమైనస్థానం అందుకొనినట్లు మనకు కనిపిస్తుంది. గ్రామ్య

సారస్వతంలో, గేయాలకుగల ప్రచారం, గ్రామ్యజీవన రంగంలో ప్రత్యక్షంగా మనకు కనిపిస్తుంది. నేడు వెలువడు తూన్న గేయాలలో, రచనాపద్ధతులలోను, ఆదర్శాలలోను, భావాలలోను, కవితా సాంప్రదాయాలలోను అనేకమైన మార్పులు కనిపిస్తున్నాయి.

నేటి మన గేయ కవిత్వానికి మూలపురుషుడు రవీంద్రుడు—ఆంధ్ర సారస్వతం, బెంగాలీ సారస్వత పుష్పంలోని పరిమళాన్ని ఆస్వాదించి, తానుకూడ పరిమళాన్ని ఆపాదించుకొంది.

రవీంద్రుడు బాల్యంలో ఇంగ్లీషు కావ్యాలు విశేషంగా చదివేడు—ఆంగ్లకవులు కీట్సు, షెల్లీ, బ్రౌనింగులు వ్రాసిన కవిత్వాన్ని అవగాహన చేసికొన్నాడు. సౌందర్యాన్ని, మూర్తీభవింపచేసి, ఆ రూపాన్ని పోషించిన కీట్సు కవిత్వంలోని లయారూపకమైన రామణీయకత, రవీంద్రునికి మనోమోహనమైన దివ్యానుభూతిని ప్రసాదించింది. షెల్లీ గీతాలలో ఆధ్యాత్మిక ప్రభావంకూడా అతనినాకర్షించింది. వీరి రచనలతోపాటు, కాళిదాసు కవిత్వాన్ని కూడా రవీంద్రుడు అస్వాదించాడు. రవీంద్రుడు ఒక గొప్ప కళా తపస్వి—బ్రహ్మ సమాజమునకు చెందినవాడు. తన ప్రతిభా వ్యక్తిత్వ ఫలితంగా, బెంగాలీ గీతాలు వ్రాసి, బెంగాలు సారస్వతంలో సంచలనం కలిగించాడు.

ప్రాచ్యపాశ్చాత్యమనస్తత్వాలకు సంధిస్థానమైన బెంగాలు గీతాలు తొలుత ప్రజలలో ఆందోళన కలిగించాయి. కాని ఆంధ్రదేశమందలి యువకవులు కొందరు పురాతన సంప్రదాయాలను విడిచిపెట్టి రవీంద్రుని కవితా తత్వాన్ని ఆదర్శంగా తీసికొని, నూతనంగా గేయరచనా కార్యక్రమాన్ని అవలంబించి, తమ రచనావిధానాలలో కొత్త త్రోవలు చూపేరు.

అప్పుడు వెలువడ్డ గేయాలలో జీవగానం ప్రతిధ్వనించింది. నవ్యత తాండవించింది. కవితా తత్వం ప్రగమన దృక్పథాన్ని సూచించింది. యువకవుల రచనా వ్యాపారం ప్రచారమై సాంఘిక జీవనంలో నూతన సంచలనం కలిగించింది.

గేయకవిత్వానికి తగిన సమాదరణ నేడు విశేషంగా లభిస్తూంది. మాత్రాఛందస్సులో వింతగమనం కొందరు చూపించారు. గేయ కవిత్వంలో భావనేంద్రజాలం కళా కౌశలంతో కూడుకొని ఉంది. కళ, కళకోసమే కాదు. కళ మానవులకోసం అనే విషయాన్ని బహిరంగంగా ప్రచారం చేస్తూ పలువురు గేయాలు రచించి గేయ రచనా పద్ధతిలో కృతహస్తులయ్యారు. నండూరివారి యెంకిపాటలు జన సామాన్యంలో ఏ విధంగా ప్రచారమైనదో అందరూ ఎఱిగినదే. నిర్దుష్టమైన కళాదృక్పథంతోకూడిన గేయరచనా విఖ్యాతికి తగిన సమాదరణ లభింపజేయటానికి అందరూ కృషిచేయాలి.

యువకులు నేటి గేయకవిత్వంలో మెఱుగులు, మెఱుపులు చూపుతున్నారు. కాని, కొన్ని సందర్భాలలో అనవసర పదాడంబరత్వం, అసందర్భమైన ఆక్రోశం, అసహజమైన ఆవేశం గోచరిస్తున్నాయి. ఈ విధమైన కవితా సాంప్రదాయం, కొంతవరకు అనివార్యమైన హృదయోద్వేగంగా భావించినప్పటికీ, శ్రుతిమీరిపోయిన కారణం వల్ల ఆకర్షణాశక్తి కోలుపోతున్నదనే విషయాన్ని గ్రహించాలి.

నేటి పత్రికా ప్రపంచంలో నవ్య పద్ధతులను చూపించి, గేయ రచనా కార్యక్రమాన్ని కొనసాగిస్తూన్న యువకవులకు, ప్రోత్సాహమూ, సమాదరణా, లభించేట్లు, ఆంధ్రులు తగిన పరిస్థితులను కల్పించవలసివుంది.

★

అక్టోబరు 2వ తేదీని, గాంధీ జయింత్యుత్సవ సందర్భములో, మైలాపూరు ఎకడమీ వారిచే, మణీ ట్యూటోరియల్ కాలేజీలో జరిపింపబడిన నూలు వడకు పోటీలో, ఆంధ్ర మహిళా సభ పారిశ్రామిక విద్యాలయపు విద్యార్థిని నాగలక్ష్మి ద్వితీయ బహుమానమును బడసినది.

దసరా వుత్సవములు

(48-వ పేజీ తరువాయి)

కర్ణాటక గాత్రము

జూనియర్ శాఖ

ప్రథమ బహుమానం

పి. రాజేశ్వరి

ద్వితీయ బహుమానం

జి. శకుంతల

ప్రత్యేక బహుమానం

శ్రీలత

పరీక్షాధిపతులు :

శ్రీమతి కె. భానుమతి అమ్మగారు

శ్రీమతి వి. లీలావతిగారు

శ్రీమతి ఎ. సరస్వతిగారు

చేతి పరిశ్రమలలో పోటీలు

2-10-51 తేది మంగళవారం నూలు వడకుట

నూలు వడకుట

సీనియర్ శాఖ

ప్రథమ బహుమానం

బి. మీనాక్షి

ద్వితీయ బహుమానం

కౌసల్య

పరీక్షాధిపతులు :

శ్రీ ఎస్. వి. గోవిందయ్యగారు

నేత పని

పని

సీనియర్ శాఖ

15 ని॥ కాలపరిమితిలో చిన్న తువాలును నేయవలెను.

సీనియర్ శాఖ

ప్రథమ బహుమానం

అస్తతాలాంబిక

పరీక్షాధిపతులు :

శ్రీ ఎస్. వి. గోవిందయ్యగారు

జూనియర్

నవారును 10 ని॥ కాలపరిమితిలో నేయవలెను.

జూనియర్ శాఖ

ప్రథమ బహుమానం

బి. సత్యనారాయణమ్మ

పరీక్షాధిపతులు :

శ్రీ ఎస్. వి. గోవిందయ్యగారు

దసరా వుత్సవములు

4-10-51 తేది దుస్తులు కత్తిరింపులు, కుట్టుపని

సీనియర్ శాఖ

ఒక జాకట్టును 3 గంటలలో కొలతల ప్రకారం కత్తిరించి, డ్రాఫ్టు చేసి, మిషను కుట్టుట.

సీనియర్ శాఖ
ప్రథమ బహుమానం
బి. సత్యనారాయణమ్మ
ద్వితీయ బహుమానం
టి. వేదవల్లి

పరీక్షాధిపతి :
శ్రీమతి యమునాబాయి

జూనియర్ శాఖ

ఒక ఫ్రాకును 3 గంటల కాల పరిమితిలో కొలతల ప్రకారం కత్తిరించి డ్రాఫ్టుతీసి టాకింగు చేయుట.

సీనియర్ శాఖ
ప్రథమ బహుమానం
కె. రోహిణి
ద్వితీయ బహుమానం
కె. భగీరతి

పరీక్షాధిపతి :
శ్రీమతి యమునాబాయి

రంగులు వేయుట, అద్దకపు పని

పద్ధతి ప్రకారము ఒక గుడ్డకు రంగువేసి, పువ్వులు అద్దుట.

ప్రథమ బహుమానం
సి. ప్రసూనాంబ
ద్వితీయ బహుమానం
వి. యమ్. మల్లికాభూషణం

పరీక్షాధిపతులు :
శ్రీ కామేశ్వరరావు

ఎంబ్రాయిడరీలో పోటీలు

పని
సీనియర్ శాఖ
కలర్ ఎంబ్రాయిడరీ 3 గంటల కాల పరిమితిలో డిజయిన్ పూర్తి చేయుట.

సీనియర్ శాఖ
ప్రథమ బహుమానం
కె. భగీరతి
ద్వితీయ బహుమానం
బి. సత్యనారాయణమ్మ

పరీక్షాధిపతులు :
శ్రీమతి జగదాబాయి
శ్రీమతి సుగుణా రగడే

జూనియర్ శాఖ

కలర్ ఎంబ్రాయిడరీ 3 గంటల కాల పరిమితిలో డిజయిన్ పూర్తి చేయుట.

జూనియర్
ప్రథమ బహుమానం
టి. వేదవల్లి
ద్వితీయ బహుమానం
కె. రోహిణి

పరీక్షాధిపతులు :
శ్రీమతి జగదాబాయి
శ్రీమతి సుగుణా రగడే

దసరా వుత్సవములు

తరగతుల వారీగా నాటకములలో పోటీలు

8, 9 తేదీలలో జరిగిన నాటకములలో గెలుపొందినవారు

తమిళ డ్రామా :
ఒబీడియన్ట్
సోము, బాల భాగవతార్

తమిళం

ప్రథమ బహుమానం
ఎస్. పద్మావతి, కె. వాణి
ద్వితీయ బహుమానం
ఎ. రాధ, ఎమ్. ఆర్. నిర్మల.

హిందీ డ్రామా :
పాయిజన్ పేకెట్టు, వీచ్

హిందీ


ప్రథమ బహుమానం
శకుంతల, కె. నిర్మల
ద్వితీయ బహుమానం
జయశ్రీ, కుసుమ్ పటేల్

ఇంగ్లీషు డ్రామా :
ది ఎండ్ ఆఫ్ ది బిగినింగు

ఇంగ్లీషు

ప్రథమ బహుమానం
సుమంగళీ చెట్టూర్
ద్వితీయ బహుమానం
నళినీకత్రీ

పరీక్షాధిపతులు :
శ్రీమతి ఎ. శారదాదేవిగారు
శ్రీ శంకర నారాయణగారు
శ్రీ బాలచంద్రయాప్టే



ప్రధాని నెహ్రూ వధూవరుల నభినందించుచున్న చిత్రము.

ఢిల్లీ నగరంలో లీల పెండ్లి అతి వైభవంగా జరిగింది. ది 11-10-51న శ్రీమతి దుర్గాబాయిగారొసగిన అల్పాహార విందుకు, కేంద్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, ప్రభుత్వ ఉన్నతోద్యోగులు, పురప్రముఖులు, పలువురు వచ్చి, వధూవరుల నాశీర్వదించినారు.

దసరా వుత్సవములు

9-10-51 తేది మంగళవారం సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, పారిశ్రామిక శాఖ, ప్రింటింగు, డైయింగు, తరగతులకు జరిగిన నాటకపు పోటీలు, అందు విజయమును పొందినవారు.

నాటకం	బహుమానం
సబ్ జూనియర్ : రత్నమాణిక్యాలు	ప్రథమ బహుమానం కృష్ణవేణి; ద్వితీయ బహుమానం జి. శకుంతల
జూనియర్ : పెళ్లి చూపులు	ప్రథమ బహుమానం ఎస్. రాజ్యలక్ష్మి; ద్వితీయ బహుమానం జి. హైమవతి
సీనియర్ : సంఘ పిశాచి	ప్రథమ బహుమానం ఎ. సి. యశోధ; ద్వితీయ బహుమానం పి. రాజేశ్వరి
పారిశ్రామిక శాఖ : తెలుగు బిడ్డ	ప్రథమ బహుమానం కె. రోహిణి; ద్వితీయ బహుమానం వి. రామమ్మ
డైయింగు, ప్రింటింగు శాఖ : దొంగ పెద్ద మనిషి	ప్రథమ బహుమానం సి. ప్రసూనాంబ; ద్వితీయ బహుమానం ఝాన్సీ

పరీక్షాధిపతులు :

శ్రీమతి జి. లక్ష్మీకాంతమ్మగారు

శ్రీ జి. సూర్యనారాయణగారు

శ్రీ ప్రకాశరావుగారు

రత్నమాణిక్యాలు నాటకాన్ని ప్రదర్శించిన సబ్ జూనియర్ తరగతి వారికి నాటకపు షీల్డు యీయబడినది.

దసరా వుత్సవములు

ఆటలలో పోటీలు

28-9-1951, 29-9-1951 లలో విద్యార్థినులకు, సభ్యురాండ్రకు, వారి పిల్లలకు వివిధ ఆటలలో పోటీలు జరిగినవి.

విద్యార్థినుల షీల్డు

బంతి ఆట, పొటాటో పందెము, జండా పందెము, యీ మూడింటిలో హీరాదళము గెలిచి షీల్డు పొందినది.

విద్యార్థినుల సీనియర్ శాఖ

ఆట	ప్రథమ బహుమానం	ద్వితీయ బహుమానం
మూడుకాళ్ల పరుగు	పుష్పాగాంధీ, కె. రాజ్యలక్ష్మి	ఎన్. పద్మ, కె. నిర్మల

విద్యార్థినుల జూనియర్స్

ఆట	ప్రథమ బహుమానం	ద్వితీయ బహుమానం
మూడుకాళ్ల పరుగు	శశికళ, మోహిని	జయశ్రీ, బి. ఎస్. ప్రభ

సంభ్యురాండ్రు వారి పిల్లలకు

సీనియర్ శాఖ

ఆట	ప్రథమ బహుమానము	ద్వితీయ బహుమానము
రొట్టె తినే పందెము	జి. లీల	శ్యామలా రగడే
పరుగెత్తు పందెము	శ్రీ లత	ప్రమీళ
మ్యూజికల్ చెయిర్స్	శ్యామలా రగడే	ఊర్మిళ
మూడుకాళ్ల పరుగు	సుచరిత, శ్రీ లత	లీల, ప్రమీళ

సీనియర్ శాఖ

నిమ్మపండూ, చంచా	కె. సి. అన్నపూర్ణ	ఇందిరా గోపాల్
ఎల్జిబత్ ఆట	కె. సి. అన్నపూర్ణ ఇందిరా గోపాల్	జయలక్ష్మి, రమాదేవి
బుక్కు బేలన్సింగ్	ఆర్. రంగనాయకమ్మ	రాధాబాయి
మ్యూజికల్ చెయిర్స్	ఎ. సరస్వతి	జి. పాపాయి
సూదీ దారం	జి. పాపాయి, రమాదేవి	కె. సి. అన్నపూర్ణ ఇందిరా గోపాల్

దసరా వుత్సవములు


దసరా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగి పోయాయి. కార్య నిర్వాహక వర్గ సభ్యురాండ్రు, సభ్యురాండ్రు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థినుల తోడ్పాటులో యీ కార్యక్రమాన్ని జయప్రదంగా జరిపించారు. దేవీపూజ, కొలువు, పేరంటం క్లబ్బుశాఖా సభ్యురాలు శ్రీమతి కస్తూరి రుక్మిణమ్మగారు, వక్తృత్వపు పోటీలు సారస్వతశాఖ వారైన శ్రీమతి అచ్యుతిని గిరిజ, శ్రీమతి గిడుగు లక్ష్మీకాంతమ్మ గారలు వివిధ తరగతులు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయుల సహకారంతో నిర్వహించారు. తమిళ విద్యార్థినుల సంఖ్య అధికముగా నుండుటచే, యీ సంవత్సరము తమిళములో వక్తృత్వపు పోటీలు క్రొత్తగా ప్రారంభింప బడ్డాయి. క్రీడాశాఖ సభ్యురాలు శ్రీమతి రత్నావళిగారు, సభ్యురాండ్రకు, విద్యార్థినులకు గూడ ఆటలలో పోటీలు జరిపించినారు—కళాశాఖవారు శ్రీమతి కమలాబాయి, కమలామణి గార్లు, నాటకముల పోటీలు, శ్రీమతి సుబ్బలక్ష్మమ్మగారు సంగీతపు పోటీలు ఏర్పాటు చేశారు. ఇదీగాక, యీసారి, చేతి పరిశ్రమలలో పోటీలు ఒక క్రొత్త విషయము. నూలు వడకుటలోనే గాక, నవారునేత, తువాలునేత, కుట్టు, ఎంబ్రాయిడరీ, రంగు అద్దకపు పనులలో కూడ పోటీలు జరిగినవి. శ్రీమతి కస్తూరి రంగనాయకమ్మగారు, ప్రాథమికశాఖ ఉపాధ్యాయ వర్గ సహకారంతో యీ పోటీలు జరిపించారు.

పండుగలు మూడు రోజులలో, చేతిపనుల ప్రదర్శన మొకటి జరిగినది. విద్యార్థినులు నేసిన బట్టలు, కుట్టిన వివిధ రకముల దుస్తులు, అల్లిన అల్లికలేగాక, కొందఱు సభ్యురాండ్రుకూడ తయారు చేసిన వస్తువులను ప్రదర్శించిరి. విజయ దశమినాడు పిల్లలనృత్యం, నృత్యోపాధ్యాయిని శ్రీమతి సాంబ్రాజ్యంగారి కృషి ఫలితం.

వివిధ పోటీలకూ, పరీక్షాధిపతులుగా, మేము కోరినంత మాత్రంలో అంగీకరించి, సహకరించిన విజ్ఞులందఱకు మా కృతజ్ఞత. విజయ దశమినాడు బహుమతులు పంచుట కంగీకరించిన శ్రీపవని జమీందారిణీగారికి, వివిధ శాఖలలో కృషి చేసిన కార్య నిర్వాహక సభ్యురాండ్రకు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు, తదితరులకు మా కృతజ్ఞత.

కార్యదర్శినులు.
ఆంధ్ర మహిళా సభ.

★



అల్పాహార విందు సమయంలో
పెండ్లికూతురు లీల, శ్రీమతి కుట్టీ శివరామ్,
శ్రీ ప్రకాష్, శ్రీ గాడ్గిల్ మున్నగువారితో.

ఆంధ్ర రాష్ట్ర మహిళా సంఘ కార్యదర్శి ప్రకటన

* * *

హిందూ ధర్మశాస్త్ర క్రోడీకరణ బిల్లును ప్రస్తుతము సమయము చాలనందున ఉపసంహరించు కున్నామని చెప్పుట, ఈ పార్లమెంటు సమావేశములోనే, ఈ బిల్లు చట్టరూపము పొందగలదని ఆశాభావముతో నున్న స్త్రీలలో చాలా ఆందోళన కలిగించుచున్నది. స్త్రీలజన్మ హక్కులను స్వాతంత్ర్యమును గురించిన ఈ బిల్లునకు సమయములేదు, కానీ పత్రికా స్వాతంత్ర్యమును అరికట్టు ప్రెస్‌బిల్లు మున్నగు వాటికి సమయమున్నదా? రాబోవు ఎన్నికలలోపల యీ బిల్లు ఆమోదింప బడకుండా చూచిన, క్రొత్తపార్లమెంటు మరి అయిదు సంవత్సరములు జాగు చేయును. అభివృద్ధి నిరోధకులు, సనాతనాచారులు, ధనాఢ్యులునైన, కొంతమంది కోరకు, బిల్లును ఉపసంహరించుకొనుట భావ్యము కాదు. స్వాతంత్ర పోరాటములో స్త్రీలు పాల్గొనలేదా? కష్టపడి సాధించి తెచ్చుకొన్న స్వతంత్రము సంపూర్ణముగా అనుభవించు హక్కు వారికి లేదా? నేడు దేశమాతకు పరిపూర్ణ స్వాతంత్ర్యము లేదు. కారణమేమి? నూటికి అరువదిమంది స్త్రీలు. వీరికి ఆర్థిక, సాంఘిక హక్కులులేవు. రాజకీయ హక్కులు కలవనెదరు. ఆర్థిక స్వాతంత్ర్యము లేనివారికి, రాజకీయ స్వాతంత్ర్యమెచటనుండి వచ్చును. ప్రతీది యీ కాలములో అర్థము మీదనే కదా అధారపడి యున్నది. సగమునకు పైగా యున్న ఒక వర్గమునకు లేని స్వాతంత్ర్యము దేశమునకు ఎట్లు లభించును. ఆ దేశము ఏ మాత్రము ఉన్నతిని పొందగలదు. మన దేశములో అధిక సంఖ్యాకులు మధ్యతరగతికి చెందినవారు. వారికి యీ బిల్లు ఎంతో తోడ్పడ గలదు. దేశపురోభివృద్ధిని కోరిన స్త్రీకాని పురుషుడుకాని, తమతో పాటు, వెనుకబడిన స్త్రీలను ముందుకు తీసుకొని వచ్చుటకు ప్రయత్నించుటే కాక, హిందూ ధర్మశాస్త్ర క్రోడీకరణ బిల్లువంటి ఆదర్శప్రాయమైన బిల్లులు చట్టరూపము పొందునట్లు చూడవలెను. లేకున్న మనము మరి వంద సంవత్సరములు వెనుకకు నడువవలసి వచ్చును. ఈ రోజున ఆదర్శప్రాయమై, మధ్యలో పోగొట్టుకొన్న హక్కులను, స్త్రీలకు ప్రసాదించునట్టి ఈ బిల్లు ఉపసంహరించు కొనబడినదన్న కారణమెవరు! స్త్రీలే. స్త్రీలలో ఐక్యత, విద్య, విజ్ఞానము, వికాసము లేకపోబట్టి, దేశకాల పరిస్థితులను అర్థము చేసుకొనలేక దుర్గాబాయమ్మగారివంటి వారెవరయినా సాంఘికాభ్యుదయమునకు పాటుపడుచు, దురాచారములను ఖండించి అలజడి కలిగించిన, వారికి తోడ్పడక, వారిని చూచినవ్వి, హాస్యముచేసి, యీ గతికి వచ్చినాము. మన జనాభాకు తగిన ప్రాతినిధ్యము పార్లమెంటులోగాని, ఎసెంబ్లీలోగాని లేదు. వయోజన వోటింగు ప్రకారము ప్రతి స్త్రీకి వోటువున్నది. యిప్పటి కయినా స్త్రీలు మేల్కొని వోటు దుర్వినియోగము చేయక జిల్లాకు అథమము యిరువురు స్త్రీలనైనా అసెంబ్లీకి ఎన్నుకొనులాగును, జిల్లాకు ఒక్క స్త్రీనయినా మన ప్రతినిధిగా పార్లమెంటుకు వెళ్లులాగును చూచుకొనుట, చాలామంచిది. అంతేకాకుండా స్త్రీలు కాని, పురుషులుకాని అభ్యుదయ దృక్పథము, నిజాయతీ, శక్తి సామర్థ్యములు కలిగి తమ బాధ్యతలను తెలుసుకొని నిర్వర్తించ గలవారినే అభ్యర్థులుగా ఎన్నుకోవలెను.

సి. వి. లక్ష్మిరెడ్డి
కార్యదర్శిని.

ఉత్తర మద్రాసులోని తెలుగు విద్యార్థినుల కడగండ్లు

ఉత్తర మద్రాసు ప్రాంతమున చాలమంది తెలుగువారు వున్నారు. ఇచ్చట తెలుగు బాలికలకు తెలుగున పాఠాలు నేర్పే మిడిల్ స్కూలుగాని, హై స్కూలుగాని లేనందున విద్యా సౌకర్యం చాల కొరతగావుంది. ఈ ప్రాంతములోని పి. టి. త్యాగరాయ చెట్టి హైస్కూలులో బాలబాలికలకు తెలుగు, తమిళ భాషలలో చాల సంవత్సరాలుగా పాఠములను సమర్థతో నేర్పుతున్నారు. కాని పోయిన సంవత్సరము నుంచి ఆ స్కూలులో ఏ తరగతిలోగాని బాలికలను చేర్చుకోడం పూర్తిగా మానివేశారు. తమిళములోనే విద్యా బోధచేయు సెంట్ ఆనీస్ కాన్వెంట్ గరల్సు హైస్కూలు, నార్త్విక్ గరల్సు హైస్కూల్ ఈ ప్రాంతములోనే యున్నవి. అందువల్ల తమిళ బాలికలకు విద్యాభ్యాసములో ఎట్టి చిక్కులులేవు. తెలుగులో విద్యా బోధనచేసే ఇతర మిడిల్ స్కూలుగాని హై స్కూలుగాని లేకపోవడం చేత ఇచ్చటి తెలుగు బాలికలు చదువుకొనుటకు అవకాశం లేక అనేక కడగండ్లు పడుతున్నారు.

ఈ ప్రదేశానికి, జార్జిటువున్ ప్రాంతానికంతకు నారాయణ మొదలి వీధి, జి. టి. లో, కె. టి. సి. సి. గరల్సుస్కూలు ఒక్కటే తెలుగు హైస్కూలు వున్నది. ఈ స్కూలు ఉత్తర మద్రాసు బాలికలకు చాల దూరం. బస్సు, ట్రాము మార్గములకు చేరువలేదు. అచ్చటి బాలికలను వేరు సౌకర్యముల ద్వారా పంపుటకు సామాన్య గృహస్థునికి వీలుకాని పని. కావున చాలమంది తెలుగు బాలికలు విద్యనభ్యసించుటకు వీలులేక ఇంటియందు వుండుట తటస్థించుచున్నది.


మద్రాసు నగరమున అన్ని భాషల వారుండుట చేత వారందరికి వారివారి మాతృ భాషలలో విద్యా బోధనము చేయుట ప్రభుత్వ ధర్మం. ప్రభుత్వాధికారులు తగుశ్రద్ధ వహించి సెంట్ ఆనీస్ కాన్ వెంట్ గరల్సు హైస్కూలులో గాని లేక నార్త్విక్ గరల్సు హైస్కూలులోగాని వచ్చే జూన్ నుండి అయినను తప్పక తెలుగు సెక్షన్లు ఆరంభించునట్లు చేయవలయును. ఇచ్చట నుండు నార్త్ మద్రాసు హయ్యర్ ఎలిమెంటరీ గరల్సు స్కూలులో ఎనిమిదవ క్లాసువరకు తమిళము, తెలుగు భాషలలో బోధించుచున్నారు గాన, తెలుగు సెక్షనుల నుంచు పరతుతో, దీని మేనేజిమెంటుకు ప్రభుత్వం తగు ప్రోత్సాహమిచ్చి హైస్కూలుగా రాబోవు సంవత్సరము నుండి యైనా మార్పించునట్లు చేసినచో ఇచ్చటి తెలుగు బాలికల విద్యకు విఘ్నం లేకుండా పోవును.

వి. పాండు రంగరావు, మద్రాసు.

★



వాహినీవారి 'మల్లీశ్వరిలో' భానుమతి, ఎన్. టి. రామారావు.



"ఇదా స్వరాజ్యం"

రచన : యస్. టి. సుదర్శనాచార్య.

చిరునామా—127 రాయపేట హైరోడ్,

మైలాపూరు, మద్రాసు.

ఇది హిందూ ముస్లిమ్ సమైక్యతావశ్యకతను తెలిపే సాంఘిక విషాదాంత నాటకం. హైదారాబాదు పరిస్థితుల నాధారముగా జేసికొని, ఈ పుస్తకం రంగస్థలముపై ప్రదర్శించుటకు వీలుగా వ్రాయబడినది.

రజాకార్ల కాలంలో హైదరాబాదు అల్లరులకు గురియైన ఒక అనాథ మహమ్మదీయ బాలిక, రెహనా, కాందిశీకులతో చేరి బెజవాడవచ్చి ఆకలి మంటచే తిరుగుతూ ఒక ఛాందస బ్రాహ్మణుని ఇంటి అరుగుపై విశ్రమించగా, ఆ యజమాని వెళ్లగొడతాడు. నెమ్మదిగా వస్తూంటే, ఆ ఇంటి యజమాని ఏకైక పుత్రుడు, విద్యార్థి "రవితో" రెహనాకు పరిచయం కలుగుతుంది. పరిచయం ప్రణయంగా మారి, రవి సంఘాన్ని, తండ్రిని ధిక్కరించి, రెహనాను పెండ్లి చేసుకుంటాడు. హైదరాబాదు భారత యూనియన్‌లో చేరిన అనంతరం, అచటికి పోయి రవి ఉద్యోగంలో ప్రవేశించి రెహనాతో ఖులాసాగా ఉంటాడు. హిందూ సంపర్కం చేసిందని, అక్కడ ఒక మహమ్మదీయ పెద్ద, రవిని హత్యచేస్తామని రెహనాని బెదరిస్తాడు. రవిని అలక్ష్యంగా చూస్తే అతనే వదలి పెడతాడని రెహనాకు సలహా నిస్తాడు. రెహనా నడతచూచి రవి వ్యాధిగ్రస్థుడయి, తండ్రివద్దకు పోగా, తండ్రి తరిమేస్తాడు. రెహనామీద ప్రేమతో, రవి తిరిగి హైదరాబాదు వస్తూంటే, రవిని హత్యచేస్తారు. ఇది తెలిసి రెహనా వస్తూంటే, ఒక రజాకర్ ఆమెను చంపేస్తాడు.

కథ సంగ్రహంగా ఇది. తెరతీయగానే జ్యోతిష్కాంతు డొస్తాడు. దీనికి, కథకీ ఏమీ సంబంధంలేదు. ప్రియురాలి కోసం భావకవి విలాపం బాగుగా చిత్రించినను, జ్యోతిష్కాంతుని పాత్ర మొదటిలోనే ప్రత్యక్ష మగుట అసమంజసం. రవి తండ్రి పాత్రపోషణలో 'డ్రామటిక్ కాంట్రాస్ట్' కనపడదు. మరణావస్థలో దీనుడైవచ్చినకొడుకు పట్ల—అందులోనూ ఏకైక పుత్రుడు—ఏ తండ్రియూ అంత కఠినంగా నుండడు. మాతృ ప్రేమను చూపు తల్లి పాత్ర సహజంగానే ఉంది.

రెహనాను నిష్కల్మష హృదయగా చిత్రించి, ఆమెకు నీచతనం ఒడిగట్టడం పొరపాటు. రెహనా రవిని మనసారా ప్రేమించింది. తర్వాత, ఒక ఫిలిం ప్రొడ్యూసర్, సినీమాలో చేరిపిస్తానని వేయిరూపాయిలు నెలకిస్తారని చెప్పగానే, రవి తన కిష్టంలేదని చెప్పినా, రెహనా అతని మాటలని తిరస్కరిస్తుంది. మహమ్మదీయ పెద్ద వచ్చి రవిని అలక్ష్యంచేస్తే అతడే పోతాడని చెప్తే, తన కిష్టంలేకనే ఆ పని చేస్తుంది.

రవి పాత్రను రచయిత బాగానే చిత్రించారు. నాటకం రచనాశైలి రంగస్థలానికి వీలగునట్లే వుంది. అందలి పాటలు గూడా ఆయారంగాలకు తగినట్లుగానే వున్నాయి.

* * *

గ్రంధ సమీక్ష

"ఎదురుగాలి"

శ్రీ సూరి, సాహిణీ పబ్లికేషన్స్;
బకింగ్‌హామ్‌పేట, విజయవాడ. వెల రు. 1-8-0

రవీంద్రనాథ మైత్ర వ్రాసిన బెంగాలీ గ్రంథానికీ పుస్తకం అనువాదం. సామాజిక జీవితంలో మానవులకు కలిగే కష్ట నిష్టూరములను, అపవాదులను ఈ నవల తెలియబరుస్తుంది.

యాదవ భట్టాచారి ఒక జమీందారు. గంగూలీ అతని మిత్రుడు, ఎస్టేటు మేనేజరున్నూ. లక్ష్మిగంగూలీ పుత్రిక. మొదటినుండీ తన ఎస్టేటు వ్యవహారాలను చక్కబెట్టి వృద్ధిచేసిన గంగూలీ చనిపోగా అతని కుటుంబాన్ని పోషిస్తున్న ఆ జమీందారుని సంఘం ఈర్ష్యాభావంతో ఎట్టి అపవాదులకు లోనుచేయునో ఈ నవల వ్యక్తపరుస్తుంది. జమీందారు తదనంతరం అతని ఏకైక పుత్రుడు, రమేశ్, కూడా సంఘాన్ని లెక్కచేయక తమ లక్ష్యాన్ని కాపాడి లక్ష్మిని వివాహం చేసుకుంటాడు.

ఈ నవలలో లక్ష్మి, రమేశుల పాత్ర బాగుగా చిత్రింపబడినది.

—గి. లక్ష్మికాంతమ్మ.

★

ఆంధ్ర మహిళా సభ

గాంధీజీ జయంతి

అక్టోబరు 2-వ తేదీని 3 గం॥ నుండి, 5 గం॥ వరకు, శుభ విద్యార్థినులు, సభ్యురాండ్రు, ప్రార్థనలతో, నూలు వడికిరి. శ్రీ కె. బాలకృష్ణారావుగారు, శ్రీమతి కె. రమాదేవి గారు జాతీయ గీతములను పాడిరి.

తదనంతరము జరిగిన సభలో, అధ్యక్షులైన శ్రీ శొంఠి వెంకట రామమూర్తిగారు ఉపన్యసిస్తూ, ఆధ్యాత్మిక శక్తి యొక్క ఔన్నత్యాన్ని ఋజువుచేస్తూ, భారత జాతి యొక్క కీర్తిని దేశదేశాల వెదజల్లినది గాంధీజీయేయనీ, మత ప్రవక్తలకువలె, తమ సిద్ధాంతాలకు విపుల ప్రచారం చేయగల్గిన శిష్యవరులు ఏ వినోబాభావే, స్వామి సీతారాములవంటివారు తక్క, పెక్కుమంది లేకున్నా, సామాన్యుని అభ్యుదయానికి గాంధీజీ స్వయంగా చేసిన కృషివల్ల, దేశదేశాల సామాన్య ప్రజకు ఆయన ఆత్మీయుడయ్యాడనీ చెప్పారు.

శ్రీ పందిరి మల్లిఖార్జునరావు, శ్రీమతి శారద, శ్రీమతి సత్యవతిగార్లు గాంధీజీ సిద్ధాంతాలు, ఉద్బోధలు, ప్రజాకర్తవ్యాలను గూర్చి ఉపన్యసించారు. చిరంజీవి గిడుగు భారతి జాతీయ గీతాలు, జనగణమన గానంతో సభ ముగిసింది.


ఆంధ్ర మహిళా సభ

"చిట్టి తల్లుల భరత నాట్య ప్రదర్శనము"

దక్షిణ హిందీ ప్రచార సభవారు, ఇటీవల జరిపించిన 'సాంస్కృతిక సప్తాహము' 21—10—'51 న, గోకలే హాలులో, తెలుగు భాషా ఉత్సవముతో ప్రారంభమైనది. ఈ సందర్భములో, ఆంధ్ర మహిళా సభ నృత్యశాఖ విద్యార్థిను లొసంగిన భరత నాట్యము, రసలీల, గడ్డికోత యిత్యాది జానపద నృత్య ప్రదర్శనము, సభికుల అభినందనాలను అందుకున్నది. సర్. ఎమ్. సిటి. ఎమ్. హైస్కూలు సీనియర్ తెలుగుపండిట్ విద్వాన్ మంకాల శ్రీపతిగారు "సుశబ్దోచ్చారణతో గూడిన గానము, చిట్టి తల్లుల ముద్దు లొలికెడి హావభావ ప్రకటనలతో గూడిన భరత నాట్య ప్రదర్శనము నిరుపమానమై, నన్ను ముగ్ధుని జేసినవి—లలిత కళలను తెలుగు బిడ్డలకు నేర్పుతూ, తెలుగు మహిళల కళా కౌశలమును పెంపొందించుచున్న ఆంధ్ర మహిళా సభ ఆచంద్ర తారార్కమై వెలయుచుండును గాక" యని, నృత్యోపాధ్యాయిని శ్రీమతి సామ్రాజ్యంగారికి లిఖిత పూర్వకముగా తమ అభినందనములను తెలియపరచిరి.



SISTA'S - KM (S) 04



వాహినీవారి 'మల్లీశ్వరి'లో భానుమతి

Edited and published by G. Durgabai, M.A., B.L., at the Andhra Mahila Sabha, Mylapore, Madras.
Printed by M. Satyanarayana at the H. Prachar Press, 12, Thanikachalam Chetty Road, T'Nagar, Madras.



ఆంధ్ర మహిళాసభ

పారిశ్రామిక విద్యాలయము

చేనేత వస్త్రములు :—80, 60 నవంబరు చీరెలు, ధోవతులు, సన్నటి, ముతక నేత తువాళ్లు దుప్పట్లు, నవారు, సాదా, సార్లగుడ్డలు, ఇక్కడ తయారగుచున్నవి. వివిధ రంగులలో, నేత, అద్దకపు పనులు ఇక్కడ జరుగుచున్నవి.

ఇంకా :— స్త్రీలకు, పిల్లలకు, వివిధ రకముల దుస్తులు, రకరకముల ఎంబ్రాయిడరీ లేసు అల్లిక పనులు ఇక్కడ చేయుచున్నారు.

ఇక్కడ తయారైన సామాన్లు కొనిగాని, మీకు ఇచ్చవచ్చిన నమూనాలలో దుస్తులు పురమాయించిగాని, యీ సంస్థను పోషించండి. మీ సహకారము అమూల్యమైనది.

మీ రిక్కడ వెచ్చించిన ధనము, బీదయువతుల విద్య నిమిత్తము వినియోగింపబడునని మరువకండి.

కరెస్పాండెంటు

ఆంధ్ర మహిళాసభ పారిశ్రామిక శాఖ.

ఆంధ్రమహిళ

సచిత్ర మాస పత్రిక

సంవత్సర చందా— రూ. 6—0—0 లు.

స్త్రీ రచయితలు ఈ అవకాశమును పురస్కరించుకొని, విజ్ఞానయుతమైన తమ అమూల్య రచనలను పంపించండి.

స్త్రీ విద్యాభిమానులు— స్త్రీల విద్యా సంస్కృతుల అభివృద్ధికై కృషిచేయుచున్న యీ పత్రికను పోషించండి.

సంపాదకురాలు

ఆంధ్ర మహిళ.



అందచందాలకు
కో-ఆప్టెక్స్
వస్త్రాలు

మద్రాస్ హాండ్‌లూం వీవర్స్ ప్రావిన్షియల్
కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్
ఎగ్మూరు :: మద్రాసు